మంగళవారం 7.4.2020 • సంపుటి 9 • సంచిక 283 • వెల. రూ. 6.50 | కరీంనగర్ పేజీలు : 12 | చతుర్దశి

సూర్యోదయం: ఉదయం 6.04, సూర్యాస్తమయం: సాయంత్రం 6.26, శార్వరి సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం చతుర్దశి మధ్యాహ్నం 12.02 వరకు, తదుపరి పూర్ణిమ, నక్షత్రం: ఉత్తర ఉదయం 9.16 వరకు, తదుపరి హస్త, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: మధ్యాహ్నం 3.20 నుంచి సాయంత్రం 4.53 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.32 నుంచి 9.22 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.19 నుంచి 3.07 వరకు, వర్జ్యం: సాయంత్రం 4.34 నుంచి 5.56 వరకు.

PUBLISHED FROM KARIMNAGAR • HYDERABAD • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD
www.ntnews.com /ntdailyonline




మహిళలకు కరోనా ముప్పు తక్కువ

## అబల కాదు ఆమె సబల

భారతదేశంలో కరోనా పాజిటివ్ కేసుల్లో
**29%** మహిళలు
**71%** పురుషులు
మరణాల్లోనూ పురుషులే అత్యధికం.

అమెరికాలోని 50 రాష్ట్రాలకు 30 చోట్ల కరోనా కేసుల్లో మహిళల శాతమే ఎక్కువ. కానీ మరణాల్లో పురుషుల శాతమే ఎక్కువగా ఉన్నది.

- వైరస్‌ను తట్టుకోవడంలో పురుషులకంటే మెరుగైన సామర్థ్యం
- అమెరికా కరోనా మరణాల జాబితాలో పురుషులే అధికం
- న్యూయార్క్ సహా అనేక రాష్ట్రాల అధ్యయనంలో స్పష్టం
- భారత్‌లో, ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ ఇదే పరిస్థితి
- జన్యు నిర్మాణంలోనే వైరస్‌ను తట్టుకునే శక్తి ఉన్నదంటున్న శాస్త్రవేత్తలు

4

## కరోనా రక్కసికి 1200 రూపాలు

- ఫ్లూ కంటే చాలా శక్తిమంతం
- అమెరికాలో మరణమృదంగం
- రోజురోజుకూ మరింత ఉద్ధృతం
- పూర్తి లాక్‌డౌన్ అసాధ్యం
- తుపాకీ సంస్కృతే కారణం
- నమస్తే తెలంగాణతో ప్రముఖ వైద్యనిపుణుడు డాక్టర్ భరత్‌రెడ్డి



వాస్తవానికి కరోనా కూడా ఫ్లూ వైరస్ లాంటిదే. కానీ చాలా శక్తిమంతమైనది. ఫ్లూ వైరల్ లోడ్ కంటే దాదాపు 10,000 రెట్లు ఎక్కువ వైరల్ లోడ్‌ను కలిగివుండే కరోనా.. కేవలం రెండు, మూడురోజుల్లోనే విస్తృతమవుతున్నది. అందుకే దీన్ని కట్టడిచేయడం మనవల్ల కావడంలేదు. ఈ వైరస్ చాలా వేగంగా తన జన్యుస్వరూపాన్ని మార్చుకొంటున్నది. కరోనా ప్రారంభమైన వుహాన్‌లో ఈ వైరస్ 200 రకాల రూపాల్లో ఉన్నట్టు గుర్తించారు. ఇప్పటివరకు జరిగిన అధ్యయనాల ప్రకారం కరోనా జన్యుపరంగా సుమారు 1,200 రూపాల్లో ఉన్నట్టు తెలుస్తున్నది.

4



## పెద్దపులికీ వైరస్ సోకింది

- దేశవ్యాప్తంగా జంతుప్రదర్శనశాలల్లో హైఅలర్ట్
- హైదరాబాద్, వరంగల్ జూలలో అప్రమత్తం
- అమెరికాలో పులికి కరోనా నేపథ్యంలో చర్యలు

**అమెరికా** జూలో ఓ పులికి కరోనా సోకిన నేపథ్యంలో మన దేశంలో అన్ని జూలల్లో హైఅలర్ట్ ప్రకటిస్తున్నట్టు సెంట్రల్ జూ అథారిటీ (సీజెడ్‌ఏ) సోమవారం పేర్కొన్నది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు లేఖలు రాసినట్టు సీజెడ్‌ఏ కార్యదర్శి ఎస్పీ యాదవ్ తెలిపారు. అధికారులందరూ జూలలోని జంతువులను సీసీటీవీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షించాలని, ఏమైనా జంతువులు అసాధారణ లక్షణాలతో విచిత్రంగా ప్రవర్తిస్తే సమాచారమివ్వాలన్నారు. కరోనా పరీక్షల కోసం అలాంటి జంతువుల నమూనాల్ని పక్షానికొకసారి ఉన్నతాధికారులకు పంపాలని చెప్పారు.

5



కరోనాపై పోరాటానికి రూ.5 కోట్ల విలువైన ఔషధాలు, ఎన్ 95 మాస్కుల విరాళానికి సంబంధించిన సమ్మతిపత్రాన్ని సోమవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు అందిస్తున్న రెడ్డీస్ ల్యాబ్స్ చైర్మన్ సతీశ్, ఎండీ జీవీ ప్రసాద్

- లాక్‌డౌన్ వల్ల కలిగే ఆర్థికనష్టాన్ని పూడ్చుకోగలం.. కానీ ప్రజల జీవితాలను, ప్రాణాలను తిరిగి తీసుకురాగలమా?
- మరో రెండువారాలు కొనసాగితేనే ఉపశమనం.. సడలిస్తే మళ్లీ ప్రమాదం ముంచుకురావచ్చు.
- ప్రపంచానికే పెద్ద పీడ. ఏ వ్యక్తికో, కుటుంబానికో కాదు. యావత్ మానవజాతి ఎదుర్కొంటున్న సంక్షోభం.
- న్యూయార్క్‌లో శవాలగుట్టలంటూ కథనాలు వస్తున్నాయి. దయనీయ పరిస్థితి. ఆ దుఃఖం ఎవరికీ రావొద్దు.
- చిల్లర రాజకీయాలకు ఇది సమయం కాదు: మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

సఫాయన్నా నీకు సలాం

వైద్యులకు చేతులెత్తి మొక్కుతున్న



# లాక్‌డౌన్ ఉండాల్సిందే!

నా వ్యక్తిగత అభిప్రాయమైతే లాక్‌డౌన్ మరికొంతకాలం పొడిగించాలి. ఇదే విషయాన్ని ప్రధానమంత్రికి కూడా చెప్పిన. తెలంగాణ ప్రజల ముందు కూడా నా అభిప్రాయం పెడుతున్న. ఎందుకంటే మనం ఆర్థిక నష్టాన్ని పూడ్చుకోగలం. కానీ ప్రజల జీవితాలను, ప్రాణాలను తిరిగి తీసుకురాలేం. ప్రస్తుత పరిస్థితుల్లో ఇండియాలో పూర్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉంది. ఈ పరిస్థితుల్లో ఈ వ్యాధి నుంచి సస్టెయిన్ కాలేం. లాక్‌డౌన్ ఒక్కటే మన దగ్గర ఉన్న ఆయుధం.

వైద్యసిబ్బందికి 10 శాతం స్థూలవేతనాన్ని సీఎం గిఫ్ట్‌గా ఇవ్వనున్నాం. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రూ.7500, మున్సిపాలిటీలు, పంచాయతీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు రూ.5000 సీఎం గిఫ్ట్‌గా ఇస్తాం.. - ముఖ్యమంత్రి కేసీఆర్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రానికి, దేశానికి కరోనా నుంచి పూర్తిగా విముక్తి లభించాలంటే దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ మరికొంతకాలం కొనసాగాల్సిందేనని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అభిప్రాయపడ్డారు. అభివృద్ధి చెందుతున్న, వైద్య సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో లేని మనలాంటి దేశానికి లాక్‌డౌన్ తప్ప గత్యంతరం లేదని స్పష్టంచేశారు. అమెరికా, స్పెయిన్, ఇటలీ వంటి దేశాల పరిస్థితి మనకు రాకూడదని ఆకాంక్షించారు. లాక్‌డౌన్‌ను సడలిస్తే.. పరిస్థితి చేజారిపోతుందని పేర్కొన్నారు. లాక్‌డౌన్ వల్ల కలిగే ఆర్థిక నష్టాన్ని పూడ్చుకోగలం కానీ ప్రజల ప్రాణాలను వాపసు తీసుకురాలేమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన ప్రతిపాదనపై సానుకూలంగా స్పందిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. లాక్‌డౌన్‌లో ప్రజలు గొప్పగా సహకరించారన్న సీఎం.. ఇంకా సహకరించాలని కోరారు. రాష్ట్రంలో కరోనా నియంత్రణకోసం రేయింబవళ్లు పనిచేస్తున్న వైద్యసిబ్బంది, పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులను ముఖ్యమంత్రి కొనియాడారు. వైద్యసిబ్బందికి 10శాతం స్థూలవేతనాన్ని సీఎం గిఫ్ట్‌గా ఇవ్వనున్నట్టు

మిగతా 2వ పేజీలో

## లాక్‌డౌన్ ఎత్తేస్తే ముప్పే

- 21 రోజులు సరిపోవన్న కేంబ్రిడ్జి వర్సిటీ అధ్యయనం
- 49 రోజులు పొడిగిస్తేనే కట్టడి చేయొచ్చని సూచన

5

## కరోనా వీరనారి

- తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లకు నీతిఆయోగ్ ప్రశంస
- మంత్రి కేటీఆర్ ట్వీట్‌తో జాతీయస్థాయి గుర్తింపు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలోని అంగన్‌వాడీ టీచర్లపై జాతీయస్థాయిలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. కరోనా వైరస్ నియంత్రణలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాన్ని ములుగు జిల్లాలో ఎంతో అంకితభావంతో అమలుచేస్తున్న అంగన్‌వాడీ టీచర్‌ను 'సిటిజెన్ హీరో'గా అభినందిస్తూ రాష్ట్ర మున్సిపల్, ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ చేసిన ట్వీట్‌ను నీతిఆయోగ్ ప్రశంసించింది. రమణమ్మ లాంటివారిని 'ఇండియా కరోనా వారియర్స్'గా అభివర్ణించింది. కరోనా నియంత్రణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం.. అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు ఇచ్చే సరుకులను వారి ఇండ్లకే తీసుకెళ్లి ఇవ్వాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయం మేరకు ములుగు జిల్లా వాజేడు మండలం చింతూరు గ్రామ అంగన్‌వాడీ టీచర్ రమణమ్మ స్వయంగా తన స్కూటీపై సరుకులను తీసుకెళ్లి తండాల్లోని లబ్ధిదారులకు అందజేశారు. కోడిగుడ్లు, బియ్యం, పప్పులు, నూనెలు, బాలామృతం లాంటి పదార్థాలను లబ్ధిదారులకు పంపిణీచేశారు. ఇదేమీ అమెజాన్ సర్వీస్ కాదని, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమం కోసం సరుకులను ఇంటింటికీ తీసుకెళ్లి అందిస్తున్నామని రాష్ట్ర

మిగతా 4వ పేజీలో

## ప్రధాని, ఎంపీల జీతాల్లో 30% కోత

- కరోనాపై పోరాటంలో భాగంగా కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం
- రెండేండ్లపాటు ఎంపీ ల్యాడ్స్ పథకానికి నిధులు నిలిపివేత
- తక్కువ వేతనాన్ని తీసుకోవడానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చిన రాష్ట్రపతి, గవర్నర్లు
- ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు సిద్ధమవ్వాలని మంత్రులకు మోదీ పిలుపు



కరోనా మహమ్మారిపై పోరాటంలో భాగంగా కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు ప్రధాని, కేంద్ర మంత్రులు, 750 మంది ఎంపీల వేతనాల్లో ఏడాదిపాటు 30 శాతం కోత విధించాలని సోమవారం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన వేతనం, అలవెన్సు, పెన్షన్ ఆఫ్ మెంబర్స్ ఆఫ్ పార్లమెంట్ యాక్ట్, 1954 ఆర్డినెన్స్‌కు సవరణ చేసి ఆమోదం తెలిపింది. ఈ నెల ఒకటి నుంచి ఈ కోత అమల్లోకి వచ్చిందని వివరించింది.

5

ప్రపంచవ్యాప్తంగా
మొత్తం కేసులు: **13,29,305**
మరణాలు: **73,831**
కోలుకున్నవారు: **2,77,329**



| దేశం | కేసులు | మృతులు |
|---|---|---|
| అమెరికా | 3,56,414 | 10,490 |
| స్పెయిన్ | 1,35,032 | 13,169 |
| ఇటలీ | 1,32,547 | 16,523 |
| జర్మనీ | 1,01,558 | 1,662 |
| ఫ్రాన్స్ | 98,010 | 8,911 |

మొత్తం కేసులు: **4,778**
మృతులు: **136**
కోలుకున్నవారు: **375**

యాక్టివ్ కేసులు: **308**
మృతులు: **11**
కోలుకున్నవారు: **45**




లాక్‌డౌన్-డే 15

ఉష్ణోగ్రతలు

| | గరిష్ఠం | కనిష్ఠం | | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|---|---|---|
| హైదరాబాద్ | 36.2°c | 26.2°c | మెదక్ | 36.0°c | 24.0°c |
| కరీంనగర్ | 38.0°c | 24.0°c | ఆదిలాబాద్ | 37.4°c | 23.2°c |
| వరంగల్ | 35.0°c | 24.0°c | నిజామాబాద్ | 38.9°c | 26.1°c |
| రంగారెడ్డి | 36.0°c | 23.0°c | మహబూబ్‌నగర్ | 39.3°c | 27.8°c |
| నల్లగొండ | 38.5°c | 23.6°c | ఖమ్మం | 39.0°c | 27.0°c |



సోమవారం ప్రగతిభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు ఈటల రాజేందర్, కేటీఆర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ కూడా ఉన్నారు.

# లాక్‌డౌన్ ఉండాల్సిందే!

మొదటిపేజీ తరువాయి...

ప్రకటించారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండబ్ల్యుఎస్‌లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రూ.7,500, మున్సిపాలిటీలు, పంచాయతీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు రూ.5వేలు సీఎం గిఫ్ట్‌గా ఇస్తామన్నారు. జిల్లాల్లో అహోరాత్రాలు కష్టించి పనిచేస్తున్న వారిని గుర్తించి కలెక్టర్ల ద్వారా ప్రత్యేక ప్రోత్సాహకాలను అందజేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో నిజాముద్దీన్ కేసులు రాకుండా ఉండిఉంటే పరిస్థితి ఆరామ్‌గా ఉండేదని చెప్పారు. మొదటి దశలో కరోనా సోకినవారు, క్వారంటైన్‌కు వెళ్లినవారు 9వ తేదీలోగా ఇండ్లకు వెళ్లిపోతారన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా.. ప్రజల ప్రాణాల రక్షణకే ప్రాధాన్యమని స్పష్టంచేశారు. ఈ ఆపత్కాలంలో తోటివారికి సహకరిస్తున్నవారికి చేతులెత్తి దండంపెడుతున్నానని పేర్కొన్నారు. ఈ సంక్షోభసమయంలో ప్రజలను చైతన్యపరుచకుండా చిల్లర వార్తలు రాసినా, ప్రచారంచేసినా సహించేది లేదని హెచ్చరించారు. సోమవారం ప్రగతిభవన్‌లో మీడియాతో సీఎం కేసీఆర్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

### లాక్‌డౌన్ తప్ప గత్యంతరంలేదు

కరోనా నుంచి బయటపడటానికి ప్రస్తుతం లాక్‌డౌన్ మినహా మరో గత్యంతరం లేదు. ఎవరో బయటకు రానిస్తలేరనే భావన కరెక్ట్ కాదు. ఎందుకంటే మనకు గత్యంతరం లేదు. కరోనా విచిత్రమైనది. దానికి మందు లేదు. మొదటి 50 పాజిటివ్ కేసులలో ఒక్కరు కూడా చనిపోలేదు. తబ్లిగీకి పోయివచ్చినోళ్లలో పదిమంది ఇండొనేషియావారు మంచిగనే ఉన్నరు. ఈ జబ్బు చాలా తీవ్రంగా ఉన్నది. ఓ రోజు నేనూ, మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుకుంటుంటే.. ఇద్దరు పాజిటివ్ కేసులవాళ్లకు సీరియస్‌గా ఉన్నదంటూ గాంధీ నుంచి ఫోన్ వచ్చింది. తర్వాత 45 నిమిషాల్లో ఒకరు చనిపోయారని చెప్పారు. మళ్లా 20 నిమిషాల్లో మళ్లొకరు చనిపోయారు. ఇంకొకాయన బాత్రూంకు పోయి అక్కడ్నే చనిపోయిండు. పాజిటివ్ వచ్చినవాళ్లలో తక్కువ లోడ్ అయినోళ్లు బతుకుతున్నరు.

### ప్రపంచమే లాక్‌డౌన్ అయింది

లాక్‌డౌన్‌లో ప్రజలు గొప్పగా సహకరించినరు. ఇంకా సహకరించాలి. ప్రపంచానికే వచ్చిన పెద్ద పీడ ఇది. ఏ వ్యక్తికో, కుటుంబానికో వచ్చింది కాదు. 22 దేశాలు వందశాతం లాక్‌డౌన్‌చేసినయి. ఇండియా, ఫ్రాన్స్, ఇటలీ, న్యూజిలాం డ్, సింగపూర్, లండన్, పోలండ్, డెన్మార్క్, బెల్జియం, స్పెయిన్, జర్మనీ, పెరూ, మలేషియా, దక్షిణాఫ్రికా, కొలంబియా, అర్జంటీనా, జోర్డాన్, జపాన్, స్విట్జర్లాండ్, నార్వే, కువైట్, ఐర్లాండ్, నేపాల్ ఇవన్నీ వందశాతం లాక్‌డౌన్ చేసినయి. మిగతా 90 దేశాలు పాక్షికంగా చేసినయి. సమస్య తీవ్రత, సాంద్రత ఎంత ఉన్నదో అర్థంచేసుకోవచ్చు.

### లాక్‌డౌన్‌తోనే భారతజాతిని బతికించుకుంటున్నం

లాక్‌డౌన్ అనేది ఇదేదో శిక్ష. ఇదేదో మాకే ఉందనుకోవద్దు. మన తెలంగాణగానీ, మన దేశంగానీ కఠిన నిర్ణయం తీసుకున్నందునే కరోనాకేసుల సంఖ్య 4వేలకు పరిమితమైంది. జనాభాపరంగా చూస్తే చాలా పెద్ద ఇబ్బంది ఉండాలి. కానీ రాలేదు. భారత, తెలంగాణ సమాజాన్ని బతికించుకున్నం. మన స్వీయకృషి, నియంత్రణ.. ఆ మేరకు క్రమశిక్షణ పాటించినందునే ఇంత మంచిగ ఉన్నం. న్యూయార్క్ వంటి దుస్థితి మనకొస్తే ఎంత ఆగమవుదుమో! లాక్‌డౌన్‌వల్లనే బ్రహ్మాండంగా కంట్రోల్ చేసుకున్నం. భారతదేశ జనాభా ప్రకారంగా చూస్తే జూన్ 3 వరకు లాక్‌డౌన్ అమలుచేయాలని ప్రపంచంలోనే ప్రముఖ కన్సల్టెంట్ సంస్థ అయిన బోస్టన్ గ్రూప్ (బీసీజీ) స్పష్టంచేసింది. శాస్త్రీయ లెక్కలు, సూత్రాల ఆధారంగా వాళ్లు ప్రపంచవ్యాప్తంగా సర్వే చేశారు. ప్రజల్ని కాపాడుకోవడానికి లాక్‌డౌన్ తప్ప మన దేశానికి వేరే మార్గం లేదు. ఆర్థికరంగం దెబ్బతింటుందనే వితండవాదాలు ఉండొచ్చు.

### లాక్‌డౌన్ కొనసాగించాలి

కరోనాపై చాలామందితో మాట్లాడుతున్నప్పుడు ఇండియాకు లాక్‌డౌన్ తప్ప మరోమార్గంలేదని చెప్తున్నరు. నా వ్యక్తిగత అభిప్రాయమైతే లాక్‌డౌన్ మరికొంతకాలం పొడిగించాలి. ఇదే విషయాన్ని ప్రధానికి కూడా చెప్పిన. తెలంగాణ ప్రజల ముందు కూడా నా అభిప్రాయం పెడుతున్న. ఎందుకంటే మనం ఆర్థిక నష్టాన్ని పూడ్చుకోగలం. కానీ ప్రజల జీవితాలను, ప్రాణాలను తిరిగి తీసుకురాలేం. ప్రస్తుత పరిస్థితుల్లో ఇండియాలో పూర్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉన్నది. ఈ పరిస్థితుల్లో ఈ వ్యాధి నుంచి సస్టెయిన్ కాలేం. లాక్‌డౌన్ ఒక్కటే మన దగ్గర ఉన్న ఆయుధం. మనం యూకే, సింగపూర్ కంటే మెరుగ్గా లేం. ప్రధానమంత్రి కూడా ఆ దిశగా పాజిటివ్‌గా నిర్ణయం తీసుకొంటారని అనుకొంటున్నా. ప్రధానమంత్రి ఎల్లుండి అన్ని పార్టీల నేతలతో మరోసారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడనున్నారు. ఈ లాక్‌డౌన్ ఎంత గట్టిగా పాటిస్తే అంత మంచిదని, లాభం జరుగుతుందని చెప్తున్నారు. ఫర్ సపోజ్.. కుల్లా చేయాలనుకొందాం. తాళం తీయాలి.. గొళ్లెం తీయాలి. అప్పుడు ఎవరిని వదులాలి? ఎవరిని వదులొద్దు? కుల్లా అయిన తర్వాత ఎవరైనా ఆగుతరా? కుప్పలుకుప్పలు అయితరు. గుళ్లు, మసీదులు, చర్చిలు, బార్లు, పబ్బులు అన్నీ మొదలైతయి. మళ్లీ మాస్ గ్యాదరింగ్స్ వచ్చేస్తే ఏమైతం? లాక్‌డౌన్ ఎంతో బాధ్యతతో తీయాలి. చాలా ఆలోచించాల్సి వస్తది. ప్రధానితో నేను రోజూ రెండుసార్లు మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. ఆర్థిక పరిస్థితి, రిజర్వుబ్యాంకు, ఆహార నిల్వలు.. వీటన్నింటిపై ఎట్ల ముందుకు పోవాలి? ఈ పరిస్థితిని ఎట్ల అధిగమించాలి? ఈ ప్రతిష్టంభన ఎంతకాలం కొనసాగించాలి? అనేవి తీవ్రంగా చర్చించాల్సిన విషయాలు.

### ప్రాథమికస్థాయిలోనే కట్టడికి అవకాశం

ప్రజలకు పదేపదే దండం పెట్టి చెప్తుతున్నం. అనుమానం ఉంటే.. ప్రైమరీస్టేజీలో వస్తే వెంటనే రోగాన్ని కంట్రోల్ చేసే అవకాశం ఉంటది. దానికి సూటిగా తాకే మందు లేకపోయినా.. నివారణ కోసం ప్రపంచమంతా అవలంబిస్తున్న హైడ్రాక్సీక్లోరోక్విన్, అజిత్రోమైసిన్ వంటివి ఇచ్చి వైరస్‌ను కట్టడిచేస్తరు. దీంతో మనిషి బతికే అవకాశం ఉంటది. ఓవర్‌లోడ్ అయి వస్తే మాత్రం ఏం చేయలేం. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మొన్న ఆరోగ్యశాఖకు ఫోన్ చేసి ఓ మనిషి సీరియస్‌గా ఉన్నడు.. పంపిస్తున్నం అని చెప్పిన్రు. అతను హైదరాబాద్‌కు కూడా చేరలేదు. మధ్యలోనే చనిపోయిండు. ఎందుకంటే వైరస్ ఎక్కువైంది. కాబట్టి దీన్ని ఎదుర్కొనాల్సిందే. ప్రధాని అడిగితే నేనైతే కచ్చితంగా లాక్‌డౌన్ కొనసాగించాలని చెప్పిన. బతికుంటే బలుసాకు తినొచ్చు. ఎకానమీ ఎలాగైనా రికవరీ చేసుకోవచ్చు. సచ్చిన మనిషిని వాపసు తీసుకురాలేం. ఏదో సతీసావిత్రి పురాణం తప్ప మరోటి ఎక్కడాలేదు. సచ్చిపోయినవారిని ఏం పెట్టినా వాపసు తీసుకురాలేం.

### విషాదం చాలా ఘోరం

ఒక యుద్ధం మిగిల్చే విషాదం చాలా ఘోరంగా ఉంటుంది. ఎన్ని కుటుంబాలు ఆగమైతయి! ఎంతమంది పిల్లలు అనాథలైతరు! ఈ బాధ తట్టుకోలేం. అంతర్జాతీయ సంస్థలు కూడా ఏమైనా తిట్టుకోండి కానీ యుద్ధాలు చేయవద్దంటయి. సామాజిక మరణాలు మిగిల్చే విషాదం కూడా అంతులేకుండా ఉంటది. దేశం భరించజాలదు. ఒక సమాజం.. నాగరిక సమాజం భరించజాలదు.

### సింగపూర్‌లో మళ్లీ లాక్‌డౌన్

సింగపూర్ ముందు లాక్‌డౌన్ చేసి.. తర్వాత ఎత్తేసింది. కానీ పరిస్థితి అదుపుచేయలేక మళ్లీ నెలపాటు లాక్‌డౌన్ ప్రకటించింది. హైదరాబాద్ సిటీ అంతకూడా లేని చిన్నదేశమది. వాళ్లే తట్టుకోలేకపోతున్నారు. ఇక ఇంత పెద్దదేశం మన పరిస్థితి ఏమిటి? కాబట్టి.. మానవజాతి మొత్తం సంక్షోభంలో ఉన్నప్పుడు బాధ్యతతో వ్యవహరించాలి. చాలా విస్తృతంగా ఆలోచించి రాయాలి. అన్నింటికంటే మించి మానవత్వంతో వ్యవహరించాలి. ఉన్నంతలో మన వాళ్లను కాపాడుకోవాలి. గత్యంతరం లేదు. మనం కలో గంజో తాగి బతుకాలి. మళ్లీ మనం కష్టపడి పుంజుకుందాం. తెలంగాణలో లాక్‌డౌన్ ఎత్తివేస్తున్నట్లు ఒక పత్రికలో రాశారు. వాస్తవం తెలుసుకోకుండా రాస్తే బాధ కలుగుతది. అది ఎంతవరకు సమంజసం? నేను మైక్ పట్టి ప్రధానికి చెప్తున్నా లాక్‌డౌన్ ఎత్తివేయరాదని! అయినా ఇటువంటి వార్తలు రాస్తరు. లాక్‌డౌన్‌ను ఎప్పుడు ఎత్తివేస్తారో.. ఎప్పుడు తెరుస్తరో ఎవరికీ తెలియదు. ఇందులో ఊగిసలాట లేదు. ముందు మనుషులను బతికించుకుందాం.. ఇతర విషయాలను తర్వాత ఆలోచిద్దాం.

**రాష్ట్రంలో తొలిదశ**

- క్వారంటైన్‌లో ఉన్నవారు 25,937
- మంగళవారం డిశ్చార్జి అయ్యేవారు 258
- విదేశాలనుంచి వచ్చిన పాజిటివ్ కేసులు 30
- వారిద్వారా సంక్రమించిన కేసులు 20
- ఇప్పటివరకు డిశ్చార్జి అయినవారు 35
- బుధవారం డిశ్చార్జి అయ్యేవారు 15
- తొమ్మిదోతేదీ లోగా తొలిదశ కేసులు 0

**నిజాముద్దీన్ ఘటన అనంతరం రెండోదశ**

- గుర్తించిన వ్యక్తులు 1089
- ఢిల్లీలో ఉన్నవారు 30-35
- పాజిటివ్ తేలినవారు 172
- వీళ్లద్వారా సంక్రమించినవాళ్లు 93
- వివరాలు సేకరించినవారి సంఖ్య 3000
- రిపోర్టుల కోసం వేచి ఉన్న కేసులు 600
- పాజిటివ్‌గా భావిస్తున్న కేసులు 100-110
- చనిపోయినవారు 11

## వైరల్ లోడ్ అంటే?

**వైరస్** ప్రవేశించిన తర్వాత శరీర కణాలపై దాడి చేస్తూ కొత్త వైరస్‌లను ఉత్పత్తి చేస్తుంది. అవి కూడా కణాలపై దాడిచేస్తూ మరిన్ని వైరస్‌లను ఉత్పత్తి చేస్తుంటాయి. ఇలా రోగి శరీరంలో వైరస్‌ల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతూ ఉంటుంది. ఈ వైరస్‌ల మోతాదునే 'వైరల్ లోడ్' అంటారు. అది ఎంత ఎక్కువగా ఉంటే ఆరోగ్యం అంత త్వరగా క్షీణిస్తుం ది. ఆ రోగి నుంచి ఇతరులకు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ప్రాథమిక దశలోనే పాజిటివ్ వ్యక్తులను గుర్తిస్తే.. అందుబాటులో ఉన్న మందులతో నిరోధించవచ్చని వైద్యులు చెప్తున్నారు. రోగనిరోధకశక్తి తక్కువగా ఉన్న వారిలోనూ వైరల్ లోడ్ ఎక్కువగా ఉంటుందంటున్నారు. కొద్దిపాటి వైరస్ దాడిచేస్తే మనలోని రోగనిరోధకశక్తి అడ్డుకొంటుందని, వైరల్ లోడ్ ఎక్కువగా ఉన్నప్పుడు దాన్ని అడ్డుకోవడం కష్టంగా మారుతుందంటున్నారు.

# పైసల కంటే ప్రాణాలే ముఖ్యం

**రోజుకు 430 కోట్లు రావాలి • ఐదు రోజుల్లో వచ్చింది ఆరుకోట్లే**

**బతికుంటే బలుసాకు తినొచ్చు • ప్రాణాలు పోతే తేగలమా?**

**మీడియాతో ముఖ్యమంత్రి కేసీఆర్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఆర్థికంగా నష్టమొచ్చినప్పటికీ.. ప్రజల ప్రాణాలు కాపాడటమే ప్రభుత్వ ప్రాధాన్యమని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు స్పష్టంచేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పైసలు పోతే పోయినయి.. ప్రాణాలు తేగలమా? అని ప్రశ్నించారు. 'మన తెలంగాణ సంగతికి వస్తే సగటున రోజుకు రూ.430-440 కోట్ల ఆదాయం రావాల్సి ఉన్నది. మార్చిలో మొదటి 15 రోజులు ఆదాయం వచ్చింది. లాక్‌డౌన్ నుంచి ఏమీరాలేదు. హళ్లికి హళ్లి.. సున్నకు సున్న. ఏప్రిల్‌లో ఆరురోజుల్లో రూ.2300-2500 కోట్ల ఆదాయంరావాలి. కానీ, రూ.6 కోట్లే వచ్చింది. పైసలు పోతే పోయినయి. కానీ సచ్చుడు బతుకుడు చూసుకుంటే మన దగ్గర తక్కువగానే ఉన్నది. గదొక్కటి సంతోషంగా ఉన్నది. మనకు అమెరికా, స్పెయిన్, ఇటలీలో ఉన్నట్లుగా శవాల గుట్టలైతే లేవు. బతికుంటే బలుసాకు తిని బతుకుతాం. ఆకలి నుంచి ప్రజల్ని ఏ విధంగానైనా కాపాడుకోవచ్చు. కలోగంజో తాగి బతుకుతాం. ఎకానమీ ఎట్లనైనా చేసుకుంటాం. కష్టపడుతాం. తిరిగి రివైవ్ అవుతాం. కానీ, ప్రజల జీవితాలను, బతుకును రివైవ్ చేసుకోలేం. అందుకే మనకు ప్రాణాలు ముఖ్యం' అని సీఎం అన్నారు.

### ఆపదలో ఉన్నవారిని ఆదుకుందాం

'ఆర్థికంగా ఒడిదుడుకులు, సంక్షోభాలు ఎదురైనప్పుడు, యుద్ధం వచ్చినప్పుడు ఏమి చేయాలనేదానిపై దేశాలకు పాలసీలు, కార్యాచరణ ఉంటాయి. ఒక దినపత్రికలో ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాంరాజన్ రాసిన ఆర్టికల్‌లో బాగా విశ్లేషించారు. 'రెండునెలలు లాక్‌డౌన్ తిప్పలు పడాలి. లాక్‌డౌన్ ఇంపాక్ట్ దేశంపైన చాలా భయంకరంగా ఉంటుంది. దీనిపై ఆర్థిక నిపుణులు, మేధావులు సమాలోచనలు చేయాలి' అని సూ చించారు. మంచిని కాంక్షించేవాళ్లు ఇలాంటి సూచనలు చేస్తరు. కాబట్టి ప్రధాని కూడా ఆర్థికవేత్తలు, రాష్ట్రాలతో సమావేశాలు నిర్వహించాల్సిందే. ప్రజల ఆరోగ్యం, తిండి, బట్ట, కష్టనష్టాలపై ఆలోచన చేయాలి. ఈ విపత్కర పరిస్థితుల్లో బిర్యానీ తినకున్నా, ఉన్నంతలో తిండికి, పాలకు కొరత లేకుండా, ఇతర సమస్యలు రాకుండా చూసుకోవాలి. ఒక నెల లాక్‌డౌన్ చేసుకుని మూడునెలలు ఆర్థికంగా కష్టాలు పడినా మంచిది కానీ.. ఆగమాగంకావడమెందుకు? ఎట్టి పరిస్థితుల్లో ఒక్కరు కూడా ఉపవాసం ఉండరాదు. ఎవరైనా ఆపదలో ఉంటే ఎమ్మార్వో, స్థానిక ప్రజాప్రతినిధులకు లేదా ఇతర అధికారులకు సమాచారమివ్వండి. ఏప్రిల్ నెలకు 12 కిలోల బియ్యం ఇచ్చాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి బియ్యం పంపిణీ చేస్తున్నాయి. రాజకీయాలు వద్దు.. అందరం కలిసి ఎవరికి ఎంత అవసరముంటుందో అంతే సరఫరా చేయాలని ప్రధాని కూడా చెప్పారు. ఏదైనా ప్రజల సొత్తే.. కలిసి పంపిణీ చేస్తం' అని సీఎం కేసీఆర్ వివరించారు.

## అందరి కడుపు నింపే ప్రయత్నం చేస్తున్నం



'**ట్రాన్స్‌జెండర్స్‌తోపాటు** బిచ్చగాళ్లు కూడా లెక్కల్లోకి వచ్చారు. వాళ్లకు కూడా భోజన ఏర్పాట్లుచేస్తున్నారు. ఆకలితో ఉన్నవారిని ఆదుకోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేయాలో అన్నీచేస్తున్నం. మొత్తానికి దుకాణం బందయితే ప్రజలను ఎలా సాదుకోవాలి? ఉద్యోగులకు అప్పులు తెచ్చి జీతాలు ఇవ్వాలి. మొన్న ప్రధాని ఎంపీ లాడ్స్ ఇవ్వొద్దు అనుకుంటున్నం.. వేతనాల్లో 30% కోత పెడుదామనుకుంటున్నం అన్నారు. 30% ఎందుకు 50% కోత పెట్టమని చెప్పిన. మేం 75% కోత విధించినమని చెప్పిన. ఎల్లుండి అన్నిపార్టీల ఫ్లోర్‌లీడర్లతో వీడియో కాన్ఫరెన్స్ ఉన్నది. ఈ కాన్ఫరెన్స్‌లో మా పార్టీ నుంచి కేశవరావు, నామా నాగేశ్వర్‌రావు పాల్గొంటారు. వేతనాల్లో కోతను సపోర్ట్ చేయాలని చెప్పాను. దేశంముందు వేరే గత్యంతరం లేదు. ఉన్నంతలో మన మార్గాలు మనం వెతుక్కొని ఒకరికొకరు ధైర్యం చెప్పుకొని చాలా సంయమనంతోని ధీరత్వాన్ని ప్రదర్శించాల్సిన సమయమిది' అని సీఎం చెప్పారు.

## పాపం రాధ..

నిన్ననే చదివిన. రాధ అనే అమ్మాయి పాపం.. సికింద్రాబాద్‌లో కూలిపని చేసుకునేది. చనిపోయింది. ఆమె నలుగురు పిల్లలు అనాథలయ్యారు. వెంటనే స్థానిక నాయకులకు, అధికారులకు చెప్పిన. వాళ్లు అనాథలుకావద్దు. ప్రభుత్వమే బాధ్యత తీసుకుంటుందన్న. వాళ్లను జిల్లా కలెక్టర్‌కు అప్పగించాలని చెప్పిన. అలాంటి వార్తలు చదివితేనే కండ్లకు నీళ్లచ్చే పరిస్థితి. ఇట్లా ఒక్క మనిషి చచ్చిపోతేనే వాళ్ల కుటుంబం బజారున పడితే.. వేలు, లక్షలమంది చనిపోయే పరిస్థితి వస్తే ఎన్ని కుటుంబాలు రోడ్డున పడుతయి.. ఎంత అగాథమైతది? ఊహించుకుంటేనే ఒళ్లు జలదరించి దుఖం కూడా వస్తది. అందుకే దయచేసి చెప్తుతున్న.. 'మమ్మల్ని ఎవరో ఆపుతరు.. ఎవరో ఇబ్బంది పెడుతరు' అనే భావన నుంచి ప్రజలు బయటకురావాలి. అలాంటి భావమే కరెక్ట్‌కాదు. ఇప్పుడు ప్రజలు చాలా సహకరిస్తున్నరు. ఇంకా సహకరించాలి. పేదవాళ్ల కడుపు నింపడానికి కట్టుబడి ఉన్నాం. దాదాపు ఆరు లక్షల మంది ఇతర రాష్ట్రాల నుంచి వచ్చినవారితోపాటు ఇక్కడున్న పేదవారు ఉన్నారు. వారందరి రక్షణచూసుకొంటున్నాం. అన్ని వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలు, జువెనైల్ హోమ్‌లు, ఆలయాల దగ్గర భిక్షగాళ్ల రక్షణకు చర్యలు తీసుకొంటున్నం. ట్రాన్స్‌జెండర్ల రక్షణకు ఏర్పాట్లుచేస్తున్నం.



రాధ మృతదేహం వద్ద అనాథలుగా మిగిలిన ఆమె పిల్లలు (ఫైల్)

# తొలిదశ రోగులు 9లోగా డిశ్చార్జి

**నిజాముద్దీన్ రాకుంటే ఆరామ్‌గా ఉండేది • తబ్లిగీ నుంచి వచ్చినవారే 11 మంది మృతి**

**తబ్లిగీ వెళ్లినవారు పరీక్షలు చేయించుకోవాలి • జనాభాపరంగా చూస్తే భారత్ సురక్షితమే**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో తొలిదశలో కరోనా సోకిన రోగులు, క్వారంటైన్‌లో ఉన్నవారు ఈనెల తొమ్మిదోతేదీలోగా డిశ్చార్జి అవుతున్నారని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తెలిపారు. నిజాముద్దీన్‌లోని తబ్లిగీ జమాత్ ప్రార్థనలకు వెళ్లివచ్చిన వారితోనే రాష్ట్రంలో కేసుల సంఖ్య పెరిగిందని.. ఆ కేసులు లేకుంటే ఆరామ్‌గా ఉండేవాళ్లమని పేర్కొన్నారు. సోమవారం ప్రగతిభవన్‌లో సీఎం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కరోనా వ్యాప్తి పరిస్థితిని వివరించారు. సీఎం ప్రసంగం ఆయన మాటల్లోనే..

### గణనీయమైన విజయం

రాష్ట్రంలో కరోనా వ్యాధి ప్రబలడం ప్రారంభమైన తర్వాత కేంద్రం ఇచ్చిన సూచనలను, అంతర్జాతీయంగా అమలవుతున్న పద్ధతులను పక్కాగా అనుసరించాం. వాస్తవంగా ఈ జబ్బు విదేశాల్లో పుట్టింది. అందుకే విదేశాల నుంచి వచ్చి ఇక్కడ వ్యాప్తిచెందకుండా కట్టడిచేసేందుకు కఠినంగా నిర్ణయాలు తీసుకొన్నాం. కేంద్రం కూడా దానినే అనుసరిస్తూ పోర్టులు, విమానాశ్రయాలు బంద్‌చేసింది. జనతా కర్ఫ్యూ విధించింది. ఆ తర్వాత లాక్‌డౌన్ అమలుచేసింది. దాని ఫలితంగానే మన రాష్ట్రంగానీ, దేశంగానీ అద్భుత, గణనీయమైన విజయాన్ని సాధించాయి. జనాభాపరంగా చూస్తే ఇది అతిపెద్ద విజయం. ఈ నిమిషం వరకు దేశంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 4,314, మరణించినవారి సంఖ్య 122. అంటే మనదేశం చాలా సురక్షితంగా ఉన్నదని చెప్పొచ్చు. ఇదేదో నేను చెప్పడం కాదు. అంతర్జాతీయ జర్నల్స్ ప్రశంసిస్తున్నాయి. దేశంలో వివిధ రాజకీయపార్టీల ప్రభుత్వాలు ఉన్నప్పటికీ కరోనా విషయంలో ఒక్కటై, ఐక్యతను ప్రదర్శించాయని మెచ్చుకొంటున్నయి. లేకపోతే దేశంలో చాలా భయంకర పరిస్థితులను ఎదుర్కొనేవాళ్లం.



### ఇదీ.. తెలంగాణ కరోనా లెక్క

తెలంగాణలో కరోనాకు సంబంధించి మొదటి దశలో విదేశాలనుంచి వచ్చినవాళ్లు, తద్వారా వారి నుంచి సోకే అవకాశమున్నదనే అనుమానంతో 25,937 మందిని ప్రభుత్వపరంగా వివిధ పద్ధతుల్లో క్వారంటైన్‌చేసినం. అందులో 50 మందికి పాజిటివ్ వచ్చింది. వీరిలో విదేశాలనుంచి వచ్చినవారు 30మంది ఉండగా.. వారిద్వారా వైరస్ సంక్రమించిన వాళ్ల కుటుంబ సభ్యులు 20మంది వరకు ఉన్నారు. అదృష్టంకొద్దీ ఈ యాభై మందిలో ఒక్కవ్యక్తి కూడా చనిపోలేదు. 35 మంది ఇప్పటికే డిశ్చార్జి అయ్యారు. మిగిలిన 15 మంది ఎల్లుండిలోగా డిశ్చార్జి అవుతారు. అందరూ క్షేమంగా ఉన్నారు. మొదటి బ్యాచ్‌లో పాజిటివ్ వచ్చినవారంతా ఎల్లుండితో డిశ్చార్జి అవుతారు. క్వారంటైన్‌లో ఉన్న 25,937 మందిలో రేపటికి (మంగళవారం) 258 మంది మాత్రమే ఉంటరు. రేపు (మంగళవారం) సాయంత్రం వాళ్లకూడా డిశ్చార్జి అవుతారు. 9వ తేదీలోపు మొత్తం ఖాళీ అవుతుంది. మొదటి దశ జీరోకు వస్తది.

### 'నిజాముద్దీన్'తో పెరిగిన కేసులు

నిజాముద్దీన్‌కు వెళ్లి వచ్చినవారుకానీ, వారిద్వారా సోకినవారుగానీ రెండోదశలో ఉన్నరు. మనమే కాదు.. దేశమంతా నిజాముద్దీన్ ద్వారా అతలాకుతలమైంది. మొదటిదశలో వచ్చిన 50 కేసులతో నిజాముద్దీన్ కేసులను కూడా కలుపుకొంటే ఇప్పటివరకు 364 మందికి వైరస్ సోకింది. ఇందులోనే కరీంనగర్‌లోని పది కేసులూ ఉన్నాయి. డిశ్చార్జి అయినవారు కాకుండా ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో 11 మంది చనిపోయారు. ప్రస్తుతం గాంధీలో 308 మంది చికిత్స పొందుతున్నారు. నిజాముద్దీన్ అనంతర పరిణామక్రమంలో మూడువేల మందిని పట్టుకోగలిగినం. 1089 మందిని గుర్తించినం. 30-35 మంది ఇంకా ఢిల్లీలోనే ఉన్నరు. బహుశా అక్కడి ప్రభుత్వం క్వారంటైన్ చేసి ఉండవచ్చు. మన రాష్ట్రంలోకి వచ్చినవాళ్లకు నిర్వహించిన పరీక్షల్లో ఇప్పటివరకు 172 మందికి వైరస్‌సోకింది. వీరిద్వారా మరో 93 మందికి వ్యాప్తి చెందింది. ఇందులోనే చనిపోయినవాళ్లూ ఉన్నారు. సుమారు 3015 మందిదాకా ఈ బ్యాచ్ వివరాలను సేకరించినం. నిజాముద్దీన్‌పోయి వచ్చిన వాళ్లు ఏ రైలు.. ఏ బోగీలో వచ్చినరు? ఎక్కడ తిన్నరు? ఎక్కడ పడుకొన్నరు? ఇట్ల అన్ని వివరాలను సేకరించినం. అందరినీ పట్టుకొన్నం. ఇందులో హిందూ సోదరులు కూడా ఉన్నరు. కరీంనగర్ బ్యాచ్ కూడా ఢిల్లీ మర్కజ్‌కు పోయి వచ్చినవాళ్లే. వెయ్యి పైచిలుకు మందికి జబ్బులేదని వచ్చింది. ఇయ్యాల కూడా మరో 600 మందికి సంబంధించిన పరీక్షలు కొనసాగుతున్నయి. రేపు సాయంత్రంగానీ, ఎల్లుండికి గానీ ల్యాబ్ క్లోజ్ అయిపోతది. సాధారణంగా ఈ పరీక్షల్లో ఐదు నుంచి పదిశాతం పాజిటివ్ వస్తయి. ఒక్కోసారి 10 నుంచి 11 శాతం కూడా రావొచ్చు. అదనంగా వీళ్ల ద్వారా సోకినవారు ఉంటే వాళ్లకు పరీక్షలు చేయాల్సి ఉంటుంది తప్ప ఇప్పటివరకైతే అన్ని పరీక్షలు పూర్తయినట్లే. ఇప్పుడున్న 308 మంది కాకుండా ఇంకా మిగిలిఉన్న పరీక్షల్లో అదనంగా 100-110 పాజిటివ్ కేసులు వచ్చేరే అవకాశమున్నది. భగవంతుడి దయతో అక్కడికి ఆగిపోవాలి.

### పోలీసులకు కృతజ్ఞతలు

నిజాముద్దీన్ పోయి వచ్చినవారి ద్వారా ఇంకా ఎవరికైనా వైరస్ వ్యాప్తి చెందిందా అన్నవేట కొనసాగుతూనేఉన్నది. ఆరోగ్య కార్యకర్తలు, పోలీసులు, కలెక్టర్లు, అందరూ క్రియాశీలంగా వేటచేస్తున్నరు. ముఖ్యంగా పోలీసుశాఖ నిద్రలేకుండా పనిచేసిన్రు. వారందరికీ కృతజ్ఞతలు. చాలామందిని పోలీసులే రకరకాల పద్ధతుల్లో కష్టపడి పట్టుకొన్నరు. వందమందిదాకా మనం పరిశోధనచేసి పట్టుకొన్నం. నిజాముద్దీన్ పోయివచ్చిన వాళ్లెవరైతే ఉన్నారో.. 99.9 శాతం వారిని తీసుకొన్నాం. ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే.. మీ ప్రాణాలకే హాని కాబట్టి వెంటనే రిపోర్టు చేయండి.

### పాజిటివ్ వస్తే గాంధీలో ఉండాల్సిందే

ఏ రాష్ట్రంలో చేయనివిధంగా ముందుగానే 25 వేల మంది వైద్య సిబ్బందిని అదనంగా పూల్‌గా పెట్టుకున్నం. ఎప్పుడు ఫోన్‌చేస్తే అప్పుడు వచ్చి పనిచేయటానికి వాళ్లు సిద్ధంగా ఉన్నరు. అందులో డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నిషియన్లు.. ఇట్లా అందరూ ఉన్నరు. సమాజంలో పరిస్థితి ఎటు మారుతుందో అంచనా లేదు కాబట్టి, దాన్ని ఎదుర్కొనేలా.. మనుషులను కాపాడుకునేలా ఆ ఎక్స్‌ట్రా పూల్‌ను కూడా సిద్ధంచేసి పెట్టుకున్నం. ఆరోగ్యమంత్రి ఆధ్వర్యంలో ఆ శాఖ పూర్తి సన్నద్ధంగా ఉన్నది. 18 వేల బెడ్లు కూడా రెడీగా పెట్టుకున్నం. చాలా వరకు సంసిద్ధంగానే ఉన్నం. అయితే ఆ పరిస్థితి రాకూడదనే నేను భగవంతుడిని ప్రార్థిస్తున్న.

### ఎనిమిది దవాఖానలు నోటిఫై

గాంధీతోపాటు కొవిడ్‌కు సంబంధించి ఎనిమిది దవాఖానలను నోటిఫై చేసిఉంచాం. వాటిలో ఐసీయూ, ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు, ఎమర్జెన్సీ వైద్యానికి సంబంధించి వెంటిలేటర్‌వంటి అన్ని పరికరాలు ఉంటాయి. ఎవరైనా ఎమర్జెన్సీ వైద్యం అవసరమైతే వెంటనే షిఫ్ట్‌చేసేందుకు వీలుంటుంది. ఇంకోమాట కూడా కచ్చితంగా చెప్తున్న. ఎవరికైతే కొవిడ్ పాజిటివ్ వచ్చిందో వాళ్లు కోటీశ్వరుడైనా.. లక్షాధికారైనా.. సామాన్యుడైనా కచ్చితంగా గాంధీ దవాఖానలో ఉండాల్సిందే.

## ఆ దుఃఖం ఎవరికీ రావొద్దు

**ఇయ్యాల** అమెరికా చాలా భయంకరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నది. న్యూయార్క్‌లో శవాల గుట్టలంటూ కథనాలు వస్తున్నయి. ఆ దుఃఖం ఎవరికీ, అసలు మానవజాతికే రావొద్దు. అక్కడ పరిస్థితి హృదయవిదారకంగా ఉన్నది. శవాల్ని ట్రక్కుల్లో నింపి పంపుతున్నరు. యాడ పడేస్తరో.. తగులబెడుతరో.. ఎవరికీ తెల్వదు. కనీసం శవాలను చూసేవాళ్లు లేరు. అంతటి శక్తిమంతమైన దేశం.. మౌలిక వసతులపరంగా, ఆర్థికంగా, ఆర్మీపరంగా చాలా పవర్‌ఫుల్ దేశం. బలం, బలగం ఇంతలా ఉన్నా ఇప్పుడు అసహాయ స్థితిలో ఉన్నది. రెండులక్షల మందిదాకా చనిపోతరని వాళ్ల అధ్యక్షుడే ప్రకటిస్తున్న పరిస్థితి. ఆ పరిస్థితి మనకొస్తే.. రోడ్లమీదే ఎక్కడికక్కడ సచ్చెటోళ్లు. కానీ భగవంతుడి దయవల్ల చాలా నియంత్రణలో ముందుకుపోతున్నం.

## మందుల కొరత లేదు

**ఎక్కడా** మందుల కొరత లేదు. ఇలాంటిది ఎవరి దృష్టికైనా వస్తే వెంటనే సీఎస్‌కు, వైద్యారోగ్యశాఖ మంత్రికి ఫోన్‌చేసి చెప్పండి. కొన్ని మకిలి వార్తలు రాసెటోళ్లే రాశారు ఇదంతా. చైనా లేకపోతే మనం బతకం.. చైనా క్లోజ్ అయింది కాబట్టి మందులు రావని రాశారు. అదంతా బోగస్. హైడ్రాక్సీక్లోరోక్విన్ మాత్రలు కొన్ని పంపించమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అడిగితే ప్రధాని మోదీ నిరాకరించారు. మాకే అవసరం ఉన్నాయి, మీకు పంపించలేమని చెప్పారు. ఎవరికైనా దేశాన్ని కాపాడుకోవాలని ముందుగా ఉంటుంది. కమ్యూనిటీ ట్రాన్స్‌మిషన్‌ను స్టేజ్ త్రీ అంటున్నారు. మనకు ఎవరి దగ్గర నుంచి సోకిందో తెలియకుండా ఒక జనసమూహంలో 10-15 మందికి వైరస్‌సోకితే దానిని కమ్యూనిటీ ట్రాన్స్‌మిషన్ అంటారు. ఇది మన దేశంలోనే లేదు. విదేశాల నుంచి వచ్చినవాళ్లు, ఆ తరువాత మర్కజ్‌వాళ్లు తప్ప మనదగ్గర లేదు. ఈ నిమిషం వరకు సోర్స్ దొరకకుండా రాలేదు. భగవంతుని దయ. అయితే రేపు ఎలా ఉంటుందో చెప్పలేము.

**లోకం పోకడ**




ఎందుకైనా మంచిది, ఇంట్లో వంట పనేదో మీరు చేయండి.. బయటకెళ్లి సరుకులు నేను తెస్తాగానీ..!



సోమవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కలిసి రూ.5 కోట్ల విరాళానికి సంబంధించిన అంగీకారపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెస్సెన్ ల్యాబ్స్ చైర్మన్ ఎమ్ సత్యనారాయణరెడ్డి



సోమవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.2.25 కోట్ల విరాళం చెక్కును అందజేస్తున్న నేషనల్ హైవే అథారిటీ కాంట్రాక్టర్లు. చిత్రంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కూడా ఉన్నారు.



ఐటీ, పురపాలకశాఖల మంత్రి కే తారకరామారావుకు రూ.5 కోట్ల చెక్కును అందజేస్తున్న జీవీకే బయో కంపెనీ వైస్‌చైర్మన్ జీవీ సంజయ్‌రెడ్డి, తదితరులు

## పీఎం కేర్స్‌కు గవర్నర్ విరాళం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్ వ్యాప్తి కట్టడిలో భాగంగా పీఎం కేర్స్‌ఫండ్‌కు తన వేతనంలో మూడోవంతు విరాళంగా ఇస్తున్నట్టు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రకటించారు. దేశంలో సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ప్రధాని ఆదేశం మేరకు తన వేతనం నుంచి రూ.1.05 లక్షలు ఇవ్వనున్నట్టు తెలిపారు

## సీఎంఆర్‌ఎఫ్‌కు విరాళాల వెల్లువ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా మహమ్మారిని ఎదుర్కోవడంలో తెలంగాణ ప్రభుత్వానికి అండగా ఉండేందుకు పలు సంస్థలు, వ్యక్తులు తమ వంతుగా సహాయంగా పెద్దఎత్తున విరాళాలు ఇవ్వడానికి ముందుకొస్తున్నారు. సోమవారం పెద్దఎత్తున విరాళాలు అందజేశారు. ప్రగతిభవన్‌లో పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంస్థల అధిపతులు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను కలిసి చెక్కులు అందించారు.

**సీఎంఆర్‌ఎఫ్‌కు విరాళాలు అందించినవారి వివరాలు (రూ. కోట్లలో)**

| | |
|---|---|
| రెడ్డీస్ ల్యాబ్స్ | 5 కోట్లు |
| జీవీకే బయోసైన్సెస్ | 5 కోట్లు |
| ఎంఎస్ఎన్ ల్యాబ్స్ | 5 కోట్లు |
| గుడ్ సమారిటన్స్ ఆఫ్ ఖమ్మం (మంత్రి అజయ్) | 2 కోట్లు |
| ఐకేపీ వీవోఏల సంఘం | 1.72 కోట్లు |
| స్త్రీనిధి క్రెడిట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ | కోటి |
| తెలంగాణ పౌల్ట్రీ అసోసియేషన్ | కోటి |
| తెలంగాణ బ్రీడర్స్ అసోసియేషన్ | కోటి |
| తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంక్ (టెస్కాబ్) | కోటి |
| వెల్జన్ డెనిసన్ లిమిటెడ్ | కోటి |
| కే రహేజ కార్పొరేట్ సర్వీసెస్ ప్రై.లి. | కోటి |
| సాగర్ సిమెంట్స్ సంస్థ | కోటి |
| డీసీసీబీ, సింగిల్ విండోలు | 76 లక్షలు |
| అనూష ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ | 50 లక్షలు |
| డీఈసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ | 50 లక్షలు |
| కేసీపీ ప్రాజెక్ట్ లిమిటెడ్ | 50 లక్షలు |
| ఆదిత్య హోమ్స్ సంస్థ | 50 లక్షలు |
| స్పిన్నింగ్ అండ్ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ | 50 లక్షలు |
| కాకినాడ సీపోర్ట్ | 50 లక్షలు |
| హైదరాబాద్ అర్చిడయోసిస్ ఎడ్యుకేషనల్ సొసైటీ | 50 లక్షల |
| ఆయిల్ ఫెడ్ | 50 లక్షలు |
| వరంగల్ ఏకశిలా ఎడ్యుకేషన్ సొసైటీ, మనోహర ఎడ్యుకేషన్ సొసైటీ, వీఎంఆర్ పాలిటెక్నిక్, కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీ | 37.78 లక్షలు |
| ఆదిత్య మ్యూజిక్ | 31 లక్షలు |
| ఎస్ఎల్ఎంఐ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ | 25 లక్షలు |
| శ్రీవెంకటేశ్వర కన్‌స్ట్రక్షన్స్ | 25 లక్షలు |
| సీల్‌వెల్ కార్పొరేషన్ | 25 లక్షలు |
| యూనిక్ ట్రీస్ | 25 లక్షలు |
| దివ్యశక్తి పేపర్ మిల్ | 25 లక్షలు |
| ఓంప్రకాశ్, శ్యాంసుందర్‌రెడ్డి, ప్రసాద్ (తాండూరు) | 20 లక్షలు |
| హారిక, హాసినీ క్రియేషన్స్ | 20 లక్షలు |
| గ్రీన్‌సిటీ ఎస్టేట్స్ | 15 లక్షలు |
| కార్తికేయ ఇండస్ట్రీస్ | 15 లక్షలు |
| నిజాం క్లబ్ | 15 లక్షలు |
| కోరుట్ల నియోజకవర్గం నుంచి | 12.51లక్షలు |
| చిట్టెం సుచరిత, కొండా లక్ష్మీకాంతారెడ్డి | 12 లక్షలు |
| జెక్ కాలనీ ఫెడరేషన్ | 11 లక్షలు |
| పుల్లెల గోపిచంద్ | 10 లక్షలు |
| కోలేటి దామోదర్ గుప్తా | 10 లక్షలు |
| సాకేత్ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ | 10 లక్షలు |
| శ్రీ వెంకటేశ్ గ్రానైట్స్ | 10 లక్షలు |
| ధనలక్ష్మి ఐరన్ ఇండస్ట్రీస్ | 10 లక్షలు |
| కేఎంవీ ప్రాజెక్ట్స్ | 10 లక్షలు |
| జింఖానా క్లబ్ | 10 లక్షలు |
| నవతేజ్ ఇన్‌ఫ్రా | 10 లక్షలు |
| ఆర్‌బీవీఆర్ రెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ | 10 లక్షలు |
| విరమణి బిస్కట్ | 10 లక్షలు |
| సంజీవనీ చారిటబుల్ ట్రస్ట్ | 10 లక్షలు |
| దేవశ్రీ ఇస్పాట్ ప్రైవేట్ లిమిటెడ్ | 10 లక్షలు |
| ధనలక్ష్మి స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్ | 10 లక్షలు |
| జైరాజ్ ఇస్పాట్ ప్రైవేట్ లిమిటెడ్ | 10 లక్షలు |

## చిన్న వయస్సు.. పెద్ద సాయం





కమలాపూర్/ ఎల్లారెడ్డిపేట: వయసు చిన్నదైనా.. మనసు పెద్దదని నిరూపించుకొన్నారు వరంగల్ అర్బన్ జిల్లా ఉప్పల్‌కు చెందిన ముజీబ్‌హుస్సేన్ కుమార్తెలు షిరీన్, అమ్ము, పరీహా. పారిశుద్ధ్య కార్మికులకు తమ పాకెట్‌మనీ రూ.5 వేలతో శానిటైజర్లు, మాస్కులు కొనిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బొప్పాపూర్‌కు చెందిన ఇల్లెందుల సత్యంరెడ్డి, కవిత కుమారుడు అరవిందరెడ్డి తాను దాచుకున్న రూ.700తో ఇటీవల ఇంటి పెద్దదిక్కు కోల్పోయిన దిమ్మటి పద్మ కుటుంబానికి నిత్యావసరాలు అందజేశాడు.

# కరోనా యోధులకు సీఎం గిఫ్ట్

వైద్య సిబ్బందికి 10 శాతం గ్రాస్ శాలరీ

- జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు 7500
- మున్సిపాలిటీలు, పంచాయతీల్లో 5000
- కట్‌చేసిన పదిశాతం వేతనమూ చెల్లింపు
- ఇతర ఉద్యోగులకూ ప్రత్యేక ప్రోత్సాహకాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనాపై పోరాటంలో ప్రాణాలను లెక్కచేయకుండా పనిచేస్తున్న వివిధ శాఖల సిబ్బందికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రోత్సాహకాలను ప్రకటించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ 'ఈ యుద్ధంలో ప్రాణాలకు తెగించి వైద్యసిబ్బంది పనిచేస్తున్నరు. తెలంగాణ వైద్యశాఖలో ఉన్న ప్రతి చెల్లికి, తల్లికి, అన్నకు, ప్రతి డాక్టర్‌కు.. దవాఖానలో స్వీపర్లు మొదలుకుని టాప్ మోస్ట్ హెల్త్ డైరెక్టర్ వరకు కూడా.. రెండు చేతులెత్తి నా తరఫున, రాష్ట్ర ప్రజల తరఫున దండంపెడుతున్న. పాదాభివందనం చేస్తున్న. వాళ్లు చాలా గొప్పవాళ్లు. సమాజానికి అవసరమైనవాళ్లు. డాక్టర్లు, నర్సులు, ల్యాబ్‌టెక్నిషియన్లు, ఫార్మసిస్టుల రూపాల్లో పనిచేస్తున్నరు. వాళ్లను ఎంత పొగిడినా.. ఎంత దండం పెట్టినా తక్కువనే' అని సీఎం కొనియాడారు.

**సఫాయి అన్నా.. నీకు సలాం అన్నా..**

'పారిశుద్ధ్య కార్మికుల గురించి గతంలో చెప్పిన. మన తల్లిదండ్రుల తర్వాత పారిశుద్ధ్య కార్మికులే గొప్పవాళ్లు. 'సఫాయి అన్నా.. నీకు సలాం..' అని కూడా చెప్పిన. కరోనా నుంచి రాష్ట్రాన్ని కాపాడటంలో మీరు మాకు కనిపించే దేవుళ్లు. మిమ్మల్ని మా సైనికులుగా పరిగణిస్తున్నం. మీరు ఇదే స్ఫూర్తితో పనిచేయాలి. మీకు కట్‌చేసిన వేతనాన్ని పూర్తిగా ఇవ్వడంతోపాటు సీఎం ప్రత్యేక ప్రోత్సాహకం కింద జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్‌లో పనిచేసే కార్మికులకు రూ.7,500 అదనంగా అందిస్తం. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లోని పారిశుద్ధ్య కార్మికులకు కూడా రూ.5వేల చొప్పున అందజేస్తం. ఈ ప్రోత్సాహకాలు పెద్ద గొప్పవేంకాదు. ఇప్పుడు కష్టంలో ఉన్నం కాబట్టి తక్కువఇస్తున్నం. కానీ ప్రభుత్వం మిమ్మల్ని గుండెల్లో పెట్టుకుంటుంది. మీకు తప్పక గుర్తింపు ఉంటుంది. ఈ సమయంలో వైద్యం, స్వీయ నియంత్రణ, పోలీస్ నియంత్రణతోపాటు కచ్చితంగా పాటించాల్సినవి పరిశుభ్రమైన మంచినీరు, పారిశుద్ధ్యం. అవి ఎంత బాగుంటే జబ్బు వ్యాప్తిచెందే అవకాశం అంత తక్కువ. మీరు ఎంత బాగా పనిచేస్తే జబ్బు వ్యాప్తి అంత తగ్గుతుంది. మీ ప్రోత్సాహకానికి ఇచ్చే డబ్బు రూ.100 కోట్లయినా సరే.. వేరే ఖర్చయినా ఆపుకొందాం.. వెంటనే డబ్బు కొంత రిలీజ్ చేయాలని ఫైనాన్స్ సెక్రటరీకి ఆదేశాలిచ్చినం' అని సీఎం కేసీఆర్ ప్రకటించారు.

**వైద్య సిబ్బందికి గ్రాస్ శాలరీపై సీఎం గిఫ్ట్ కింద 10%**

'వైద్యశాఖ సిబ్బందికి పూర్తి వేతనం ఇవ్వాలని ఇప్పటికే ఆదేశించాను. వారికి గ్రాస్ శాలరీలో 10 శాతాన్ని సీఎం గిఫ్ట్ కింద ఇస్తం. ఈ మేరకు ఈ రోజే జీవో జారీ చేస్తం. పోలీస్ సిబ్బంది కూడా చాలా బాగా పనిచేస్తున్నరు. పల్లెప్రగతితో గ్రామాల్లోని దరిద్రాన్ని చాలావరకు తరిమేసుకున్నం. లేకపోతే జబ్బు ఇంకా ఎక్కువ సోకి ఉండేది. సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, జీహెచ్ఎంసీ మేయర్, కార్పొరేటర్లు, అధికారులు గొప్పగా పనిచేస్తున్నరు. వీరందరికీ మించి పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నరు. కరోనా రోగులను పెడుతున్న గాంధీ దవాఖానతోపాటు నోటిఫై చేసిన మిగిలిన హాస్పిటళ్ల చుట్టూ మొదలుపెడితే, ప్రతి గల్లీ తిరిగి రసాయన ద్రావణాలు చల్లుతూ, నగరాన్ని అద్దంలా పెడుతున్నరు. పంచాయతీల్లో 43,661, మున్సిపాలిటీల్లో 21,531, హెచ్ఎండబ్ల్యూఎస్‌లో 2,510, జీహెచ్ఎంసీలో 27,690.. మొత్తం 95,392 మంది ఉన్నరు. మొన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటీల్లో, జీహెచ్ఎంసీలో వీరి వేతనాలు పొరపాటున 10% కట్‌చేశారు. వాళ్లకు ఆ 10% వేతనం ఒకటి రెండురోజుల్లో ఇస్తరు' అని సీఎం తెలిపారు.

**త్యాగధనులు కావాలె**

'ఈ సమయంలో జాతి ఐక్యత కోసం దోహదపడే వారు, ప్రజలను ఏకంచేసేవారు, ధైర్యంచెప్పేవారు గొప్పవారు. వెకిలి వారెప్పుడూ వెకిలివారిలాగే మిగిలిపోతరు. గొప్పోళ్లు గొప్పోళ్లుగానే మిగిలిపోతరు. మహిళా సర్పంచులు భుజాన మిషన్లు వేసుకొని వాళ్ల ఊళ్లల్లో రసాయనాలు పిచికారి చేస్తున్నరు. స్వయంగా మోరీలు తీస్తున్నరు. వారికి సెల్యూట్ చేస్తున్నా. అలాంటి సర్పంచులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, నాయకులు కావాలె. కవులు రాస్తున్నరు. సంపాదకీయాలు రాస్తున్నరు. మంచి పేపర్లు, మంచి జర్నలిస్టులు మంచి వ్యాసాలు పాజిటివ్‌గా రాస్తున్నరు. వాళ్లకు దండం పెడుతం. వాళ్ల కాళ్లు కడిగి నెత్తిన పోసుకుంటం. ఈ విపత్కర సమయంలో మంచి సలహాలిచ్చేవారు, బుద్ధిచెప్పేవారే గొప్పవారు' అని సీఎం పేర్కొన్నారు. 'జిల్లాల్లో అక్కడక్కడ కొందరు రాత్రింబవళ్లు పనిచేస్తావున్నరు. కొద్దిమందే ఉంటరు. వాళ్లను కూడా ప్రోత్సహించాలె. సమాజమంతా ఒక్కటై దీటుగా కదులాలె. అందుకే రేపటివరకు కొంతడబ్బును జిల్లా కలెక్టర్ల దగ్గర పెట్టి ఎవరైతే అహోరాత్రాలు కష్టంచేస్తరో.. వాళ్లకు కొంత ప్రత్యేక ప్రోత్సాహకం ఇచ్చేలా చర్యలు తీసుకొంటం' అని సీఎం కేసీఆర్ అన్నారు.

**తల్లులకు దండాలు పెడుతున్న**

'గా తల్లులకు రెండు చేతులెత్తి దండాలు పెడుతున్న.. నాకు మోకా దొరికితే వాళ్లకు పాదపూజ కూడా చేస్త. అందరం చల్లగా బతికితే రాష్ట్రావతరణ లాంటి ఏదన్నా సందర్భంలో వాళ్లను పిలిచి అవార్డు కూడా ఇస్తం. ఓ తల్లి బీడీలు చుట్టి పొదుపు చేసుకున్న పైసలు తీసి పంచింది. వాడకట్టుకు సరుకులు ఇప్పించింది. మేడ్చల్‌లో ఒకామె.. తనకు వచ్చిన బియ్యంల నుంచి ఓ 20 కిలోలు తీసి ఇతరులకు సాయం చేసింది. ఎంత గొప్పోళ్లు వాళ్లు! వీళ్లు కావాలే ఇప్పుడు. కష్టంల కన్నీళ్లు తుడిచేటోళ్లు కావాలే ఇప్పుడు. చిన్న, అల్ప మనస్కులు, చిల్లరగాళ్లు.. గీ సమయంలో శవరాజకీయాలు చేసేటోళ్లు కాదు. మొత్తం మానవజాతే ఓ సంక్షోభంలో ఉంటే.. చిల్లర విషయాలు పనికొచ్చేటివి కాదు. కవులు, గాయకులు, బుద్ధిజీవులు, రచయితలు అందరూ ముందుకు రావాలి. సమాజానికి మానసిక స్థైర్యాన్ని కల్పించాలి. అందరం ఒకరికొకరం చేదోడువాదోడుగా ఉండి ముందుకు పోవాలి' అని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు.

### సంతోషంగా ఉన్నది..



నేను ఎవ్వరిపై ఆధారపడకుండా పింఛన్ ఇచ్చి పెద్దకొడుకైండు సీఎం కేసీఆర్ సారూ. కరోనాతో అన్ని బంద్ కావడంతో పేదోళ్ల తిండికి తక్లీబు అయితుంది. సీఎం కేసీఆర్ చెప్పినట్టు నా శక్తికొద్దీ సాయంజేసిన. రెండునెలల పింఛన్ డబ్బులు, నిత్యావసర సరుకులతోపాటు నాకు వచ్చిన బియ్యాన్ని పేదలకు పంపిణీ చేసిన. ఈ ముచ్చటను సీఎం సారూ పేపరోళ్ల ముందు చెప్పడం నాకెంతో ఆనందంగా ఉన్నది.

– భూక్యా జగ్గవ్వ, ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్ట తండా, రాజన్న సిరిసిల్ల జిల్లా

### అందరూ మంచిగుండాలనే..



మనందరం మంచి గుండాలనే మన కేసీఆర్ సారూ కర్ఫ్యూ పెట్టారు. ఇంట్లోనే ఉండాలని బియ్యం ఇస్తుండే. నా కండ్ల ముందర నా కంటే పేదరికంలో ఉన్నోళ్లు ఉన్నారు. నాది పేద బతుకే. కానీ నాతోపాటు నా కంటే పేదలు కూడా మంచిగుండాలగా సారూ. అందరం మంచిగుంటేనే మంచిగా అనిపిస్తుంది. కొందరు ఆకలితో ఉంటే.. మనకెట్ల తినబుద్ధి అవుతాది సారూ. అందుకు నాకు ప్రభుత్వం ఇచ్చిన బియ్యంలో సగం బియ్యంను నాకంటే పేదల కొరకు ఇచ్చిన. చిన్న సాయం చేసిన నన్ను గుర్తుపెట్టుకున్న కేసీఆర్ సారు మనస్సు మనందరికంటే గొప్పది. అందరూ కేసీఆర్ సార్ చెప్పినట్లు వినాలే. కరోనాను మన ఊర్లకు రాకుండ చూసుకోవాలే.

– గుర్రాల అనురాధ
(తనకు వచ్చిన రేషన్ బియ్యంలో సగం దానం చేసిన పేదింటి మహిళ)

# చిల్లరోళ్లు వద్దు

- సంఘీభావ సంకేతంపైనా అవహేళనా?
- పిచ్చిరాతలు రాస్తే కచ్చితంగా శిక్షిస్తాం
- కేసీఆర్ మాటే ఖతర్నాక్
- మీడియాతో ముఖ్యమంత్రి కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రం.. దేశం విపత్కర పరిస్థితిలో ఉంటే కొన్ని పత్రికలు పిచ్చిరాతలు రాస్తున్నాయని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. దుర్మార్గాలు మానుకోని పత్రికలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ 'మొన్న ఒక పత్రికలో వైద్యులకు రక్షణ ఏదీ? అని దరిద్రపు రాతలు రాశారు. వైద్యుల రక్షణ ప్రభుత్వం చూడకపోతే, పత్రికాయన చూస్తడా? అలాంటి రాతలు రాసేటప్పుడు జ్ఞానం ఉండాలి. పీపీఈ కిట్లు లేవు అని రాసిండ్రు.. పీపీఈ కిట్లు మా దగ్గర 40 వేలు ఉన్నయి. మేం అనుకుంటే మీ మీద కేసుకూడా వేయొచ్చు. ప్రజలకు మనోధైర్యాన్ని కల్పించాల్సిందిపోయి.. డాక్టర్ల మనోధైర్యాన్ని దెబ్బతీసేలాగా వెకిలి వార్తలు రాయడం దేనికి పనికొస్తది? ఈ రాతలు, ఈ పత్రికలు దేశానికి పనికొస్తాయా? ఇది చాలా దుర్మార్గం, హేయం! ఇట్లనే కొనసాగుతుందని అనుకుంటున్నారేమో.. వాళ్లకు శిక్ష తప్పదు. ఇలాంటి విపత్కర సమయంలో కూడా ప్రభుత్వాన్ని ఇరుకున పెడుదామంటే సరైందా! మీరు రాసిన రాతలు వందకు వందశాతం అసత్యం. చేతనైతే రెండు మంచివార్తలు రాయాలి.. లేకపోతే ఇంట్లో పోయి పండుకోవాలి. మాకు తెల్వదా ఏం అవసరమో? మా హెల్త్ మినిస్టర్, మేము నిద్రలేని రాత్రులు గడుపుతున్నం. వైద్యం ఒకటే కాదు.. రాష్ట్రం ఎట్లా గడువాలె.. ఇవాళ రేషన్ ఇచ్చినం. ఒకవేళ లాక్‌డౌన్ పొడిగించాల్సి వస్తే అప్పుడు పరిస్థితి ఏంది? ప్రజలు ఎంత ఉపాధి కోల్పోతున్నరు? ఇవన్నీ ఆలోచించాలె. లక్షలమంది వేరే రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఇక్కడ ఉన్నరు. వారందరికీ క్యాంపులు ఏర్పాటుచేసింద్రు. ఒకరికొకరు భుజం తోడై గొప్పగా సమాజాన్ని ముందుకు తీసుకుపోయే సమయంలో వక్రబుద్ధి ఉన్నవాళ్లు సక్రమంగా తయారుకావాలని కోరుతున్నా. ఇలాంటి చిల్లర వేషాలు ఏసేటోళ్లకు గ్యారంటీగా కరోనా తగలాలని శాపం పెడుతున్నా. ఈ దుర్మార్గంచేసేటోళ్లకు ఈ సమయంలో రాజకీయాలు ఎందుకండీ.. మీకు కూడా వస్తే తెలుస్తది ఆ జబ్బు బాధ. ఇప్పుడు కూడా ఈ పనిచేయాల్నా? చాలా ఆవేదనతో చెప్తున్నా. రాజకీయాలకు, ఎన్నికలకు ఇంకా చాలా సమయముంది. అంతా సల్లగా బతుకుతే అప్పుడు చూసుకొందాం ఎవరిదమ్ము ఎంతనో' అని సీఎం అన్నారు.

**కేసీఆర్ చెప్తే ఖతర్నాక్ ఉంటది**

'ఈ సమయంలో కావాల్సింది వెకిలితనం కాదు. లోకమే ఆగమైతుంటే.. శవాల మీద పేలాలు ఏరుకొనుడు మంచిది కాదు. ఏది పడితే అది రాస్తమంటే కరెక్టు కాదు. ప్రతిదీ ప్రభుత్వం వద్ద రికార్డు అవుతుంది. సరైన సమయంలో సరైన విధంగా శిక్షిస్తాం. అవి కూడా చాలా భయంకరంగా ఉంటయి. ఈ దుర్మార్గులను వదిలిపెట్టం. ఎందుకంటే వీరు ప్రజాద్రోహులు. కేసీఆర్ చెప్తున్న అంటే కొంచెం ఖతర్నాకే ఉంటది. చెప్పేచేస్తాం. ఇప్పటికైనా ఒళ్లు దగ్గర పెట్టుకొని ప్రవర్తించాలె. లేదంటే వారి కర్మ వారే అనుభవిస్తరు. నేనేం మీడియాకు వ్యతిరేకం కాదు. మీడియా అంటే నాకు మర్యాద ఉన్నది. ఎవరైతే దుర్మార్గంగా, చిల్లరగా, కుత్సిత బుద్ధితో, అవగాహనారాహిత్యంతో అసత్యాలు ప్రచారంచేస్తారో, అలాంటి దుర్మార్గులకే చెప్తున్నా. మీడియా మిత్రులకు చేతులెత్తి దండంపెడుతున్నా. దయచేసి ఇది సమయంకాదు' అని పేర్కొన్నారు.

**సంఘీభావ సంకేతాన్ని కూడా హేళన చేస్తరా?**

దీపం వెలిగించండి.. అని ప్రధాని పిలుపిచ్చిండు. దానిమీద కూడా జోకులు.. సెటైర్లు! ఒక విపత్తులో ఉన్నప్పుడు ప్రధాని పిలుపునిస్తే కూడా అవహేళన చేస్తరా? ఇదేం పద్ధతి? నేను కూడా చెప్పిన.. దీన్ని సంఘీభావ సంకేతం అంటరు. కష్టసమయంలో అందరం ఒక్కటిగా ఉన్నం.. ఒక్కటిగా ఎదుర్కొంటం.. ఈ విపత్తు నుంచి బయటపడుతం అనే మనోస్థైర్యాన్ని ప్రతిబింబించే చర్యలు ఇవి. తెలంగాణ ఉద్యమంలో వందలు చేసిన ఇలాంటివి. 'తెలంగాణ జే గంటలు' అని కొట్టినం. అప్పుడు కూడా కొంతమంది వెధవలు 'గంటలు పట్టి ఊళ్లల్ల కొడితే తెలంగాణ వస్తదా!' అన్నరు. మరి ఆ గంటలకే తెలంగాణ వచ్చింది. ఉద్యమిస్తున్నప్పుడు ఐక్యత నిరూపించుకోవడం, మనిషికి మనిషి ధైర్యం చెప్పుకొనే పరిస్థితి అవసరం పడుతది. అందరం కలిసి శక్తిని పోగుచేసుకొని సమస్య మీద సామూహికంగా యుద్ధం చేసుకొనే స్థితులు ఉత్పన్నమవుతుంటాయి. అందుకే ఇలాంటి పిలుపునిస్తం. ప్రధాని, సీఎం, హెల్త్ మినిస్టర్, కలెక్టర్ ఎవరైనా వ్యక్తిగతంగా పిలుపునివ్వరు. సమాజ శ్రేయస్సు ఉంటుంది. దాన్ని అవహేళనగా మాట్లాడినవాళ్లు కుసంస్కారులు, దుర్మార్గులు. వాళ్లను సమాజం క్షమించదు' అని సీఎం తీవ్రంగా వ్యాఖ్యానించారు.

**పంటొచ్చిందన్న ఆనందం లేదు**

'వాస్తవంగా నాకు చాలాబాధ కలుగుతున్నది. మొదటిసారి 40 లక్షల ఎకరాల్లో వరి పండింది. ఈ కరోనా లేకపోతే వాస్తవానికి నేను డ్యాన్స్ చేసేంత సంతోషపడుతుంటిని. రైతుల మధ్య ఉండాల్సిన పరిస్థితి. కానీ దురదృష్టం కొద్దీ ఈ వైరస్‌లో చిక్కుకున్నం. డబ్బులు లేకున్నా ధాన్యం కొనడానికి రూ.30 వేల కోట్లు సమకూర్చి మక్కలు, వడ్లు పూర్తిగా కొనాలని నిర్ణయించినం. విజయవంతంగా ధాన్యం కొనుగోలు జరుగుతున్నది. తెలంగాణ భారతదేశ ధాన్యాగారమై కూర్చున్నది. సీతారామ, పాలమూరు ఎత్తిపోతల, దేవాదుల కూడా పూర్తయితే మరింత అద్భుతంగా ఉంటుంది. కాళేశ్వరం మూడో టీఎంసీకీ మొన్ననే టెండర్లు పిలిచాం.. దాని మీద కూడా దరిద్రులు మాట్లాడారు. భారీప్రాజెక్టుకు డబ్బులున్నాయి. ప్రాజెక్టు ఆగకూడదని ప్రభుత్వం ఆ పనికి మినహాయింపు ఇచ్చింది.కాళేశ్వరం మూడో టీఎంసీ కూడా అయిపోతే కోటి ఎకరాలకు పైచిలుకు వరివేసే పరిస్థితి మనకు వస్తది. 1.30 కోట్ల ఎకరాల వరకు పంటలు వస్తయి. గన్నీ బ్యాగులగురించి కేంద్రం సీరియస్‌గా ఆలోచిస్తున్నది. నేను బెంగాల్ సీఎం మమతాబెనర్జీతో మాట్లాడాను. మనం సేకరించిన ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి ఇస్తాం. వాళ్లు 50- 60 శాతంవరకు గన్నీ బ్యాగుల్లోనే ధాన్యం ఇవ్వాలని కండిషన్ పెడుతరు. మొన్ననే కేంద్ర వినియోగదారులశాఖ సెక్రటరీ నిర్వహించిన సమావేశంలో మన పౌరసరఫరాల సంస్థ కమిషనర్ సత్యనారాయణరెడ్డి రిప్రజెంట్ చేశారు. తట్టుసంచులను బెంగాల్ నుంచి ఉత్పత్తి చేసి పంపిస్తమని ప్రధాని చెప్పారు. గన్నీ బ్యాగులు రాకపోతే ఎఫ్‌సీఐ వాళ్లు కాంప్రమైజ్‌అయి వందశాతం ప్లాస్టిక్ బ్యాగులు తీసుకోవాలి. ప్లాస్టిక్ బ్యాగులు ఉత్పత్తి చేసే వాళ్లున్నారు, ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనికి ఎఫ్‌సీఐ, కేంద్రప్రభుత్వం కూడా ఒప్పుకోవాల్సిన పరిస్థితి వస్తుంది' అని సీఎం అన్నారు.



గుడ్ సమారిటన్స్ ఆఫ్ ఖమ్మం పేరిట సేకరించిన రూ.2 కోట్ల మొత్తానికి చెక్కును సీఎం కేసీఆర్‌కు అందజేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



సీఎం కేసీఆర్‌కు రూ.కోటి చెక్కును అందజేస్తున్న తెలంగాణ పౌల్ట్రీ సంఘం అధ్యక్షుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు. చిత్రంలో మంత్రి ఈటల ఉన్నారు.



సీఎం కేసీఆర్‌కు రూ.కోటి చెక్కును అందజేస్తున్న టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, వైస్‌చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి



మంత్రి కేటీఆర్‌కు రూ.కోటి విరాళం లేఖను అందజేస్తున్న సాగర్ సిమెంట్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ ఆనంద్‌రెడ్డి, తదితరులు



మంత్రి కేటీఆర్‌కు రూ.కోటి విరాళాన్ని అందజేస్తున్న వెల్జన్ డెనిసన్ లిమిటెడ్ ప్రతినిధులు



మంత్రి కేటీఆర్‌కు రూ.కోటి చెక్కును అందజేస్తున్న కే రహేజా కార్పొరేట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి



తమకు వచ్చే రూ.5 వేల జీతంలో నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.వేయి చొప్పున మొత్తం రూ.1.72 కోట్లను ఐకేపీ వీవోఏలు పోగేశారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ నేతృత్వంలో సోమవారం ప్రగతిభవన్‌కు వెళ్లి ఆ మొత్తానికి సంబంధించిన లేఖను సీఎం కేసీఆర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, తెలంగాణ ఐకేపీ వీవోఏల గౌరవాధ్యక్షుడు రూప్‌సింగ్, మంచికట్ల కోటేశ్వర్, మారిపెల్లి మాధవి, తిరుపతి పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయనిధికి స్త్రీనిధి బ్యాంకు తమ వంతు విరాళంగా రూ.కోటి ప్రకటించింది. సోమవారం ప్రగతిభవన్‌లో మంత్రి ఎర్రబెల్లి నేతృత్వంలో సీఎం కే చంద్రశేఖర్‌రావును కలిసి విరాళం చెక్కును అందజేస్తున్న స్త్రీనిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ అధ్యక్షురాలు ఎస్ అనిత, బ్యాంకు ఎండీ విద్యాసాగర్‌రెడ్డి, తదితరులు

లాక్‌డౌన్-డే 15

| | హైదరాబాద్ | ముంబై | ఢిల్లీ |
|---|---|---|---|
| పెట్రోల్ | రూ. 73.97 | రూ. 76.31 | రూ. 69.59 |
| డీజిల్ | రూ. 67.82 | రూ. 66.21 | రూ. 62.29 |

## సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు

- ఉద్యోగ సంఘాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వైద్యారోగ్యశాఖతోపాటు పంచాయతీ, పట్టణ పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందికి వరాలు కురిపించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉద్యోగసంఘాలు ధన్యవాదాలు ప్రకటించాయి. వైద్యారోగ్యశాఖకు వేతనంలో 10 శాతం ఇన్సెంటివ్ ఇవ్వడం హర్షణీయమని తెలిపాయి. ఇది చరిత్రలో నిలిచిపోయే నిర్ణయమని ఉద్యోగసంఘాల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ మమత అన్నారు. వైద్యారోగ్యశాఖలోని ఉద్యోగులకు వేతనాల్లో 10శాతం బహుమతిగా ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడం హర్షణీయమని మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ ఆదరాభిమానం మరువలేనిదని ప్రభుత్వ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి మంచాల రవీందర్ హర్షం వ్యక్తంచేశారు.

## సీసీఎంబీలో 600 పరీక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలను ముమ్మరం చేసింది. ఆరురోజుల్లో 600 పరీక్షలు పూర్తిచేసింది. గాంధీ, ఉస్మానియా దవాఖానల నుంచి వస్తున్న శాంపిళ్లను 12 పీసీఆర్‌ల ద్వారా పరీక్షిస్తున్నారు.

## ప్రైవేట్ స్కూల్ టీచర్లకు జీతాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రైవేట్ స్కూళ్లలో పనిచేస్తున్న టీచర్లకు జీతాలు చెల్లిస్తామని ట్రస్మా అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, కార్యదర్శి మధుసూదన్ స్పష్టంచేశారు. వార్షిక పరీక్షల సమయంకల్లా జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకొంటామని తెలిపారు.

# 1200 రూపాల్లో కరోనా

- ఫ్లూ కంటే చాలా శక్తిమంతం
- అమెరికాలో మరణమృదంగం
- పూర్తి లాక్‌డౌన్ అసాధ్యం
- విచ్చలవిడి తుపాకీ సంస్కృతే కారణం

'నమస్తే తెలంగాణ'తో ప్రముఖ వైద్యనిపుణుడు డాక్టర్ భరత్‌రెడ్డి






హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెంది అగ్రరాజ్యంగా భాసిల్లుతున్న అమెరికా.. ప్రస్తుతం కరోనా కోరల నుంచి తమ ప్రజలను కాపాడుకోలేక ఆపసోపాలు పడుతున్నది. ఇందుకు కారణాలేమిటి? అసలు అక్కడ ఏమి జరుగుతున్నది? ఆ దేశంలో కొవిడ్-19 రోజురోజుకూ ఎందుకు ఉద్ధృతమవుతున్నది? బాధితులకు చికిత్స అందించడంలో ఎక్కడ లోపాలున్నాయి? ప్రపంచవ్యాప్తంగా ఇంకెంతమందికి ఈ వైరస్ సోకుతుంది? అన్న ప్రశ్నలు ఇప్పుడు అందరినీ తొలిచేస్తున్నాయి. ఇలాంటి అనేక అనుమానాలకు అమెరికాలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ భరత్‌రెడ్డి నెరవెట్ల సమాధానాలిచ్చారు. ప్రస్తుత పరిస్థితులు, తాజా అధ్యయనాలపై సంపూర్ణ అవగాహన ఉన్న డాక్టర్ భరత్ మన తెలంగాణ బిడ్డే. కల్వకుర్తికి చెందిన ఆయన ఇంటర్నల్ మెడిసిన్, న్యూరాలజీ, ఇంటర్వెన్షనల్ న్యూరాలజీ, న్యూరో క్రిటికల్ కేర్, బ్రెయిన్ స్ట్రోక్ స్పెషలిస్ట్‌గా సుపరిచితులు. మిషిగాన్‌లోని దాదాపు 15 దవాఖానల్లో సేవలందిస్తున్న డాక్టర్ భరత్.. అమెరికాలో ఇప్పుడు కరోనా ప్రభావం ఏవిధంగా ఉన్నది? భవిష్యత్తులో ఎలా ఉండనున్నదన్న విషయాలను 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా పంచుకొన్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

### కరోనా జన్యుక్రమంలో వేగంగా మార్పులు

వాస్తవానికి కరోనా కూడా ఫ్లూ వైరస్ లాంటిదే. కానీ చాలా శక్తిమంతమైనది. ఫ్లూ వైరల్ లోడ్ కంటే దాదాపు 10,000 రెట్లు ఎక్కువ వైరల్ లోడ్‌ను కలిగివుండే కరోనా.. కేవలం రెండు, మూడురోజుల్లోనే విస్తృతమవుతున్నది. అందుకే దీన్ని కట్టడిచేయడం మనవల్లకావడంలేదు. ఈ వైరస్ చాలా వేగంగా తన జన్యుస్వరూపాన్ని మార్చుకొంటున్నది. కరోనా ప్రారంభమైన వుహాన్‌లో ఈ వైరస్ 200 రకాల రూపాల్లో ఉన్నట్టు గుర్తించారు. ఇప్పటివరకు జరిగిన అధ్యయనాల ప్రకారం కరోనా జన్యుపరంగా సుమారు 1,200 రూపాల్లో ఉన్నట్టు తెలుస్తున్నది.

### బాధితుల్లో నల్లజాతీయులే ఎక్కువ

అమెరికన్లలో రోగనిరోధకశక్తి తక్కువ. శ్వేతజాతీయులతో పోల్చితే నల్లజాతీయులు కాస్త ఎక్కువగా కొవిడ్-19 బారినపడుతున్నారు. జన్యుపరంగా వారికున్న ఆరోగ్య సమస్యలు, ధూమపానం లాంటి దురలవాట్లు, రెండు, మూడు తరాలు కలిసికట్టుగా జీవించడం ఇందుకు ప్రధాన కారణాలు. పైగా అమెరికాలోని వాతావరణం, తక్కువ ఉష్ణోగ్రతలు, వ్యక్తిగత దూరాన్ని పాటించకపోవడం, సరైన సమయంలో లాక్‌డౌన్ విధించకపోవడం కొవిడ్-19 వేగంగా వ్యాప్తిచెందేందుకు దోహదపడుతున్నాయి.

### ప్రాకృతిక ఔషధాలే మనకు రక్ష

భారతీయులకు రోగనిరోధకశక్తి ఎక్కువ. ఇక్కడి వాతావరణం, ఉష్ణోగ్రతలతోపాటు సంప్రదాయ ఆహార అలవాట్లు, పసుపు, మిరియాలు, శొంఠి, అల్లం, మిర్చి లాంటి ప్రాకృతిక ఔషధాలను విరివిగా వాడటం, మలేరియా, క్షయ లాంటి వ్యాధుల నివారణకు బీసీజీ వ్యాక్సిన్లను ఉపయోగిస్తుండటం ఇందుకు ప్రధాన కారణాలు. అందుకే మన దేశంలో కరోనా అమెరికా అంత వేగంగా ప్రభావం చూపడంలేదనుకోవచ్చు.

### బార్లు, పబ్బులు బార్లా

కొవిడ్-19 వ్యాప్తిని నిరోధించేందుకు లాక్‌డౌన్ తప్పకుండా దోహదపడుతుంది. అమెరికాలోని కొన్ని రాష్ట్రాల్లో లాక్‌డౌన్ విధించినప్పటికీ బార్లు, పబ్బులు, సామూహిక సమావేశాలు మామూలుగానే జరిగాయి. కానీ మన దేశంలో ఇలాంటివన్నింటినీ నిలిపివేయడంతో ఆ ప్రభావం స్పష్టంగా కనపడింది. అమెరికాలో రెండువారాల ముందే లాక్‌డౌన్ విధించి ఉంటే పరిస్థితి ఇంత తీవ్రంగా ఉండేదికాదు. ప్రస్తుతం అమెరికాలో వైద్యపరికరాలకు తీవ్రమైన కొరత ఉన్నది. ముఖ్యంగా కొవిడ్-19 టెస్టు కిట్లు తగినంతగా అందుబాటులో లేకపోవడంతో బాధితుల సంఖ్య వేగంగా, విపరీతంగా పెరిగింది. కొవిడ్-19 లక్షణాలతో దవాఖానలకు వచ్చిన ప్రతి 50 మందిలో కిట్ల కొరత కారణంగా 20 మందికే పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో మిగిలినవారంతా కరోనా వైరస్ వ్యాప్తికి దోహదపడుతున్నారు.

### తుపాకీ సంస్కృతే కారణం

అమెరికాలో ఇప్పటికీ పూర్తిస్థాయిలో లాక్‌డౌన్ ప్రకటించకపోవడం ఆందోళనకరమే. విశృంఖల తుపాకీ సంస్కృతే ఇందుకు కారణం. చికిత్స కోసం నావద్దకు వచ్చే ప్రతి అమెరికన్ వాహనంలో ఆయుధం తప్పకుండా ఉంటుంది. అమెరికా అంతటా లాక్‌డౌన్ విధిస్తే దేశ ఆర్థికవ్యవస్థ కుప్పకూలడంతోపాటు నిత్యావసర వస్తువులకు ఇబ్బందులు తలెత్తుతాయి. అప్పుడు నేరచరితులతోపాటు ఆయుధాలున్నవారి చూపు పక్కవారిపై, సూపర్ మార్కెట్లపై పడుతుంది. అది అంతర్యుద్ధానికి దారితీస్తుందని ట్రంప్ సర్కార్ భయపడుతున్నది.

### చైనీయుల పుణ్యమే..

న్యూయార్క్‌తోపాటు న్యూజెర్సీలో కరోనా కేసులు ఎక్కువగా ఉన్నాయి. వాస్తవానికి ఈ రెండుచోట్ల చైనీయులు అధికసంఖ్యలో జీవిస్తున్నారు. వారిద్వారానే ఇక్కడ కొవిడ్-19 వ్యాప్తి ప్రారంభమైంది. పైగా ఈ రెండు నగరాలకు విదేశీ ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉండటం, చల్లటి వాతావరణం, అధిక జనాభా, బార్లు, పబ్‌లు నిత్యం రద్దీగా ఉండటం లాంటి అంశాలు కరోనా వ్యాప్తికి ఎంతో దోహదపడుతున్నాయి. అమెరికాలో కొవిడ్-19 మహమ్మారిని నిరోధించేందుకు వచ్చే వారంరోజులు చాలా కీలకం.

### 70 శాతం మందికి సోకుతుందని అంచనా

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) అంచనా ప్రకారం యావత్ ప్రపంచ జనాభాలో 50 నుంచి 70 శాతం మందికి కరోనా వైరస్ సోకుతుంది. దీన్ని పూర్తిగా నిరోధించాలంటే వ్యాక్సిన్ అందుబాటులోకి రావాలి. లేదా ప్రపంచంలోని ప్రజలందరిలో స్వతహాగా రోగనిరోధక శక్తి పెరగాలి. వ్యాక్సిన్ రావాలంటే కనీసం సంవత్సరం పడుతుంది. అప్పటివరకూ కరోనా తన ప్రతాపాన్ని చూపుతూనే ఉంటుంది. ఈలోగా ఎంతమంది మరణిస్తారో చెప్పలేం.

### గాలిద్వారానూ కరోనా వ్యాప్తి

గాలిద్వారా కూడా కరోనా వ్యాప్తిచెందే అవకాశాలు ఎక్కువే. ఎందుకంటే.. మనం తుమ్మినా, దగ్గినా తుంపర్లు 6 అడుగుల దూరం వరకు దూసుకెళ్తాయి. అప్పుడు ఏరోసోల్స్ (0.001 మైక్రాన్ పరిమాణంలో ఉండే సూక్ష్మ నీటి బిందువులు) గాలిలో 2 నుంచి 3 గంటలపాటు ఉంటాయి. వీటి ప్రభావం 27 అడుగుల దూరం వరకు ఉండవచ్చు. గట్టిగా గాలివీస్తే ఆ ప్రభావం ఇంకా ఎక్కువగా ఉంటుంది. అందుకే గాలి ద్వారా కూడా కరోనా వ్యాప్తిచెందుతుందని నేను అభిప్రాయపడుతున్నా.

### హైడ్రాక్సీక్లోరోక్విన్‌తో సత్ఫలితాలు

మలేరియా నివారణకు వాడే హైడ్రాక్సీక్లోరోక్విన్‌ను కొవిడ్-19 బాధితులకూ ఉపయోగించవచ్చు. నాతోపాటు నాకు తెలిసిన కొందరు డాక్టర్లు తమ దవాఖానల్లో తాత్కాలికంగా ఈ మందును వాడుతున్నారు. అమెరికాలోని రెండు దవాఖానల్లో ప్రయోగాత్మకంగా దీన్ని వాడేందుకు తాజాగా ఎఫ్‌డీఏ అనుమతిచ్చింది. నిత్యం కొవిడ్-19 రోగులకు సేవలందిస్తున్న నేను కూడా ఈ డ్రగ్‌ను తీసుకోవడంతోపాటు నా కుటుంబసభ్యులకు కూడా ఇచ్చాను. హైడ్రాక్సీక్లోరోక్విన్‌ను ఇతర కాంబినేషన్లతో వాడితే ఫలితం ఉంటుంది. ఇతర దేశాల్లోని వైద్యులు కూడా ఇదే విషయాన్ని చెప్తున్నారు.



కరోనా వైరస్‌పై పౌరులకు ప్రామాణిక సమాచారాన్ని అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం వాట్సాప్ సాజన్యంతో కొవిడ్ ఇన్ఫో పేరిట రూపొందించిన 'చాట్ బాట్'ను మంత్రి కేటీఆర్ సోమవారం ఆవిష్కరించారు. 9000658658 నంబర్‌లో కరోనా సమాచారాన్ని ఇంట్లోనే ఉండి తెలుసుకోవచ్చు. - హైదరాబాద్, నమస్తే తెలంగాణ

## పారిశుద్ధ్య కార్మికులకు ప్రోత్సాహకంపై సీఎంకు కేటీఆర్ ధన్యవాదాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్, మురుగునీటి నిర్వహణ కార్మికులకు రూ.7,500, మున్సిపాల్టీలు, గ్రామపంచాయతీల్లోని పారిశుద్ధ్య కార్మికులకు రూ.5 వేల చొప్పున ప్రత్యేక ప్రోత్సాహాన్ని ప్రకటించిన సీఎం కేసీఆర్‌కు మంత్రి కేటీఆర్ ట్విట్టర్ ద్వారా ధన్యవాదాలు తెలిపారు. 95,392 మంది ఫ్రంట్‌లైన్ కారికులకు ఈ ప్రోత్సాహకం అందుతుందని మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.

### ఆ ముగ్గురూ సిటిజెన్ హీరోస్

కొవిడ్-19 బాధితులకు సేవలందిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వైద్యులను 'సిటిజెన్ హీరోస్'గా మంత్రి కేటీఆర్ అభినందించారు. వీరిలో ఒకరైన మహబూబ్‌ఖాన్ హైదరాబాద్‌లోని ఛాతీ దవాఖాన సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. ఇండోనేషియాకు చెందిన 9 మంది కోలుకోవడంలో కీలకపాత్ర పోషించారు. ఆయన భార్య షహనాఖాన్ గాంధీ దవాఖానలో చర్మవ్యాధి నిపుణురాలు. ఆమె కూడా కరోనా వార్డులోనే విధులు నిర్వర్తిస్తున్నారు. వీరి కుమార్తె రషీఖాఖాన్ ఫీవర్ దవాఖానలో హౌస్ సర్జన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ముగ్గురు అందిస్తున్న సేవలను మంత్రి కేటీఆర్ ట్విట్టర్ ద్వారా ప్రశంసించారు. అలాగే, సీఎం సహాయ నిధికి రూ.10 లక్షల సాయాన్ని అందించిన బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్‌కు మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ఇండ్లకే పరిమితమైన విద్యార్థులు, పిల్లలు టీ-సాట్ ప్రసారాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కేటీఆర్ సూచించారు.




మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట పీఎస్ పరిధిలోని కొమ్ముగూడెంలో ఉంటున్న తొమ్మిది నెలల గర్భిణి అయిన తన భార్య మౌనికను దవాఖానకు తీసుకెళ్లడానికి సహకరించాలని వృత్తిరీత్యా వైజాగ్‌లో ఉన్న మహేశ్ ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్‌ను అభ్యర్థించారు. స్పందించి మంత్రి కేటీఆర్ చేసిన సూచన మేరకు పోలీసులు తమ పెట్రోలింగ్ వాహనంలో ఆమెను మంచిర్యాల దవాఖానకు తరలించారు. - లక్షెట్టిపేట

# ఆన్‌లైన్ బోధనకు వర్సిటీలు

- సిద్ధమవుతున్న అధికారులు
- విద్యాసంవత్సరం నష్టపోకుండా పకడ్బందీ చర్యలు
- రిజిస్ట్రార్లతో గవర్నర్ తమిళిసై వీడియో కాన్ఫరెన్స్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా ప్రభావంతో రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించిన నేపథ్యంలో విద్యాసంవత్సరం నష్టపోకుండా అవసరమైన చర్యలపై వర్సిటీలు దృష్టి సారించాయి. ఆన్‌లైన్‌లో పాఠాలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ సోమవారం రాజ్‌భవన్ నుంచి వర్సిటీల రిజిస్ట్రార్లతో నిర్వహించిన వీడియా కాన్ఫరెన్స్‌లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. విద్యార్థులు నష్టపోకుండా ఆన్‌లైన్లో పాఠాలు బోధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని గవర్నర్ సూచించారు. డిగ్రీ కోర్సులతోపాటు ఇంజినీరింగ్, ఫార్మసీ వంటి సాంకేతిక విద్య కోర్సులకు కూడా ఆన్‌లైన్ పాఠాలను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నామని పలువురు రిజిస్ట్రార్లు గవర్నర్ దృష్టికి తెచ్చారు. వర్చువల్ తరగతులు నిర్వహించడంతోపాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడానికి యూనివర్సిటీలు సిద్ధంగా ఉన్నాయని జేఎన్టీయూహెచ్ ఇంచార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గోవర్ధన్ పేర్కొన్నారు.

### కరోనా పరిశోధనలపై దృష్టి పెట్టండి

వైరస్ నియంత్రణకు వర్సిటీల్లో ఏవైనా పరిశోధనలు చేట్టారా? అని ప్రశ్నించిన గవర్నర్.. పరిశోధనలపై ఇప్పటికైనా దృష్టి పెడితే మంచిదన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. కరోనాపై ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు, జీవనశైలిలో మార్పులు చేసుకొనేలా సహకరించేందుకు ఎన్నెస్సెస్ వలంటీర్ల సేవలను వినియోగించుకోవాలన్నారు.

### జైనులకు గవర్నర్ శుభాకాంక్షలు

మహావీర్ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని జైనులకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజ్‌భవన్‌లో మహావీర్ విగ్రహానికి గవర్నర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## టీ సాట్ డిజిటల్ పాఠాలు

- ఎంసెట్, నీట్, జేఈఈకి ప్రత్యేక స్లాట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీ సాట్ రూపొందించిన 6 నుంచి 10 తరగతుల అన్ని పాఠ్యాంశాలు తమ యూట్యూబ్‌లో అందుబాటులో ఉన్నాయని టీ సాట్ సీఈవో ఆర్ శైలేష్‌రెడ్డి తెలిపారు. పాఠశాల విద్యాశాఖ, ఎస్సీఈఆర్టీ, స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ (సైట్) సహకారంతో ఈ పాఠాలు రూపొందించామన్నారు. ఎంసెట్, నీట్, జేఈఈ వంటి పోటీ పరీక్షలకు కూడా నిపుణ, విద్యా చానళ్ల ద్వారా ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 10 వరకు ప్రత్యేక డిజిటల్ తరగతులు బోధిస్తున్నట్టు చెప్పారు.

## హిమాన్షు 'విన్ కరోనా'



కరోనా వైరస్‌ను ఎదుర్కోవడానికి సంఘటిత స్ఫూర్తిని ప్రదర్శించడంలో భాగంగా దీపాలు వెలిగించి 'విన్ కరోనా' హ్యాష్‌ట్యాగ్‌తో మంత్రి కేటీఆర్ కుమారుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ మనుమడు హిమాన్షు ట్విట్టర్‌లో చాలెంజ్ విసిరారు. కరోనా మహమ్మారిపై పోరాడటానికి అందరూ ముందుండి ఐక్యతను చాటాలనే ఉద్దేశంతో ఈ నినాదాన్ని ఇచ్చారు. దీంతో అనేక మంది యువత ట్విట్టర్‌లో హిమాన్షు చాలెంజ్‌ను స్వీకరించి దీపాలు వెలిగించారు. - హైదరాబాద్, నమస్తే తెలంగాణ

## యూకే విద్యార్థులను రప్పించండి

- ఎంపీ రంజిత్‌రెడ్డి లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: యూకేలో చిక్కుకుపోయిన తెలంగాణ విద్యార్థులను వెనక్కి తీసుకురావాలని కోరుతూ చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కేంద్రమంత్రి జయశంకర్‌కు లేఖ రాశారు. యూకేలో 45 వేలకుపైగా కరోనా కేసులు నమోదుకాగా 4,500 మంది మరణించారని.. అక్కడి ప్రభుత్వం రవాణా వ్యవస్థను పూర్తిగా నిలిపివేస్తున్నట్టు ప్రకటించిందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన 380 మంది విద్యార్థులు తాము ఇండియాకు వెళ్తామంటూ అక్కడి ఇండియన్ హై కమిషనర్‌ను అభ్యర్థించారని కేంద్ర మంత్రికి వివరించారు. వీరిలో 50 మంది తెలంగాణ రాష్ట్రానికి చెందిన విద్యార్థులు ఉన్నారని తెలిపారు.

## యోగా కోసం వెళ్లి.. నాందేడ్‌లో చిక్కుకుని

ఔరంగాబాద్: తెలంగాణలోని రెండు వ్యవసాయ కళాశాలలకు చెందిన 29 మంది విద్యార్థులు యోగ నేర్చుకోవడానికి మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకువెళ్లి అక్కడే చిక్కుకుపోయారు. స్వరాష్ట్రానికి వచ్చేందుకు 60 కిలోమీటర్లు నడిచి మార్చి 30న నాందేడ్ చేరుకున్నారు. అక్కడి అధికారులు వారిని ఆపి కౌన్సిలింగ్ చేసి.. తాత్కాలిక వసతి, భోజన సదుపాయం కల్పించారు. దేగ్లూర్ తహసిల్ పరిధిలోని పారిశ్రామిక శిక్షణకేంద్రంలో వీరికి వసతి కల్పించామని తాసిల్దార్ అరవింద్ బోలంగే తెలిపారు.

# అబల కాదు సబల



వైరస్‌ను తట్టుకోవడంలో పురుషులకంటే మెరుగైన సామర్థ్యం

- అమెరికా కరోనా మరణాల జాబితాలో పురుషులే అధికం
- న్యూయార్క్ సహా అనేక రాష్ట్రాల అధ్యయనంలో స్పష్టం
- ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ ఇదే పరిస్థితి
- మహిళల జన్యు నిర్మాణంలోనే ఆ శక్తి ఉన్నదంటున్న శాస్త్రవేత్తలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రపంచవ్యాప్తంగా మానవాళి మనుగడకే కరోనా సవాలుగా మారిన ఈ తరుణంలో పురుషులకంటే మహిళలు ఈ రక్కసిని ఎదుర్కోవడంలో విజయం సాధిస్తున్నారని గణాంకాలు చెప్తున్నాయి. డబ్ల్యూహెచ్‌వో ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా కరోనా బారిన పడినవారిలో మరణాల రేటు (మోర్టాలిటీ) పురుషులది 4.7 శాతంగా ఉంటే.. మహిళలది 2.8 శాతంగా ఉన్నది. ఇందుకు ప్రధాన కారణం వైరస్‌ను సమర్థంగా ఎదుర్కోవడంలో పురుషులకంటే మహిళల శరీరం సమర్థంగా పనిచేస్తున్నదని శాస్త్రవేత్తలు స్పష్టంచేస్తున్నారు. వైరస్‌ను తరిమికొట్టడంలో వారిలోని జన్యు నిర్మాణమే బలమైన పునాదిగా పనిచేస్తున్నదని వివరిస్తున్నారు.

### మహిళలదే పైచేయి

ప్రపంచాన్ని కరోనా వైరస్ కలవరపరుస్తున్న ఈ తరుణంలో ప్రతి అంశమూ విశ్లేషణకు దారి తీస్తున్నది. ఇందులో ఏయే వయసులవారు ఎక్కువగా ఈ వైరస్ బారిన పడుతున్నారనేది ఒకటైతే.. ప్రధానంగా కరోనాతో చనిపోయేవారిలో లింగభేదం ఎలా ఉన్నదనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. చైనాలో ముందు మహిళలు, పురుషుల శాతం దాదాపు సమానంగా ఉన్నప్పటికీ ఆ తర్వాత మగవారి శాతం పెరిగింది. అనంత రం ఇటలీలో మార్చి 20 వరకు గణాంకాలను పరిశీలిస్తే.. ఆడవారి కంటే మగవారి మరణాల రేటు రెట్టింపుస్థాయిలో ఉన్నది. తాజాగా ఆ దేశ పబ్లిక్ హెల్త్ డాటా ప్రకారం.. పాజిటివ్ కేసుల్లో పురుషులు 60 శాతం, మహిళలు 40 శాతంగా ఉన్నారు. మరణాల్లో పురుషులు ఏకంగా 70 శాతంగా ఉన్నారు. అంటే మహిళల మరణాలు కేవలం 30 శాతంగా నమోదవుతున్నారు. కరోనా బారిన పడకుండా తప్పించుకోవడం మొదలు సోకినవారు కోలుకోవడంలోనూ మహిళలదే పైచేయిగా ఉన్నది. భారత్‌లోనూ ఇదే పరిస్థితి కనపిస్తున్నది. తాజాగా దేశవ్యాప్తంగా ఉన్న కరోనా పాజిటివ్ కేసుల జాబితాలో 71 శాతం పురుషులు.. 29 శాతం మహిళలు ఉన్నారు. మరణాల రేటులోనూ పురుషులే అధికంగా కనిపిస్తున్నారు.

### పునరుత్పత్తిని అడ్డుకొనే శక్తి ఎక్కువ

సాధారణంగా మహిళల శరీరంలో ఇన్‌ఫెక్షన్స్‌ను తట్టుకొనే, వైరస్ పునరుత్పత్తిని అడ్డుకొనే శక్తి ఎక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఇందుకు వారిలోని జన్యు నిర్మాణమే ప్రధాన కారణమని స్పష్టంచేస్తున్నారు. 'మహిళల శరీరం ఇన్‌ఫెక్షన్‌తో బాగా పోరాడుతుంది. అందుకు హార్మోన్ల వ్యవస్థే కారణం. స్త్రీ పుట్టుకలోనే జన్యుపరంగా రెండు ఎక్స్ క్రోమోజోములు ఉంటాయి. తల్లిదండ్రుల నుంచి ఒకటి చొప్పున వచ్చే ఎక్స్ క్రోమోజోములు డబుల్ డోసేజ్‌గా పనిచేయడం వల్ల వారిలో రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది' అని అమెరికాలోని జాన్ హాప్కిన్స్ యూనివర్సిటీ మైక్రోబయాలజిస్టు సబ్రా క్లెయిన్ తెలిపారు. ముఖ్యంగా ఎక్స్ క్రోమోజోముల్లో ఉండే 60 జన్యువులు రోగనిరోధక శక్తిలో పనిచేస్తాయని, 'టాల్ లైక్ రెసిప్టర్- 7' వైరస్ ఆర్‌ఎన్‌ఏను వెంటనే గుర్తించి.. శరీరాన్ని అప్రమత్తం చేస్తుందన్నారు. వైరస్ పునరుత్పత్తిని వెంటనే అడ్డుకుంటుందని ఆమె వివరించారు. ఇన్‌ఫెక్షన్‌పై పోరాడటంలో మనిషి శరీరంలోని సెక్స్ హార్మోన్ల ప్రభావం కూడా ఉంటుందని చెప్పారు. ఇన్‌ఫ్లూయెంజా వైరస్‌లపై జరిగిన పరిశోధనలో భాగంగా ఆడ ఎలుకల్లో పరీక్షించినప్పుడు వైరస్‌ల పట్ల హైపర్ రెస్పాన్స్ గుర్తించామన్నారు. ముఖ్యంగా ఊపిరితిత్తుల్లో రసాయనాలు ఒక కవచంగా ఏర్పడి వైరస్‌లతో పోరాడుతాయని తెలిపారు.



## మహిళలే సురక్షితం

అమెరికాలో కరోనా విలయతాండవం చేస్తున్న తరుణంలో బాధితుల్లో లింగభేదంపై విశ్లేషణలు జోరుగా సాగుతున్నా యి. ఓ తాజా అధ్యయనంలో 50 రాష్ట్రాలకుగాను భారీగా వైరస్ ప్రభావం ఉన్న 37 రాష్ట్రాల్లో పాజిటివ్ కేసులు, మరణాల సంఖ్యను 'ది వాషింగ్టన్ పోస్ట్' విశ్లేషించింది. ఈ నెల 4 వరకు అందుబాటులో ఉన్న డాటా మేరకు ఈ విశ్లేషణ చేయగా.. అత్యధిక రాష్ట్రాల్లో పాజిటివ్ కేసుల్లో మహిళలు ఎక్కువగా ఉండగా, మరణాల్లో మాత్రం పురుషులే ఎక్కువగా ఉన్నారు.

- మిచిగాన్ పాజిటివ్ కేసుల్లో మహిళలు 50 శాతం ఉండగా, మరణాల రేటులో 39 శాతంగా ఉన్నారు. ఈ నెల 4వ తేదీ వరకు 479 (61 శాతం) మంది పురుషులు మరణించారు.
- వాషింగ్టన్‌లో పాజిటివ్ కేసుల్లో పురుషులు 44 శాతం, మహిళలు 56 శాతంగా ఉన్నారు. మరణాల రేటులో పురుషులది 57 శాతంగా ఉన్నది.
- న్యూయార్క్‌లో వైరస్ బారిన పడినవారిలో పురుషులు 55 శాతం ఉండగా, వారి మరణాల రేటు ఏకంగా 62 శాతంగా నమోదైంది. అంటే వైరస్‌బారిన పడినవారిలో మహిళలు 45 శాతం ఉన్నప్పటికీ మరణాల రేటు 28 శాతంగానే ఉన్నది.
- ఫ్లోరిడాలో కరోనా మరణాల్లో 53 శాతం మంది పురుషులు ఉన్నారు. గత శుక్రవారం ఒక్కరోజే నమోదైన కేసుల్లో 61 శాతం పురుషులు, 29 శాతం మహిళలు ఉన్నారు. ఇక ఇతర రాష్ట్రాల్లోని గణాంకాలు కూడా ఇదే విషయాన్ని వెల్లడిస్తున్నాయి.

### తదుపరి దశకు చేరకుండా కళ్లెం

మహిళల శరీరంలో వైరస్‌ను నిర్మూలించే రోగనిరోధక శక్తి వేగంగా పనిచేస్తుందని వాషింగ్టన్ వర్సిటీలోని సెంటర్‌ఫర్ న్యూరో ఇమ్యునాలజీ, న్యూరో ఇన్‌ఫెక్షన్ డిసీజెస్ డైరెక్టర్ రాబిన్ క్లెయిన్ తెలిపారు. శరీరంలోకి వైరస్ ప్రవేశించిన వారంలోపే అది తదుపరి దశకు వెళ్లకుండా నిరోధిస్తుందని చెప్పారు. పక్షుల్లో కూడా మగవాటిలో కంటే ఆడవాటిలో ఎక్కువ యాంటిబాడీ స్థాయి ఉంటుందని వాటి సంభోగ సమయంలో తేలిందని వివరించారు. బల్లుల్లోనూ ఇదే రీతిన ఆడవాటిలోనే ఎక్కువ యాంటీబాడీస్థాయి ఉన్నదన్నారు. వైరస్‌లపై పోరాడటంలో హార్మోన్ల ప్రభావం చాలా ఉంటుందన్న ఆయన.. వయసు పెరిగేకొద్దీ వీటి ఉత్పత్తి తగ్గుతున్నందున వైరస్‌ల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. కరోనా నేపథ్యంలో నిర్ణీత దూరం పాటించడంలో పురుషుల కంటే మహిళలు అత్యధికంగా జాగ్రత్తలు పాటించారని తమ అధ్యయనంలో తేలిందని కెంట్ వర్సిటీ ఎపిడమాలజిస్టు తార తెలిపారు. అమెరికాలో మహిళల కంటే పురుషుల సరాసరి జీవితకాలం ఐదేండ్లు తక్కువ అని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక స్పష్టం చేస్తున్నందున.. ఆ మేరకు కరోనా మరణాల్లోనూ అదే ప్రభావం ఉన్నదనేది ఆమె అభిప్రాయం.

## కరోనా వీరనారి

మొదటిపేజీ తరువాయి...

మహిళా, శిశు సంక్షేమశాఖ చేసిన ట్వీట్‌పై మంత్రి కేటీఆర్ స్పందించారు. అంగన్‌వాడీల పనితీరును అభినందించడంతోపాటు రమణమ్మను 'సిటిజెన్ హీరో'గా అభివర్ణించారు. కరోనా వైరస్‌పై పోరులో మహిళా, శిశు సంక్షేమశాఖ పోషిస్తున్న పాత్రను కొనియాడారు. దీనిపై నీతిఆయోగ్ స్పందించింది. గిరిజన ప్రాంతాల్లో తల్లీ, బిడ్డల క్షేమం కోసం కృషిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు అభినందనీయులని పేర్కొన్నది. కరోనా నియంత్రణకు కృషిచేస్తున్న ఇలాంటి విజేతల వివరాలను తమతో పంచుకోవాలని నీతిఆయోగ్ ట్వీట్ చేసింది.

# లాక్‌డౌన్ ఎత్తేస్తే ముప్పే

## మళ్లీ వైరస్ విజృంభిస్తుంది..హెచ్చరిస్తున్న నిపుణులు

## 21 రోజులు సరిపోవన్న కేంబ్రిడ్జి వర్సిటీ అధ్యయనం

## 49 రోజులు పాడిగిస్తేనే కట్టడి చేయొచ్చని సూచన

కేంబ్రిడ్జి వర్సిటి ప్రకారం.. లాక్‌డౌన్ సరళిని బట్టి భారత్‌లో కేసుల తీరు




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6:** కరోనా వ్యాప్తిని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం విధించిన దేశవ్యాప్త లాక్‌డౌన్ ఈ నెల 14తో ముగియబోతున్నది. ఈ నేపథ్యంలో లాక్‌డౌన్ పాడిగిస్తారా? లేదా? అన్నదానిపై సందిగ్ధత నెలకొన్నది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో లాక్‌డౌన్‌ను ఎత్తేయడం ప్రమాదకరం అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వైరస్‌ను నియంత్రించాలంటే ప్రస్తుతం అమల్లో ఉన్న 21 రోజుల లాక్‌డౌన్ సరిపోదని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన 'సెంటర్ ఫర్ మ్యాథమెటికల్ సైన్స్' పరిశోధకుల బృందం అంచనావేసింది. ఇప్పుడు ఎత్తివేస్తే కేసులు ఉద్ధృతమవుతాయని హెచ్చరించింది. ఐదురోజులు విరామం ఇచ్చి మరో 28 రోజులపాటు లాక్‌డౌన్ పొడిగించినా పెద్దగా ప్రయోజనం ఉండదని, ఆ తర్వాత కూడా కేసులు పుంజుకుంటాయని స్పష్టంచేసింది. ఏకబిగిన 49 రోజులపాటు లాక్‌డౌన్ కొనసాగిస్తేనే వైరస్‌ను అదుపులోకి తేవొచ్చని అభిప్రాయపడింది. దీనికి మరో ప్రత్యామ్నాయం కూడా సూచించింది. 21రోజుల గడువు ముగిసిన తర్వాత మరో రెండు విడతలుగా లాక్‌డౌన్ అమలుచేయొచ్చని తెలిపింది. తొలుత 28రోజులు లాక్‌డౌన్‌ను పొడిగించి, ఆ తర్వాత ఐదు రోజులు విరామమిచ్చి, మళ్లీ 18 రోజులపాటు లాక్‌డౌన్ అమలుచేయాలని సూచించింది. దీని ద్వారా వైరస్‌ను కట్టడి చేసేందుకు వీలవుతుందని తెలిపింది.

### సెప్టెంబర్ మధ్య వరకు..

భారత్‌లో 14న తర్వాత లాక్‌డౌన్ ఎత్తివేయకపోవచ్చని అమెరికాకు చెందిన బోస్టన్ కన్సల్టెన్సీ సంస్థ అభిప్రాయపడింది. సెప్టెంబర్ మధ్య వరకు ఆంక్షలను కొనసాగించవచ్చని తెలిపింది. జూన్ నాలుగోవారం, సెప్టెంబర్ రెండో వారం మధ్య లాక్‌డౌన్‌ను ఎత్తివేసే చర్యలు ప్రారంభించొచ్చని అంచనావేసింది. వైద్య వ్యవస్థ సన్నద్ధత, ప్రభుత్వ విధానాల అమల్లో ఎదురవుతున్న సవాళ్లే ఆంక్షల ఎత్తివేతలో జాప్యానికి కారణమని పేర్కొంది. అలాగే జూన్ మూడో వారంలో భారత్‌లో కరోనా కేసులు శిఖరాగ్రస్థాయికి చేరుకుంటాయని హెచ్చరించింది.

బోస్టన్ కన్సల్టెన్సీ సంస్థ అధ్యయనం ప్రకారం..

భారత్‌లో రోజూ నమోదయ్యే కొత్త కేసులు




దేశంలో మొత్తం కరోనా బాధితులు




### హాట్‌స్పాట్‌లకే పరిమితం..

లాక్‌డౌన్‌ను కొనసాగించేందుకే కేంద్ర ప్రభుత్వం మొగ్గుచూపవచ్చని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. అయితే ఇందుకు కొన్ని మినహాయింపులు ఇవ్వొచ్చని అంటున్నారు. వ్యవసాయ కార్యకలాపాలకు మినహాయింపునివ్వొచ్చని, విమాన సర్వీసులు పాక్షికంగా ప్రారంభం కావొచ్చని, వైరస్ ప్రభావం అధికంగా ఉన్న ప్రాంతాల (హాట్‌స్పాట్‌ల) వరకే పూర్తి లాక్‌డౌన్ పరిమితం అవ్వొచ్చన్న ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, లాక్‌డౌన్ పొడిగింపు నిర్ణయాన్ని రాష్ట్రాలకే వదిలివేయొచ్చన్న అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి.

### దశలవారీ ఎత్తివేతకు సంకేతాలు..

దశలవారీగా లాక్‌డౌన్ ఎత్తివేతకు ప్రధాని మోదీ సంకేతాలిచ్చారు. కరోనా తీవ్రత లేని ప్రాంతాల్లో మెల్లగా కార్యాలయాలను తెరిచేందుకు మెరుగైన ప్రణాళికను రచించాలని ఆయన కేంద్రమంత్రులకు సూచించారు. లాక్‌డౌన్ ఎత్తివేసిన తర్వాత దృష్టిసారించిన 10 ప్రాధాన్యతా అంశాలను రూపొందించాలని కోరారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. కరోనా తీవ్రతను తగ్గించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే వాణిజ్యం కొనసాగింపు ప్రణాళికను రూపొందించాలని కోరారు.

## లాక్‌డౌన్‌తో చెక్ పెట్టారు

### వుహాన్, సింగపూర్ అనుభవపాఠమిదే

*బీజింగ్/సింగపూర్:* ప్రపంచ దేశాల్ని అల్లాడిస్తున్న కరోనా విశ్వమారిని కట్టడి చేయడానికి లాక్‌డౌన్ ఓ పాశుపతాస్త్రంలా పనిచేస్తున్నది. కరోనా వైరస్ వెలుగుచూసిన చైనాలోని వుహాన్ నగరం, సింగపూర్ అనుభవాలు దీనిని నిరూపిస్తున్నాయి.

**ఆంక్షల కొనసాగింపుకు మొగ్గు**

గత డిసెంబర్ చివర్లో వెలుగుచూసిన కరోనాతో చైనాలోని ఒక కోటి జనాభా గల వుహాన్ నగరం ఉలిక్కి పడింది. ఆలస్యంగానైనా మేల్కొన్న యంత్రాంగం నగరవ్యాప్తంగా జనవరి 23న లాక్‌డౌన్ విధించింది. ఫలితంగా మార్చి చివరినాటికి పరిస్థితి అదుపులోకి వచ్చింది. అప్పటికే నమోదైన 50 వేల కేసులకు కొత్త కేసులు పెద్దగా జతకూడలేదు. ఈ 50 వేల మందిలో 47 వేల మందిని కోలుకునేలా చేయగలిగారు. ఈ బుధవారం నగరవ్యాప్తంగా లాక్‌డౌన్‌ను ఎత్తివేయాలని భావిస్తున్నప్పటికీ, ఇంకా 574 మందికి కరోనా పాజిటివ్ ఉండ టం తో కొన్ని ఆంక్షల్ని కొనసాగించాలని భావిస్తున్నారు.

**అది చేయాల్సిందే**

అది మార్చి 21. దాదాపు 170 దేశాలు అతలాకుతలం అవుతున్న సమయం. సింగపూర్ మాత్రం ధైర్యంగా ఉన్నది. దేశంలో అప్పటికే 385 పాజిటివ్ కేసులు నమోదైనప్పటికీ జంకు లేదు. సరిహద్దులు, భూ, వాయు, జల మార్గాల్ని ఆ దేశం అప్పటికే మూసేసింది. అయితే, ఆ సాయంత్రమే మొదటి కరోనా మరణం నమోదైంది. క్రమంగా రోజుకు సగటున 60 కొత్త కేసుల చొప్పున మొత్తం 1375 కేసులు, ఆరు మరణాలు నమోదయ్యాయి. సరిహద్దుల్ని మూసివేసినంత మాత్రాన ఈ మహమ్మారిని కట్టడి చేయలేమని నిర్ధారించుకున్న ఆ దేశ ప్రధాని లీ లూంగ్.. ఏప్రిల్ 3 నుంచి ఒక నెలపాటు సంపూర్ణ లాక్‌డౌన్ ప్రకటించారు. కరోనా వ్యాప్తిని అరికట్టాలంటే ఇదే అత్యుత్తమ విధానమని ఆయన వ్యాఖ్యానించారు.

### కరోనా క్లాక్

6-4-2020

| | |
|---|---|
| ప్రపంచవ్యాప్తంగా ప్రభావిత కేసులు | 13.29 లక్షలు |
| కోలుకున్నవారు | 2,77,327 |
| మరణాలు | 73,831 |

| దేశం | కేసులు | మరణాలు |
|---|---|---|
| అమెరికా | 3,56,414 | 10,490 |
| స్పెయిన్ | 1,35,032 | 13,169 |
| ఇటలీ | 1,32,547 | 16,523 |
| జర్మనీ | 1,01,558 | 1,662 |
| ఫ్రాన్స్ | 98,010 | 8,911 |
| చైనా | 81,708 | 3,331 |
| ఇరాన్ | 60,500 | 3,739 |
| యూకే | 51,608 | 5,373 |
| టర్కీ | 30,217 | 649 |
| స్విట్జర్లాండ్ | 21,652 | 762 |

| | |
|---|---|
| దేశవ్యాప్తంగా ప్రభావిత కేసులు | 4,281 |
| కోలుకున్నవారు | 318 |
| మరణాలు | 111 |

**దేశంలో కరోనా కేసులు**

| | | |
|---|---|---|
| మహారాష్ట్ర 748 | తమిళనాడు 571 | ఢిల్లీ 525 |
| తెలంగాణ 364 | కేరళ 314 | ఉత్తరప్రదేశ్ 308 |
| రాజస్థాన్ 274 | ఏపీ 266 | మధ్యప్రదేశ్ 256 |
| కర్ణాటక 151 | గుజరాత్ 146 | కశ్మీర్ 109 |
| హర్యానా 96 | ప. బెంగాల్ 80 | పంజాబ్ 79 |

## ప్రధాని, ఎంపీల జీతాల్లో

# 30 శాతం కోత

- కరోనాపై పోరాటంలో భాగంగా కేంద్ర క్యాబినెట్ నిర్ణయం
- రెండేండ్లపాటు ఎంపీ ల్యాడ్స్ పథకానికి నిధులు నిలిపివేత



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6:** కరోనాపై పోరాటంలో భాగంగా కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకున్నది. ప్రధాని, కేంద్ర మంత్రులు, 750 మంది ఎంపీ ల వేతనాల్లో ఏడాదిపాటు 30 శాతం కోత విధించాలని సోమవారం నిర్ణయించింది. ప్రధాని మోదీ అధ్యక్షతన తొలిసారిగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం క్యాబినెట్ భేటీ జరిగింది. మీడియాకు వివరాల్ని కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ వెల్లడించారు. రెండేండ్లపాటు(2020–22 వరకు) ఎంపీ ల్యాడ్స్ నిధుల్ని కూడా రద్దు చేస్తున్నట్టు క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నదని, ఇలా మిగిలే రూ. 7,900 కోట్లు కూడా కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియాకు చేరుతాయన్నారు. రాష్ట్రపతి కో వింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, అన్ని రాష్ట్రాల గవర్నర్లు 30 శాతం తక్కువ వేతనాన్ని తీసుకోవడానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చినట్టు చెప్పారు. ఈ మొత్తం కూడా కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియాలో జమ అవుతుందన్నారు. కాగా, తెలంగాణ తరహాలో కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయాన్ని మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్వాగతించారు.

## 2-3 దశల మధ్యలో వైరస్ వ్యాప్తి: కేంద్రం

**న్యూఢిల్లీ:** దేశంలో కరోనా వైరస్ రెండు, మూడో దశ మధ్యలో ఉన్నదని కేంద్ర ఆరోగ్య శాఖ, ఎయిమ్స్ సోమవారం పేర్కొన్నాయి. కొన్ని ప్రాంతాల్లో లోకలైజ్‌డ్ కమ్యూనిటీ ట్రాన్స్‌మిషన్ (స్థానిక సమూహ సంక్రమణ) దశను గుర్తించామని తెలిపాయి. ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రణ్‌దీప్ గులేరియా మాట్లాడుతూ దేశంలోని చాలా ప్రాంతాల్లో కరోనా రెండో దశలోనే ఉన్నదన్నారు. అయితే, కొన్ని ప్రాంతాల్లో స్థానిక సమూహ సంక్రమణ దశను గుర్తించామని, దీన్ని అదుపు చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు.

# ఇది సుదీర్ఘ పోరాటం

- అలసిపోకూడదు.. ఓడినట్లు భావించకూడదు
- కరోనాపై తప్పక విజయం సాధిస్తాం
- భారత చర్యలకు ప్రపంచదేశాల ప్రశంస
- లాక్‌డౌన్ సందర్భంగా ప్రజలు గొప్ప పరిణతి చూపారు: ప్రధాని మోదీ




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6:** కరోనా మహమ్మారిపై పోరాటం సుదీర్ఘమైనదని, ఇందులో మనం అలసిపోకూడదని, ఓడిపోయినట్లు భావించకూడదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో దేశం తప్పక విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. బీజేపీ 40వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సోమవారం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కరోనాను ఎదుర్కోవడంలో ప్రభుత్వం చేపట్టిన చర్యలపై విపక్షాలు చేస్తున్న విమర్శలపై ఈ సందర్భంగా స్పందించారు. భారత్ చర్యలు ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచాయని, వివిధ దేశాలతోపాటు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) సైతం భారత్‌ను ప్రశంసించిందని గుర్తుచేశారు. కరోనా తీవ్రతను మొదటే గుర్తించిన దేశాల్లో భారత్ ఒకటని, మహమ్మారిని అడ్డుకునేందుకు సమగ్ర చర్యలు చేపట్టి, క్షేత్రస్థాయిలో వాటిని అమలుచేసిందని పేర్కొన్నారు. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు స్క్రీనింగ్ నిర్వహించడం, విదేశాల్లో చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి తరలించడం, కరోనా ప్రభావిత దేశాలకు విమాన సర్వీసులను నిలిపివేయడం, దేశంలో వైద్య వసతులను వేగవంతంగా పెంచడం వంటి చర్యలు చేపట్టినట్లు వివరించారు. అలాగే కరోనాపై సార్క్, జీ20 సమావేశాలను నిర్వహించడంలో భారత్ కీలక పాత్ర పోషించిందని చెప్పారు.

**సమిష్టి శక్తిని చాటారు..**

లాక్‌డౌన్ సందర్భంగా దేశ ప్రజలు చూపించిన పరిణతి అసాధారణమని ప్రధాని మోదీ కొనియాడారు. భారత్ వంటి విశాల దేశంలో ఇంతటి క్రమశిక్షణ, సేవా తత్పరత ఎవరూ ఊహించలేనిదన్నారు. ఆదివారం రాత్రి అన్ని వర్గాల ప్రజలు దేశ సమిష్టి శక్తిని చాటిచెప్పారని, ఇది తమ సంకల్పాన్ని మరింత బలోపేతం చేసిందని చెప్పారు. ప్రధాని పిలుపు మేరకు దేశ ప్రజలందరూ ఆదివారం రాత్రి 9 గంటలకు 9 నిమిషాలపాటు లైట్లన్నీ బంద్‌చేసి దీపాలు, కొవ్వొత్తులను వెలిగించిన సంగతి తెలిసిందే.

**పేదలెవరూ ఆకలితో ఉండకూడదు..**

బీజేపీ కార్యకర్తలకు ఈ సందర్భంగా ప్రధాని మోదీ పలు సూచనలు చేశారు. దేశంలో పేదలెవరూ ఆకలితో అలమటించకుండా చూడాలని కోరారు. కరోనాపై సమాచారం, సూచనలు అందించే ఆరోగ్య సేతు యాప్‌ను ప్రజలందరూ డౌన్‌లోడ్ చేసుకునేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు. ఫేస్ మాస్కులను పంపిణీచేయాలని, అత్యవసర సిబ్బందికి ధన్యవాదాలు తెలుపుతూ సంతకాలు సేకరించాలని సూచించారు. కరోనాపై పోరాటం యుద్ధానికి ఏమాత్రం తక్కువ కాదని, పార్టీ కార్యకర్తలు పీఎం కేర్స్‌కు విరాళాలు అందించాలని కోరారు. అలాగే ప్రభుత్వ చర్యలకు సాయం అందించేవిధంగా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు.

## పది అంశాలను గుర్తించండి

### మంత్రులకు మోదీ సూచన

కరోనా కారణంగా కుంటుపడిన ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు యుద్ధప్రాతిపదికన కార్యచరణను సిద్ధం చేయాలని కేంద్ర మంత్రులకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. మేకిన్ ఇండియా కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ప్రస్తుత పరిస్థితులు మంచి అవకాశమని, విదేశీ ఉత్పత్తులపై ఆధారపడటాన్ని తగ్గించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం జరిగిన కేబినెట్ భేటీ సందర్భంగా మంత్రులకు మోదీ కొన్ని సూచనలు చేశారు. లాక్‌డౌన్ ముగిసాక తీసుకోవాల్సిన పది ప్రధాన నిర్ణయాలు, దృష్టిసారించాల్సిన పది అంశాల జాబితాని తయారు చేయాలన్నారు. మంత్రిత్వ శాఖల్లో సంస్కరించాల్సిన అంశాల్ని గుర్తించాలన్నారు. దేశీయ తయారీ పరిశ్రమను అభివృద్ధి పర్చడం, ఎగుమతులను పెంచడానికి ఆచరించదగిన సలహాల్ని ఇవ్వాల్సిందిగా కోరారు. కొవిడ్–19 వల్ల ప్రభావితమైన వ్యవసాయరంగాని ఆదుకునేందుకు సాంకేతికతను వినియోగించాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్) ద్వారా అందే ఆహార ధాన్యాలు ప్రజలకు అందేలా గట్టి పర్యవేక్షణను కొనసాగించాలని మంత్రులను కోరారు.



## దీపాలు వెలిగించమంటే.. గాలిలోకి కాల్పులు

**లక్నో:** ప్రధాని మోదీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా ప్రజలు ఆదివారం రాత్రి 9 గంటలకు లైట్లను ఆర్పేసి దీపాలు వెలిగించారు. అయితే, యూపీకి చెందిన బీజేపీ మహిళా మోర్చా నేత మంజు తివారి మాత్రం గాల్లోకి కాల్పులు జరిపారు. ఆమె భర్త ఈ వీడియోను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. దీనిపై వివాదం రేగడంతో తివారీ క్షమాపణలు చెప్పారు. ఆమెపై పోలీసులు కేసు నమోదుచేశారు.

## తప్పించుకునే యత్నంలో కరోనా అనుమానితుడి మృతి

**కర్నాల్:** పానిపట్‌కు చెందిన కరోనా అనుమానితుడు (55) ఐసోలేషన్ వార్డునుంచి తప్పించుకునేయత్నంలో ఆరో అంతస్తు నుంచి జారి పడి మరణించారు. అనారోగ్య సమస్యలతో అతడు ఈ నెల 1న కర్నాల్‌లోని దవాఖానలో చేరాడు. వైద్యులు కరోనా పరీక్షలు నిర్వహించి ఐసొలేషన్ వార్డులో ఉంచారు. ఫలితం రావాల్సి ఉన్నది.




### మే 9 నుంచి

# తగ్గుముఖం?!

## కేంద్రప్రభుత్వ డాటా లేబోరేటరీ అంచనా

## వచ్చే వారం అత్యంత కీలకం.. ఈ నెల 16నాటికి వ్యాప్తిపై స్పష్టత

**న్యూఢిల్లీ:** దేశంలో కరోనా ఉద్ధృతి వచ్చే నెల తొమ్మిది నుంచి తగ్గుముఖం పట్టే అవకాశమున్నట్టు తెలుస్తున్నది. ఢిల్లీలో ఇటీవల జరిగిన తబ్లిగీ జమాత్ వల్ల కరోనా కేసుల్లో గణనీయమైన పెరుగుదల నమోదైందని, దీంతో ప్రస్తుతం దేశంలో కరోనా.. వృద్ధి దశ (యాక్జలరేషన్ ఫేజ్)లోకి ప్రవేశించిందని ప్రభుత్వ సమాచారం ద్వారా తెలుస్తున్నది. ఇదే విషయాన్ని ఉన్నతస్థాయి సమావేశాల్లో అధికారులు కూడా చర్చించారు. అయితే, కరోనాను నియంత్రించడంలో రానున్న వారం ఎంతో కీలకమైనదని, ఏప్రిల్ 16నాటికి కరోనా కేసుల నమోదులో భారత్ స్థిరమైన దశ (స్టెడీ ఫేజ్)కు చేరుతుందా? లేక మరింతగా దిగజారుతుందా? తెలియాల్సి ఉన్నదని కేంద్రప్రభుత్వానికి సంబంధించిన 'డాటా లేబోరేటరీ' పేర్కొంది. తగినంత వైద్య సామగ్రి, కరోనా కేసుల నమోదును ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ చర్యలు తీసుకుంటే మే 9 నుంచి దేశంలో కరోనా ముగింపు దశ మొదలవుతుందని అభిప్రాయపడింది. ఈ అంచనాల్ని కరోనా అనుమానితులు–వైరస్ సోకిన వారు–వ్యాధి నుంచి కోలుకున్న వారి (ఎస్ఐఆర్) నమూనా ప్రకారం రూపొంచారు. తబ్లిగీ జమాత్ ఘటనను ఈ నమూనాలో కలుపలేదు. చైనా వంటి వైరస్ బాధిత దేశాలతో పాటు దేశీయ సమాచారాన్ని ఉపయోగించి ఈ అంచనాల్ని రూపొందించారు.

## లక్ష 'శవ సంచులు' కావాలి

తయారీ కోసం సైన్యానికి అమెరికా ఆదేశం

10వేలు దాటిన మరణాల సంఖ్య



*సోమవారం న్యూయార్క్‌లోని వైకాఫ్ దవాఖాన వద్ద తాత్కాలిక మార్చురీగా ఏర్పాటుచేసిన రిఫ్రిజరేషన్ ట్రక్ వద్దకు కరోనా మృతులను తరలిస్తున్న వైద్య సిబ్బంది. మృతదేహాలను భద్రపరిచేందుకు లక్ష సంచులను తయారుచేయాలని అమెరికా విపత్తు విభాగం ఇప్పటికే సైన్యాన్ని కోరింది. సోమవారంతో అమెరికాలో మొత్తం మరణాల సంఖ్య 10,490కి, కేసుల సంఖ్య 3.56 లక్షలకు చేరింది.*

## భారత్‌కు అమెరికా రూ.22.03 కోట్ల సాయం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్‌పై భారత్ సాగిస్తున్న పోరాటానికి అమెరికా ప్రభుత్వం అండగా నిలిచింది. యూఎస్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (యూఎస్ఏఐడీ) ద్వారా భారత్‌కు 2.9 మిలియన్ డాలర్ల (రూ.22.03 కోట్లు) సాయాన్ని ప్రకటించింది. గత 20 ఏండ్లలో భారత్‌కు తాము అందజేసిన ఆరోగ్య సాయంతో పోల్చితే ఇదే అత్యధికమని, దీంతో తమ మొత్తం సాయం 3 బిలియన్ డాలర్లకు చేరిందని అమెరికా సోమవారం వెల్లడించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) మార్గదర్శకాల మేరకు కొవిడ్–19 తీవ్రతను తగ్గించి సమాజాన్ని కాపాడేందుకు ఈ నిధులను వినియోగించనున్నారు.

## ముగ్గురు వైద్యులు, 26 మంది నర్సులకు పాజిటివ్

**ముంబై:** మహారాష్ట్ర రాజధాని ముంబైలోని వాక్‌హార్డ్ దవాఖానలో ముగ్గురు వైద్యులు, 26 మంది నర్సులకు వైరస్ సోకింది. దీంతో ఆ దవాఖానను నిర్బంధ ప్రాంతంగా ప్రకటించిన బృహన్ ముంబై కార్పొరేషన్ (బీఎంసీ) అధికారులు లోపలున్నవారు బయటకెళ్లకుండా కట్టడి చేశారు. అందరికీ రెండుసార్లు పరీక్షలు జరిపి నెగెటివ్‌గా తేలితేనే ఇండ్లకు పంపుతామన్నారు. 70 ఏండ్ల హృద్రోగికి మార్చి 27న పాజిటివ్‌గా నిర్ధారణకాగా, వైద్య సేవలందించిన ఇద్దరు నర్సులకు వైరస్ వ్యాప్తించి వారి ద్వారా ఇతర వైద్య సిబ్బందికి సోకినట్లు తెలుస్తున్నది. కాగా, దవాఖానలో ఎలాంటి జాగ్రత్త చర్యలు చేపట్టని యాజమాన్యం నిర్లక్ష్యంపై నర్సుల సంఘాలు మండిపడ్డాయి.

## దేశవ్యాప్తంగా జూలల్లో హైఅలర్ట్

- అమెరికాలో పులికి కరోనా నేపథ్యంలో చర్యలు
- హైదరాబాద్, వరంగల్ జూలలో అప్రమత్తం



**న్యూఢిల్లీ:** అమెరికా జూలో ఓ పులికి కరోనా సోకిన నేపథ్యంలో మనదేశంలో అన్ని జూలల్లో హై అలర్ట్ ప్రకటిస్తున్నట్టు సెంట్రల్ జూ అథారిటీ(సీజడ్ఏ) సోమవారం పేర్కొంది. ఈమేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లేఖలు రాసినట్టు సీజడ్ఏ కార్యదర్శి ఎస్పీ యాదవ్ తెలిపారు. అధికారులందరూ జూలలోని జంతువులను సీసీటీవీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షించాలని, ఏమైనా జంతువులు అసాధారణ లక్షణాలతో విచిత్రంగా ప్రవర్తిస్తే సమాచారమివ్వాలన్నారు. కరోనా పరీక్షల కోసం అలాంటి జంతువుల నమూనాల్ని పక్షానికొకసారి ఉన్నతాధికారులకు పంపాలని చెప్పారు. క్యాట్, ప్రైమేట్ జాతులకు చెందిన పెద్దపులులు, పిల్లులు, కోతులు, కొండెంగలపై ప్రధానంగా దృష్టి సారించాలని అధికారులు తెలిపారు. సంరక్షణ విధుల్లో ఉన్న సిబ్బందిలో ఎవరైనా జలుబు, జ్వరంతో బాధపడుతుంటే వారిని దూరంగా ఉంచడం లేదా విధులకు హాజరుకాకుండా చూడాలని సూచించారు. అన్ని జాతీయ పార్కులు, శాంక్చరీల్లోకి జనాల్ని అనుమతించొద్దని ఆదేశించారు.

## ఐక్యతా విగ్రహాన్ని అమ్ముతాం..



**రాజ్‌పిప్లా:** నర్మదా నది ఒడ్డున ఉన్న స్టాచ్యూ ఆఫ్ యూనిటీ (ఐక్యత) విగ్రహాన్ని అమ్ముతామంటూ ఓఎల్ఎక్స్‌లో ప్రకటన ఇచ్చిన గుర్తు తెలియని వ్యక్తిపై గుజరాత్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కరోనా నేపథ్యంలో ప్రభుత్వ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.30,000 కోట్లకు సర్దార్ పటేల్ విగ్రహాన్ని అమ్మకానికి పెడుతున్నట్టు అతడు శనివారం ఒక ప్రకటన పోస్ట్ చేశాడు. పత్రికల ద్వారా విషయం తెలుసుకొన్న అధికారులు కేవడీయ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదుచేశారు.

రోబో పోలీస్



*పశ్చిమాఫ్రికా దేశమైన ట్యునీషియాలో లాక్‌డౌన్ విధులు నిర్వర్తించేందుకు రోబోలను పోలీసులు రంగంలోకి దించారు. నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే కంట్రోల్ రూమ్‌కు ఇవి సమాచారమిస్తాయి.*

## మాస్కులపై వారంపాటు వైరస్!

**బీజింగ్:** సర్జికల్ మాస్కుల పట్ల జాగ్రత్త వహించాలని యూనివర్సిటీ ఆఫ్ హాంకాంగ్ (హెచ్‌కేయూ) పరిశోధకులు సూచిస్తున్నారు. కరోనా వైరస్ వీటిపై వారం రోజులకుపైగా ఉంటున్నదని పేర్కొన్నారు. గది ఉష్ణోగ్రత వద్ద వివిధ ఉపరితలాలపై 3 గంటల నుంచి వారంపాటు ఉంటున్నట్లు పరిశోధకులు గుర్తించారు. కాగితం, టిష్యూపేపర్‌పై 3 గంటల్లోనే వైరస్ మాయమవుతుండగా, దుస్తులు, చెక్క వస్తువులపై రెండ్రోజులు, గాజు, కరెన్సీ నోట్లపై 2–4 రోజులు, స్టెయిన్‌లెస్ స్టీల్, ప్లాస్టిక్‌పై 4 –7 రోజులపాటు వైరస్ ఉంటున్నట్లు చెప్పారు.

**చరిత్రలో నేడు - 1795**
మీటర్‌ను దూరానికి కొలమానంగా స్వీకరించిన ఫ్రాన్స్.

# వేదిక



యురోపియన్ స్ఫూర్తి పదేండ్ల కిందటితో పోలిస్తే, చాలా బలహీనంగా ఉన్నది. గత సంక్షోభాలతో పోలిస్తే, ఈ సంక్షోభం భిన్నమైనది. ఇటలీ ఫస్ట్, బెల్జియం ఫస్ట్, జర్మనీ ఫస్ట్ అనుకుంటూపోతే అందరం కలిసికట్టుగా మునిగిపోతాం.

– ఎన్‌రికో లెటా, ఇటలీ మాజీ ప్రధాని

**నమస్తే తెలంగాణ**

## లాక్‌డౌనే రక్ష!

**ప్రపంచవ్యాప్తంగా** కరోనా వైరస్ వికటాట్టహాసం చేస్తున్న కాలంలో లాక్‌డౌన్ పాటిస్తూ మన ప్రాణాలను కాపాడుకుంటున్న తరుణమిది. లాక్‌డౌన్ ప్రకటించిన నాటినుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అనేకవిధాలుగా అండగా నిలుస్తూనే, మరోవైపు కరోనా వైరస్‌ను వేటాడుతున్న తీరు గొప్పగా ఉంది. విదేశాల నుంచి వచ్చినవారిని పరీక్షించి, అవసరమైన వారికి చికిత్స చేయడం వల్ల అంతా బతికి బయటపడ్డారు. ఈ లోగా ఢిల్లీ నుంచి వచ్చిన కొందరికి కరోనా వైరస్ వ్యాపించినట్టు తెలియడంతో వారికి చికిత్స అందిస్తుండటమే కాకుండా, వారి నుంచి మరెవరికైనా వ్యాపించిందా అనేది తెలుసుకోవడానికి విస్తృత గాలింపు సాగిస్తున్నది. కరోనా రోగి సంచరించిన ప్రాంతాల్లో ఈ వ్యాధి అంటుకున్న వారిని గుర్తించి పట్టుకోవడమంటే గడ్డిమోపులో సూదిని వెదికినట్టు! అయినా ఏ ఒక్కరినీ వదలకూడదనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం సర్వశక్తులూ ఒడ్డుతున్నది.

కరోనా బారిన పడిన దేశాల దైన్యాన్ని గమనించినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సాగిస్తున్న కృషి ఎంతటిదో అర్థమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా పన్నెండు లక్షల మందికి పైగా కరోనా బారిన పడ్డారు. దాదాపు డెబ్బయి వేల మంది ప్రాణాలు కోల్పోయారు. వాస్తవానికి ఈ మరణాలు చాలా ఎక్కువగానే ఉన్నాయనీ, ప్రభుత్వాలు తగ్గించి చూపుతున్నాయని ఆరోగ్యరంగ నిపుణులు అంటున్నారు. అమెరికా ప్రభుత్వం మృతదేహాలను కట్టిపెట్టడానికి వీలుగా లక్ష సంచులు సిద్ధపరచాలని సైన్యాన్ని కోరిందని విన్నప్పుడు ఎంత కఠినుడికైనా హృదయం ద్రవించిపోతుంది. పరిస్థితి అదుపులోకి రాకపోతే సుమారు రెండున్నర లక్షల మంది అసువులు బాస్తారని అమెరికా ప్రభుత్వమే అంటున్నది. ఒక్క న్యూయార్క్‌లోనే రోజుకు వందలాది మందిని మహమ్మారి కరోనా వైరస్ బలిగొంటున్నది. ఇటలీలో దాదాపు పదహారు వేల మంది మరణించారు. మరణాల రేటు తగ్గిన తరువాత కూడా ఒక్క రోజే 525 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతులకు బంధువులు అంతి మ సంస్కారం కూడా జరుపలేని దౌర్భాగ్య పరిస్థితులు అమెరికా, ఇటలీ, స్పెయిన్ తదితర దేశాలలో నెలకొన్నాయి. 130 కోట్లకు పైగా జనాభా ఉన్న విశాలమైన మన భారతదేశంలో కరోనా వ్యాప్తిని కట్టడి చేయడం ఎంత అవసరమో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు?

వైరస్ సామాజిక వ్యాప్తి దశకు చేరకముందే లాక్‌డౌన్ ప్రకటించడం మంచిదైంది. దీనివల్లనే మన దేశం భద్రంగా ఉండగలుగుతున్నది. లాక్‌డౌన్ ద్వారా మనం వైరస్ వ్యాప్తిని అడ్డుకుంటున్న తీరును ప్రపంచస్థాయి ప్రముఖులు ప్రశంసిస్తున్నారు. మన దేశ పరిస్థితులకు లాక్‌డౌన్ ఒక్కటే 'వ్యాక్సిన్' లాంటిదని మొదటే గ్రహించిన నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్. కేంద్ర ప్రభుత్వం ప్రకటించడానికి ముందే మన రాష్ట్రంలో లాక్‌డౌన్‌ను అమలుపరిచారు. దేశానికి ఇక్కడి లాక్‌డౌన్ ఒక నమూనాగా పనిచేసింది. లాక్‌డౌన్ వల్ల ఆర్థికంగా దెబ్బతింటే ఏదోవిధంగా కోలుకోవచ్చు. కానీ ప్రాణాలు పోతే మళ్ళీ తేలేమన్న ముఖ్యమంత్రి కేసీఆర్ మాట అక్షరసత్యం. అందువల్లే మరికొంత కాలం దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ కొనసాగించడమే మేలని ముఖ్యమంత్రి కేసీఆర్ భావిస్తున్నారు. ముఖ్యమంత్రి చేసిన విజ్ఞప్తి మేరకు తెలంగాణ ప్రజలు ఎంతో క్రమశిక్షణతో గ్రామగ్రామాన స్వీయ ఏకాంతాన్ని పాటిస్తున్నారు. భవిష్యత్తులో కూడా ఇదే దృఢ దీక్షను కొనసాగిస్తే మనల్ని మనం కాపాడుకున్నవారమవుతాం.

# ఈ సంక్షోభం.. సంస్కరణలకు నాంది

**ఆర్థికం**



**రఘురాం రాజన్**

ఆర్థిక కోణంలో చూస్తే మన దేశం స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి కనీవిని ఎరుగని ఎమర్జెన్సీని ఎదుర్కొంటున్నది. 2008-09లో వచ్చిన ప్రపంచ ఆర్థిక సంక్షోభం గట్టి షాక్‌ను ఇచ్చింది. అయినా మన దేశం తట్టుకొని నిలబడగలిగింది. మన కార్మికులు ఉపాధి కోల్పోలేదు. మన కర్మాగారాలు వృద్ధి చెందాయి. ఆర్థికవ్యవస్థ బలంగా ఉంది. ప్రభుత్వాల ఆర్థిక సత్తువ దెబ్బతినలేదు. కానీ, కరోనా వైరస్‌ను ఎదుర్కొంటున్న ఇప్పటి పరిస్థితి వేరు. అయినప్పటికీ నిస్పృహ చెందవల్సిందేమీ లేదు. ఉత్తమ సంకల్పం, తగిన ప్రాధాన్యాలు కలిగి ఉండి, మన శక్తులన్నీ కూడగట్టుకోగలిగితే కరోనా వైరస్‌ను తిప్పి కొట్టడమే కాదు, మన భవిష్యత్‌ను కూడా ఆశాజనకంగా మార్చుకోగలం.



**విస్తృత** పరీక్షలు, కఠినమైన ఏకాంతవాసం, పరస్పర దూరం పాటించడం ద్వారా ఈ మహమ్మారిని అణిచివేయడం తక్షణ ప్రాధాన్యం. ఇందుకు 21 రోజుల లాక్‌డౌన్ మొదటి అడుగు. ఈ మూడువారాల కాలం భారత్ కరోనా వైరస్‌పై పోరుకు సిద్ధం కావడానికి ఉపయోగపడుతుంది. మన సాహసవంతులైన వైద్య సిబ్బందితో పాటు, ఇతరత్రా వనరులను కూడగట్టడానికి ప్రభుత్వానికి వ్యవధి లభిస్తుంది. పబ్లిక్, ప్రైవేట్ రక్షణరంగాల నుంచే కాకుండా పదవీ విరమణ పొందినవారిని కూడా సమాయత్తపరుచవచ్చు. ఇదంతా ఎంతో వేగంగా సాగించవలసి ఉన్నది. మహమ్మారి వ్యాపించిన ప్రాంతాలను స్పష్టంగా గుర్తించగలగాలి. ఎక్కడ వైరస్ వ్యాపిస్తే, అక్కడికి వైద్య బృందాలను వేగంగా తరలించగలగాలి. వైరస్‌ను ఓడించలేకపోతే లాక్‌డౌన్ తర్వాతి పరిస్థితి ఎలా ఉంటుందనే దానిని బట్టి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. లాక్‌డౌన్‌ను ఎంతోకాలం పొడిగించుకుంటూ పోలేము. కరోనా వైరస్ ఉనికి పెద్దగా లేని ప్రాంతాలలో అతి జాగ్రత్తలతో కొన్ని కార్యకలాపాలను పునః ప్రారంభించవచ్చు. ఇందుకు వ్యాధి వ్యాప్తికి సంబంధించి తగినంత ముందస్తు సమాచారం కూడా ఉండాలి. కార్మికులను పరీక్షిస్తుండటం, రవాణా కిక్కిరిసి ఉండకుండా చూడటం, వ్యక్తిగత రక్షణ పరికరాలు ఇవ్వడం, పనిచేసే చోట పరస్పర దూరం పాటించడం మొదలైన అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. మరోవైపు వ్యాధిని గుర్తించి చికిత్స చేయడం సాగుతుండాలి. హాస్టళ్లలో పరస్పర దూరం పాటించే యువ కార్మికులతో కార్యకలాపాలను ప్రారంభించాలి. కొన్ని యాజమాన్యాలే కార్మికులకు తగిన భద్రతను ఇవ్వగలవు. వస్తువుల సరఫరాకు ఆటంకం కలుగకుండా ఉత్పత్తి రంగం క్రియాశీలకంగా ఉండటం అవసరం. అందువల్ల ఆయా యాజమాన్యాలకు జాగ్రత్తలను సూచించాలి. కార్మికులు విధులకు పోయివచ్చేవిధంగా ప్రభుత్వ యంత్రాంగం సహకరించాలి. నిశ్చిత వేతనాలు లేని పేద, దిగువ మధ్యతరగతి ప్రజలు సుదీర్ఘకాలం పనులకు పోకుండా ఉండవలసి వస్తుంది. వీరి పోషణ విషయం ప్రభుత్వం చూసుకోవలసి ఉంటుంది. వీరికి నేరుగా డబ్బులివ్వడం (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్- డీబీటీ) మంచిదే. కానీ ఇది అందరికీ చేరదు. ప్రభుత్వం ఇచ్చే సొమ్ము నెల గడవడానికి సరిపోదు. పేదలను ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో వ్యవహరించాలి.

ఆహారం, ఆరోగ్యం, ఆశ్రయం కల్పించడానికి స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలి. రుణాలు వసూలు చేయకుండా, పేదలను ఇంటి నుంచి వెళ్ళగొట్టకుండా కొన్ని నెలల పాటు సామాజికంగా కట్టడి చేయగలగాలి. డీబీటీని కొన్నినెలల పాటు అందించాలి. ఇటువంటి చర్య తీసుకోకపోవడం వల్లే కార్మికుల వలస సాగింది. తమ మనుగడకే కష్టమైతే కార్మికులు లాక్‌డౌన్‌ను ధిక్కరించి పనులకు వెళ్తుంటారు.

ప్రభుత్వానికి ఆర్థిక వనరులు తక్కువగా ఉండటం ఆందోళనకర విషయమే. అయినప్పటికీ మనది మానవీయ దేశం కావడం వల్ల, వైరస్‌ను కట్టడి చేయడం తప్పనిసరి కనుక ఈ దశలో వనరులను ఉపయోగించుకోక తప్పదు. బడ్జెట్ పరమైన ఇబ్బందులను పట్టించుకోవద్దని కాదు. పైగా ఈ సంవత్సరం ఆదాయం బాగా తగ్గిపోతుందనుకునే విషయం తెలిసిందే. అమెరికా, యూరప్ దేశాలు తమ జీడీపీలో పది శాతాన్ని నిర్భయంగా వెచ్చించగలవు. కానీ, మన పరిస్థితి వేరు. ఇప్పటికే భారీ ఆర్థిక లోటులో ఉన్నాం. రేటింగ్స్ తగ్గి ఇన్వెస్టర్ల విశ్వాసం కూడా కోల్పోతే ఎక్స్చేంజ్ తగ్గిపోతుంది. లాంగ్ టర్మ్ రేట్లు తగ్గిపోతాయి. ఆర్థిక సంస్థలకు భారీ నష్టం వాటిల్లుతుంది. ఈ పరిస్థితుల్లో కొన్ని ఖర్చులను వాయిదా వేసుకొని, మరికొన్నింటిని తగ్గించుకొని, తక్షణావసరాలపై దృష్టిసారించాలి. ఇదే సమయంలో ఇన్వెస్టర్లకు విశ్వాసం కల్పించాలి. ఆర్థిక విచక్షణ చూపిస్తామనే నమ్మకం కలిగించాలి. ఎన్.కె.సింగ్ కమిటీ సూచించినట్లు మీడియం టర్మ్ రుణ లక్ష్యం నెలకొల్పుకోవడానికి, స్వతంత్ర ఆర్థిక మండలి ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేయాలి.

కొన్నేండ్లుగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు బలహీనపడ్డాయి. ఇప్పుడు వాటికి నిలదొక్కుకునేంత వనరులు లేవు. అలాగని మనకున్న కొద్దిపాటి వనరులతో అన్ని సంస్థలనూ ఆదుకోలేము. ఇంటి నుంచి పనిచేసే కొన్ని చిన్న సంస్థలను డీబీటీ ద్వారా ఆదుకోవాలి. ఇక కొన్ని పెద్ద సంస్థల విషయానికి వస్తే, వీటికి చెప్పుకోదగిన మానవ, భౌతిక వనరులు అవసరమవుతాయి. వీటికి ప్రభుత్వం తోడ్పాటునందించాలి. బ్యాంకు రుణాలకు సంబంధించి సిడ్బీ చేత రుణ హామీ ఇప్పించాలి. అయినా ఇప్పటి పరిస్థితుల్లో బ్యాంకులు రిస్క్ తీసుకోవడానికి సిద్ధంగా ఉండవు. అందువల్ల ఈ సంస్థలు గత ఏడాదిలో చెల్లించిన పన్నును బట్టి ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి. ఈ సంస్థలకు ఇప్పుడు నిధులు సులభంగా అందించగలిగితే భవిష్యత్తులో పన్నులు చెల్లించగలుగుతాయి. అయితే బ్యాంకులు ఈ రుణాలను పాత బాకీల కింద జమచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద సంస్థల చేత చిన్న సరఫరా దారులకు నిధులు అందింపజేయవచ్చు. అవి బాండ్ మార్కెట్ నుంచి నిధులు పోగు చేసుకొని బదిలీ చేయవచ్చు. దురదృష్టవశాత్తూ కార్పొరేట్ బాండ్ మార్కెట్లు నేటి అవసరాలకు అనుగుణంగా స్పందించడం లేదు. బ్యాంకులు, బీమా సంస్థలు, బాండ్ మ్యూచువల్ ఫండ్స్‌ను ఇందుకు ప్రోత్సహించాలి. ఇందుకు ఆర్‌బీఐ చట్ట సవరణ ద్వారా సహకరించాలి. ప్రైవేటు సంస్థలకు తమ బిల్లులను వెంటనే చెల్లించే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

> కొన్నేండ్లుగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు బలహీనపడ్డాయి. ఇప్పుడు వాటికి నిలదొక్కుకునేంత వనరులులేవు. అలాగని మనకున్న కొద్దిపాటి వనరులతో అన్ని సంస్థలనూ ఆదుకోలేము. కొన్ని ఇంటి నుంచి పనిచేసే చిన్న సంస్థలను డీబీటీ ద్వారా ఆదుకోవాలి. ఇక కొన్ని పెద్ద సంస్థల విషయానికి వస్తే, వీటికి చెప్పుకోదగిన మానవ, భౌతిక వనరులు అవసరమవుతాయి. వీటికి ప్రభుత్వం తోడ్పాటునందించాలి.

చివరగా- గృహ, కార్పొరేట్ రంగాలలో ఉండే ఆర్థిక ఇబ్బందులు తప్పనిసరిగా ఆర్థికరంగంపై ప్రభావం చూపుతాయి. బ్యాంకులకు నిధుల కొరత లేకుండా ఆర్బీఐ చర్యలు తీసుకున్నది. అయితే మరింత ముందడుగు వేసి ఉత్తమ నిర్వహణలో ఉన్న ఎన్.బి.ఎఫ్.సి.లకు రుణ సదుపాయం కల్పించే ఏర్పాట్లు చేయాలి. అయితే రుణాల వల్ల ఇబ్బందిని మరింత లిక్విడిటీ అధిగమించలేదు. ఆర్థిక సంస్థలు డివిడెండ్ చెల్లించకుండా ఆర్‌బీఐ మారటోరియం విధించాలె. దీనివల్ల క్యాపిటల్ రిజర్వ్స్ పెరుగుతాయి. కొన్ని సంస్థలకు మరింత క్యాపిటల్ అవసరం పడుతుంది. దానికి అనుగుణంగా ఆర్‌బీఐ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.

దేశంలో విస్తారంగా ఉన్న ఆర్థిక నిపుణుల శక్తిసామర్థ్యాలను ప్రభుత్వం వినియోగించుకోవాలె. గతంలో ప్రపంచ ఆర్థిక సంక్షోభం వచ్చినప్పుడు ఎదుర్కొనే అనుభవం కలిగినవారు ప్రతిపక్షంలో ఉన్నా సరే వారి సహకారం తీసుకోవాలె. పీఎంవో నుంచి ఇప్పటికే అలసిపోయి ఉన్న అదే సిబ్బందితో నడిపిస్తామనుకుంటే ఫలితం ఉండదు. ఉష్ణప్రాంతమైన భారత్‌లో వైరస్ వ్యాప్తి కట్టడి జరిగితే భవిష్యత్‌పై ఆశలు పెట్టుకోవచ్చు. కరోనా వైరస్ దాడి చేయడానికి ముందే ఆర్థిక పరిస్థితి బలహీన పడ్డది. సామాజిక, ఆర్థిక పరిస్థితి క్షీణించింది. మళ్లీ ఆ పరిస్థితి రావాలని ఎవరికీ లేదు. సంక్షోభంలోనే భారత్ సంస్కరింపబడుతదని అంటారు. ఈ సంక్షోభం మూలంగా మనం ఒక సమాజంగా ఎంత బలహీనంగా మారామో తెలిసివస్తుందని, ఇక మన రాజకీయాలను ఆర్థిక, ఆరోగ్య పరిరక్షణ రంగాలను పటిష్టం చేయడంపై దృష్టి సారిస్తామని ఆశిద్దాం.

**(వ్యాసకర్త: ఆర్‌బీఐ మాజీ గవర్నర్, షికాగో విశ్వవిద్యాలయంలో ఫైనాన్స్ ప్రొఫెసర్)**

**'ది టైమ్స్ ఆఫ్ ఇండియా' సౌజన్యంతో..**

# తల్లికోడి పిల్లల్ని కాపాడుకున్నట్టు!

> కరోనా యుద్ధ సమయంలో ఒక కథ యాదికొచ్చింది. రాజస్థాన్‌లోని రతన్‌పూర్ కోట. చాలా పెద్దది. కోటలో ఉన్న సైన్యం మాత్రం తక్కువే. ఓ రాత్రి పూట కోట పైకి హఠాత్తుగా శత్రువులు దాడి చేశారు. రాజు సైన్యాన్ని సిద్ధం చేసి యుద్ధానికి దిగాడు. రాజు వెంట సైన్యాధ్యక్షుడున్నాడు. యుద్ధం మొదలైంది. సైన్యం ఏదని రాజు అడిగారు. మనకంటే ముందే వెళ్లి యుద్ధం చేస్తున్నారని సైన్యం పోరాటం గురించి గొప్పగా చెప్పాడు సైన్యాధ్యక్షుడు. రాజుకు ధైర్యం వచ్చింది. యుద్ధరంగంలో వీరవిహారం చేశాడు. తెల్లవారింది. శత్రుసైన్యం పారిపోయింది.

**తెలంగాణం**



**పెద్దింటి అశోక్‌కుమార్**



**రాజు** విజయగర్వంతో తిరిగివచ్చి మన సైన్యం ఎక్కడున్నారని అడిగాడు. వారు రాత్రికి రాత్రే యుద్ధం మొదలు కాకముందే భయంతో పారిపోయారని నిన్న అదే విషయం చెబితే ఈ రోజు ఈ విజయం వచ్చేదికాదని సైన్యాధ్యక్షుడు చెప్పాడు. ఎప్పుడో విన్న కథ ఇది. ఈ కరోనా సమయంలో గుర్తుకు వచ్చింది. కథ చిన్నదే కావచ్చు, కానీ ఇది చెప్పిన పాఠం ఎంతో పెద్దది. దీన్ని మనం ఇప్పటికి అన్వయించుకుంటే ఇందులో కోట మీద దాడిచేసిన శత్రువు కరోనా అయితే పోరాడే రాజు తెలంగాణ జనం. కష్టకాలంలో వాళ్లకు ధైర్యం నింపి సమయస్ఫూర్తితో ముందుకు నడిపిన సర్వ సైన్యాధ్యక్షుడు కేసీఆర్.

రెండు నెలల కింద అనుకుంటాను ఒక వీడియో చూశాను. అందులో ఒక విలేకరి ఒక రైతును కరోనా వస్తే ఏం చేస్తావని అడుగుతున్నాడు. ఆ రైతు ఎంతో భరోసాగా మా కేసీఆర్ దాన్ని రానియ్యడు అంటున్నాడు. అది ఆగది వైరస్ కదా అని విలేకరి అంటే రైతు భయపడకుండా కేసీఆర్ ఏదో ఒకటి చేస్తడు. ఏదో అడ్డం పెట్టి రాకుండా చేస్తడు అని ధీమాగా చెబుతున్నాడు. ఆ వీడియో చూస్తుంటే నవ్వుకుంటాం గానీ అమాయకమైన రైతు ముఖంలోని నమ్మకాన్ని అంతకు మించి ఒక భరోసా చూసినంక ఒక నాయకునిపై జనానికి ఉన్న నమ్మకాన్ని చూసి ఆశ్చర్యపోతాం. అలా జనం నమ్మకాన్ని పొందడానికి ఏ నాయకునికైనా ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధి, ప్రజల పట్ల అపారమైన ప్రేమ ఉంటే కానీ సాధ్యం కాదు. ఇది ఒక్క రైతు నమ్మకం కాదు. ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనాపై కేసీఆర్ వ్యూహం, చిత్తశుద్ధి అంతకుమించి ప్రజలను రక్షించుకోవాలనే ఒక ఆరాటం చూశాక యావత్ తెలంగాణ ప్రజలకు నమ్మకంగా మారింది. అంతకుముందు అవగాహన లేక భయంభయంగా ఉన్న జనానికి ఆయన మాటలు విన్నంక బతుకు మీద ఆశ పుట్టింది.

జనతా బంద్ రోజు నుంచి నేను ఇంట్లో కూచుండి ఒక పని చేస్తున్నాను. చాలామంది గ్రామస్థులతో ఫోన్లో మాట్లాడుతున్నాను. వారికి తోచిన సహాయం చేస్తూ ఏ వార్త నిజమో, ఏ వార్త అబద్ధమో చెబుతూ వాట్సప్ గ్రూప్‌లు రెండు పెట్టి సమాచారం ఇస్తూ ధైర్యం చెబుతున్నాను. వాళ్లంతా సిరిసిల్ల జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన మా బడి పిల్లల పేరెంట్స్. అందరూ రైతులు, కూలీలు, వలస కార్మికులే. అమాయకపు జనం ఫోన్ చేసిన ప్రతిసారి కూలీ దొరుకకపోవడం గురించి, రాబోయే వరి పంట గురించి, పడిపోయిన చికెన్ ధర గురించి, నిత్యావసర సరుకుల గురించి భయంభయంగా అడిగేవారు. చివరగా మనం బతుకుతమంటరా సార్ అనేవారు. నేను ఏదో ధైర్యం చెప్పేవాన్ని. పొద్దున, మాపున ఫోన్ చేసేవాడిని. ఎంత చెప్పినా వారిలో ఇసుమంత ధైర్యాన్ని కూడా నింపలేకపోయాను. కానీ ఒక్కసారిగా వారిలో మార్పు వచ్చింది. కేసీఆర్ మాటలు టీవీలో విన్నంక రైతులకు, కూలీలకు ఎంతో భరోసా వచ్చింది. ఇప్పుడు వారికి పంట మీద దిగులు లేదు. నిత్యావసర సరుకుల రంది లేదు. బతుకుదెరువు కోసం పోయిన బంధువుల గురించి రంది లేదు. అదీ ఒక నాయకుడు ప్రజలకు ఇవ్వాల్సిన ధైర్యం. ఇప్పుడు చేయాల్సింది, చేసేది ఒక్క యుద్ధమే కాదు. ప్రజలకు కొంత నమ్మకం కూడా ఇవ్వాలి. ఒక మాటలో చెప్పాలంటే చావు బతుకులు ఎవరి చేతుల్లో లేవు. ఎవరు, ఎలా, ఎప్పుడు చస్తారో తెలియదు. కానీ, చచ్చేవరకైనా పోరాట పటిమను, స్ఫూర్తిని నింపడం, ముందు నడువడం, వ్యూహాలు రచించడం నాయకుని లక్షణం. అదే పని కేసీఆర్ చేశారు. చేస్తున్నారు కూడా.

వలస కూలీల ఆకలి నుంచి వాట్సప్ గ్రూపుల అసత్య ప్రచారం దాక, రైతులు పండించే పంటల నుంచి, పోషకాహార వంటలదాక అందరినీ మోటివేట్ చేయడం, ఎడ్యుకేట్ చేయడం, స్ఫూర్తినివ్వడం ఆయనొక్కడికే సాధ్యం. అందుకే అనిపిస్తుంది తెల్లచొక్కా వేసుకున్న ప్రతొక్కరు నాయకులు కాదు. కుల్లంకుల్లా మాట్లాడి ప్రజలను కూడగొట్టినవారే నాయకులని. ఇంతటి కష్టకాలంలో ఒక్కమాటతో రైతుల పంట భయమే కాదు.. ప్రజల కరోనా భయాన్ని, వలస కూలీల ప్రాణ భయాన్ని కూడా పోగొట్టిన కేసీఆర్‌కు నిజంగా హాట్సాఫ్. ఇది కదా ఆపత్కాలంలో ఓ నాయకుడు చేయాల్సిన పని. అందుకే తను ఒక నాయకుడు మాత్రమే కాదు, మట్టిని, మొరాన్ని తవ్వి పిల్లలకు నాలుగు గింజలను ఏరిపోసి ఎక్కడినుంచి ఏ ఆపద వస్తుందో అని కావలి కాస్తూ పిల్లలను రెప్పల కింద దాచుకొని పిల్లుల నుంచి, గద్దల నుంచి కాపాడుకునే ఓ తల్లి కోడి.

## కరోనా పద్యాలు



**అంటకు ముట్టకు తాకకు**
సెంటర్లో నిలువ తగదు చేరకు గుంపున్
ఇంటికి రానీకు మెవరి
ఒంటికి శుభ్రత ఒకటియె ఒప్పు కుమారా

ఎల్లలు భాషలు మతములు
తెల్లటి జాతులు కులాలు దేశపు తేడాల్
చెల్లవు అంటెడి జబ్బుకు
ఎల్లర కొక్కటె కరోన ఎఱుగు కుమారా

చేతిలోన గ్లోవు చెవిపైకి ఒక మాస్కు
చెంత నెపుడు మంచి శానిటైజు
ఉండి నంత గాని ఊరిని పోబోకు
విశ్వదాభిరామ వినుర వేమ

రెండు చేతులెత్తి నిండైన దండంబు
నేర్పు కొలది పెట్టు నీటుగాను
షేకు హ్యాండు అనుచు చేతులన్ కలపకు
విశ్వదాభిరామ వినుర వేమ

ఎంత వారలైన ఎదురుపడిన గాని
దూరముండి నువ్వు దరిజేర బోవకు
వారి తుమ్ము దగ్గు వారుణాస్త్రము సుమ్ము
విశ్వదాభిరామా వినుర వేమ

మనిషి తప్పు చేసి మరణ క్రిమిని దెచ్చె
మీద దేవు డేమి మేలు జేయు
మందు చేయువాడె మహి మీద దేవుడు
విశ్వదాభిరామ వినుర వేమ

శివుడద్రిని వసియుంచుట
రవిచంద్రులు మింటనుంట రాజీవాక్షుం
డవతలి సంద్రముండుట
భువి కరోనకు భయమ్ము పొందుటె సుమ్మీ

తుమ్మే మానవ బాంబౌ
నమ్ముము దగ్గే తుపాకి నరహం తకియౌ
గుమ్మము దాటిన చూడిది
కమ్మే అపమృత్యుఛాయ కానుకరోనా.

ఇల్లు విడిచి రాకు ఏ గొప్ప పని ఉన్న
లోకమంత నేడు చీకటయ్యె
పరమ సూక్ష్మ అణువె బ్రహ్మ ప్రళయం బయ్యె
విశ్వదాభిరామ వినురవేమ

అణువు అణువులోన అమరి యున్న బ్రహ్మ
నీవు నేను లోన నిలుచు అణువు
విషమ స్థాన మంది విలయ తాండవమాడె
విశ్వదాభిరామ వినురవేమ

నిలబడిపోయెను దేశమె
నిలబడి పోయెను బతుకులు నిలబడె దినముల్
నిలబడె ఎండిన మెతుకులు
నిలబడదీ కడుపు నగ్ని నిలువు కరోనా

రెక్కాడిన గానీ తన
డొక్కాడని బక్కజీవి దుఃఖపు అరుపై
దిక్కులు భయపడ మోగెను
అక్కట కర్ఫ్యూ బజారు నరిగెడి సైరన్



**పులికొండ సుబ్బాచారి**
**94404 93604**

**నివాళి**



**కీ.శే.గండ్ర రాధమ్మ**

## ఆదర్శం రాధమ్మ జీవితం

**అనురాగం,** ఆప్యాయత, సమర్థత, సౌజన్యం అన్నీ ఒకటిగా రూపుదిద్దుకున్న ఆదర్శ గృహిణి కీ.శే.గండ్ర రాధమ్మ. జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని మానాల గ్రామం గండ్ర రాఘవేందర్‌రావు ఇల్లాలు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, ఉదార స్వభావులైన రాఘవేందర్‌రావుకు జీవితంలో శాంత స్వభావాన్ని, గుండెధైర్యాన్నిచ్చింది రాధమ్మ.

ఒక చిన్న మారుమూల గ్రామంలో ఉన్న సాధారణ గృహిణి తన కుటుంబాన్ని ఉద్ధరించడమే కాక ఎందరికోఎన్నో విధాలా చేయూతనందించిన గండ్ర రాధమ్మ మార్చి 27న పరమపదించడం అత్యంత విషాదం. 1935లో జన్మించిన ఆమె సుదీర్ఘ జీవితం ఎందరికో ఆదర్శంగా నిలిచింది. రాధమ్మ కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, అమ్మ వంటి ఆమెకు నా అశ్రు నివాళులు.

**- నరేందర్ (డాక్టర్ బి.ఎన్.రావు)**

# ఏది బ్రహ్మం?



**నమస్తే.. నమస్తే.. నమః**

**పాలకుర్తి రామమూర్తి**

**వరుణుడు** అనే మహర్షి కుమారుడు భృగువు. అత ను ఒకనాడు సూర్యోదయ కాలానికల్లా సంధ్యాదికాలు నిర్వహించేందుకు నదీతీరానికి చేరాడు. నీటిలో ప్రతిబింబిస్తున్న ఉషా కిరణాలు, తీరం వెంట మంచుతో కప్పబడిన పచ్చికబయళ్ళపై సూర్యకిరణ ప్రసారంతో వివిధ రంగులను ప్రతిఫలిస్తున్న దృశ్యం.. ఇలా అక్కడి ప్రాకృతిక సౌందర్యమంతా అతని మనసును పరవశింపజేసింది. ఆ సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్న భృగువు మనసులో చిన్న సందేహం పొడసూపింది. 'కండ్లకు కనిపించే ఈ దృశ్య సౌందర్యం శాశ్వతమా? గురువులు బోధిస్తున్న 'బ్రహ్మం' ఈ దృశ్యమాన సౌందర్యమా లేక దీనికి భిన్నమైందా?' ఆలోచించాడు. మనసులో ఎన్నె న్నో భావనలు. అవేవీ తన జిజ్ఞాసకు తగిన జవాబు ఇవ్వలేకపోయాయి. వెంటనే తండ్రి/గురువు వద్దకు వెళ్ళి, 'బ్రహ్మం అంటే ఏమిటి? దాని స్వరూప స్వభావాలు ఎలాంటివి? దయచేసి వివరించమని' వినయంగా ప్రశ్నించాడు.

తండ్రి సంతోషించాడు. తాను 'బ్రహ్మం' అంటే ఏమిటో చెప్పగలడు. కానీ, తాను చెప్పడం వల్ల అతనిలో తానుగా తెలుసుకోవాలనే జిజ్ఞాస తగ్గిపోతుంది. అతనిలో 'సహజబుద్ధి' వికసించాలి. వికసించిన లేదా తెరువబడిన మనసులో వివేకం పెరుగాలి. దేహం, ఆత్మ మెదలైన వాటిలోని భేదగతమైన జ్ఞానం అనుభవపూర్వకంగా అవగతం కావాలి. అభివృద్ధి ఎప్పుడూ తన కుతానుగా సాధించవలసిందే. అప్పుడు అసలు సామర్థ్యం తెలుసుకొని, బుద్ధి వికాసానికి కావలసి న దిశలో శిక్షణ ఇవ్వడం వల్ల వ్యక్తిలో పరిణతి పెరుగుతుంది. అది సాధికారికమైన, ఆత్మవిశ్వాసం తో కూడిన, అభ్యుదయ కారకమైన, శాశ్వతమైన విజయాన్ని అతనికి బహూకరిస్తుంది.

అలా ఒక్కొక్క విద్యార్థి దీక్షాదక్షతలను పరీక్షించి, ఎవరికి ఏ విషయంపై ఆసక్తిగలదో పరిశీలించి ఆయా అంశాలపై శిక్షణ ఇవ్వడం వల్ల భౌతిక జీవనరీతిని, ఆధ్యాత్మిక జీవన విధానాన్ని అర్థం చేసుకున్న విద్యార్థులు సమాజంలో ఉత్తమపౌరులుగా ఎదుగుతారు. వరుణుడు తనకు తెలిసిన ఆనందమే బ్రహ్మమనే జ్ఞానాన్ని తన కుమారుడైన భృగువుకు ముందుగానే చెప్పవచ్చు. కానీ, చెప్పలేదు. ఇక్కడ రక్త సంబంధానికన్నా 'అర్హత' ప్రధానమైన అంశం. తెలుసుకోవాలనుకునే వారి అర్హత ఎలాంటిదో, పట్టుదల ఎలాంటిదో, స్ఫూర్తి ఎంతటిదో పరీక్షించాలనుకోవడం ముఖ్యం.



అందుకే, ముందుగా 'అన్నం బ్రహ్మం. దానిని తపస్సు ద్వారా తెలుసుకో' అన్నాడు. భృగువు తపస్సు చేశాడు. అంటే, దానిపై సుదీర్ఘంగా విచారించాడు. అన్ని కోణాల్లో దాని పరిమితులను పరిశీలించాడు. అప్పుడది కాదని నిరూపించుకున్నాడు. మళ్లీ తండ్రి వద్దకు వెళ్లి అడిగాడు. ఈ సారి తండ్రి 'ప్రాణం' అన్నాడు. భృగువు తపించి, అదీ సమ గ్రం కాదని నిరూపించుకున్నాడు. తదుపరి 'మన స్సు' అన్నాడు. 'అదీ కాదని' తెలుసుకున్నాడు భృగువు. 'విజ్ఞానం' అన్నాడు తండ్రి. కొద్దికాలం తపించి 'అదీ సమగ్రమైంది కాదని' తెలుసుకొన్నాడు భృగువు.

గురువు శిష్యుని అర్హతను పరీక్షించడం అయిపోయింది. అతని పట్టుదల, ఓర్పు, సహనం, శ్రమించే తత్వం, విషయంపై ఆసక్తి గమనించి సంతృప్తి చెందాడు. చివరగా, 'ఆనందమే బ్రహ్మం' అని ఉపదేశించాడు. దానిని తపించి అవగాహన చేసుకొమ్మన్నాడు. భృగువు తపించాడు. అందులోని సారాన్ని గ్రహించి 'అదే సాధికారికమైన, సమగ్రమైన తాత్త్విక రహస్యం' అని గ్రహించాడు. దానినే ఉపాసించాడు, తరించాడు. ఈ కథ వల్ల తండ్రి లేదా గురువులో ఉండవలసిన లక్షణాన్ని, శిష్యునిలో కావాల్సిన జిజ్ఞాసను సూత్రీకరించి ప్రపంచానికి అందించింది 'తైత్తిరీయోపనిషత్తు'.

| లాక్‌డౌన్ సమస్యలపై టోల్‌ఫ్రీ నంబర్లు | పౌరసరఫరాలశాఖ ఉ.10 నుంచి సా.5 వరకు | హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ | సైబరాబాద్ కమిషనరేట్ | రాచకొండ కమిషనరేట్ | కొవిడ్-19 కాల్‌సెంటర్ |
|---|---|---|---|---|---|
| | 1967 | 100 24/7 | 9490617440 | 9490617234 | 040-23434343 |

# మన ఇంటికే ఆరోగ్య లక్ష్మి

## గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహార పంపిణీ

- ఇంటికి వెళ్లి అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు
- రెండో విడుత పౌష్టికాహార పంపిణీ ప్రారంభం

**రాష్ట్రంలో** ఆరోగ్య లక్ష్మి పథకం కింద ఇంటికే పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నారు. కరోనా వైరస్ వ్యాప్తి నియంత్రణలో భాగంగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను మూసివేసింది. ఈ కేంద్రాలపై ఆధారపడిన బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహార సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మహిళా, శిశు సంక్షేమ శాఖ నుంచి సరుకులను లబ్ధిదారుల ఇంటికే పంపిస్తున్నారు. ఇందులో భాగంగా గత నెల 23 నుంచి తొలి విడుతలో సరుకులను ఇండ్లకు వెళ్లి అందజేయగా సోమవారం రెండో విడుతను ప్రారంభించారు.

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: రాష్ట్రంలో పేద వర్గాలు పౌష్టికాహార లోపంతో ఉండరాదని ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తున్నది. ఆరోగ్య లక్ష్మితో రూ.వేలాది కోట్లు వెచ్చించి నాణ్యమైన పౌష్టికాహారాన్ని సరఫరా చేస్తున్నది. బాలింతలకు రోజుకు 150 గ్రాముల బియ్యం, 30 గ్రాముల పప్పు, 200 మి.లీటర్ల పాలు, 16 గ్రాముల నూనె, ఒక కోడిగుడ్డు చొప్పున పది రోజులకు సరిపడా ఒకేసారి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేస్తున్నారు. అంతేకాకుండా 15 రోజులకు సరిపడా రేషన్ కూడా అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ఇస్తున్నారు. పిల్లలకు రోజు కు 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల పప్పు, 5 గ్రాముల నూనె, ఒక గుడ్డు చొప్పున ఇస్తున్నారు. అదేవిధంగా మూడేండ్లలోపు పిల్లలకు బాలామృతం, గుడ్డు పంపిణీని ఈ నెల ఒకటి నుంచి ప్రారంభించారు.

**రెండో విడుత షురూ..**

అంగన్‌వాడీ కేంద్రాల నుంచి రెండో విడుత సరుకుల పంపిణీ సోమవారం మొదలైంది. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో సరుకుల కిట్‌ను పంపిణీ చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల దగ్గరకు వచ్చి తీసుకెళ్లే వారు కరోనా కారణంగా భౌతిక దూరం పాటిస్తున్నారు.

**అంగన్‌వాడీ నిర్వాహకుల సేవలు భేష్**

కరోనా నియంత్రణకు అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు విశేష కృషిచేస్తున్నారని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ కమిషనర్ దివ్య అభినందించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరుకుల పంపిణీ రెండో దశ కార్యక్రమాన్ని సోమవారం మొదలుపెట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు మాస్కులు, శానిటైజర్లను ఆమె అందించారు. కరోనా బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దివ్య సూచించారు.



సోమవారం ములుగు జిల్లా వెంకటాపురం (నూ) మండలం బోదాపురంలో ఇంటికి వెళ్లి మహిళకు గుడ్లు అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్ స్వరూప

**'ఆరోగ్య లక్ష్మి' లబ్ధిదారులు**

అంగన్‌వాడీ కేంద్రాలు:
**34,000**

బాలింతలు, గర్భిణులు:
**3,32,427**

చిన్నారులు:
**4,61,800**

తీవ్ర పోషకాహారలోపం ఉన్న పిల్లలు:
**8,446**

## సీఎం కేసీఆర్ సాహసం అనితరసాధ్యం

- ఎంపీ సంతోష్‌కుమార్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రజలకు మేలు చేయడంలో సీఎం కేసీఆర్ ఎప్పుడూ ముందుంటారని, ఈ విషయాలపై ఆయన అవధుల్లేకుండా ఆలోచిస్తుంటారని ఎంపీ సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. కరోనాతో నిరంతరం పోరాడుతున్న వైద్యులు, పోలీసులు, ఆరోగ్య, పారిశుద్ధ్య సిబ్బందికి సీఎం కేసీఆర్ వందనాలు తెలిపిన విషయాన్ని ఆయన ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు. ప్రజల సంరక్షణను దృష్టిలో పెట్టుకునే ఆయన లాక్‌డౌన్‌ను పొడిగించాలని కోరినట్టు తెలిపారు. సీఎం కేసీఆర్ మాదిరిగా ఆలోచనాత్మక విజ్ఞప్తి చేసేందుకు ఎవరూ సాహసించరన్నారు. ఆర్థికంగా కోలుకోగలం కానీ పోగొట్టుకున్న జీవితాలను తిరిగి తీసుకురాలేమని గొప్పవారు మాత్రమే ఆలోచించగలరని, అందుకు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఎంపీ లాడ్స్ నిధులను రెండేండ్లపాటు సస్పెండ్ చేయడంతో పాటు ఎంపీల జీతాల్లో 30 శాతం కోత విధించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు మరో ట్వీట్‌లో పేర్కొన్నారు.



వనపర్తి మండలం చందాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

## గ్రామాల్లోనే ధాన్యం కొనుగోళ్లు

- వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి రూరల్:** రాష్ట్రంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా రైతులు నష్టపోకుండా గ్రామాల్లోనే కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. సోమవారం వనపర్తి మండలంలోని చందాపూర్, దత్తాయపల్లి, పెద్దగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం, రేవల్లిలో వరి, మక్కజొన్న, గోపాల్‌పేట మండలంలోని ఏదుట్లలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేంద్రాల వారీగా రైతులకు అందించిన కూపన్ల ప్రకారం రైతులు కేంద్రాలకు వచ్చి ధాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు. రైతుల ఖాతాల్లో నేరుగా ధాన్యం డబ్బులు జమ చేస్తామన్నారు.



కొత్తపల్లి మండలం మల్కాపూర్ చౌరస్తాలో మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

## కోటి టన్నుల ధాన్యం రావొచ్చు

- పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల

**కరీంనగర్‌ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** యాసంగి సాగులో రాష్ట్రంలో కోటి మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేసినట్టు పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రంతోపాటు కొండయపల్లి, కురిక్యాల గ్రామాల్లో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, కొత్తపల్లి మండలం మల్కాపూర్‌లో మక్కల కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడుతూ.. గత యాసంగిలో 45 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఈ సారి చివరి గింజ వరకూ కొనుగోలు చేపడతామన్నారు.



మహబూబ్‌నగర్ జిల్లా మన్యంకొండ స్టేజీ దగ్గర కొనుగోలు కేంద్రం ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు

- ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ రూరల్:** లాక్‌డౌన్ కారణంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్రామాల్లోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సోమవారం మహబూబ్‌నగర్ మండలం ధర్మాపూర్, మన్యంకొండ స్టేజీ దగ్గర ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొనుగోళ్లు జరిగిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని చెప్పారు. కరోనా మహమ్మారి బారిన పడకుండా ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు.



జగిత్యాల జిల్లా ధర్మపురిలో వలస కూలీలకు భోజనం వడ్డిస్తున్న మంత్రి ఈశ్వర్

## యాచకులు పస్తులుండొద్దు

- ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

**ధర్మపురి, నమస్తేతెలంగాణ:** కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టిందని ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సోమవారం ఆయన జగిత్యాల జిల్లా ధర్మపురి, వెల్గటూర్ మండలాల్లో పర్యటించారు. ధర్మపురిలో యాచకులు, వలస కూలీలు పస్తులుండరాదన్నారు. వారికోసం ఎల్‌ఎం కొప్పుల ట్రస్ట్ ఆధ్వర్యంలో వారం రోజులుగా రెండు పూటలా భోజన సౌకర్యం కల్పిస్తున్నట్టు చెప్పారు. మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో ఉన్న ఈ ప్రాంతానికి చెందిన వలస కూలీలు కూడా పస్తులుండకుండా వారికి డబ్బులు పంపుతున్నట్టు చెప్పారు.

## పరిమళించిన మానవత్వం

- సొంతఖర్చుతో వృద్ధుడి అంత్యక్రియలు నిర్వహించిన వ్యాపారులు
- ముందుకు రాని మృతుడి బంధువులు

**విద్యానగర్:** కరోనా వైరస్ విజృంభిస్తున్న వేళ ఒకరి నుంచి మరొకరి మధ్య భౌతిక దూరం పెరిగింది. దగ్గరి బంధువు మరణించినా దూరం నుంచే చూసి వెళ్లిపోతున్న సందర్భాలు కన్పిస్తున్నాయి. అలాంటిది కామారెడ్డిలో ఓ వృద్ధుడు మరణిస్తే స్థానిక వ్యాపారులు ముందుకు వచ్చి సొంత ఖర్చులతో అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటారు. స్థానిక అనాథ ఆశ్రమంలో మూడేండ్లుగా ఉంటున్న దివ్యాంగుడు సాయిలు ఆదివారం రాత్రి మృతి చెందాడు. కరోనా వైరస్ కారణంగా అతడి బంధువులు ఎవరూ రాలేదు. విషయం తెలుసుకున్న కామారెడ్డిలోని బాంబే క్లాత్ హౌస్ యజమాని లాల్, తిరుమల బటన్ స్టోర్ యజమాని చంద్ర సొంత ఖర్చులతో అంత్యక్రియలు నిర్వహించారు.



సాయిలు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న వ్యాపారులు

# 7,700 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

- మద్దతు ధర చెల్లింపునకు రూ.30 వేల కోట్లు కేటాయింపు
- ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు



గజ్వేల్ మండలం దాచారంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని ఎంపీ కొత్త ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభింపజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

**గజ్వేల్ రూరల్/టౌన్:** రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 7,700 కేంద్రాలను ప్రారంభిస్తామని ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం దాచారంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితో ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. క్వింటాల్ శనగలకు మద్దతు ధర రూ.4,875 ఇస్తున్నామన్నారు. త్వరలోనే మండల కేంద్రాల్లో మక్కజొన్న, వరి, పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని, ఇందుకోసం సీఎం కేసీఆర్ రూ.30 వేల కోట్లను కేటాయించినట్టు చెప్పారు. వడ్లకు రూ.1,835, మక్కజొన్నకు రూ.1,760, పొద్దుతిరుగుడు పంటను కూడా మద్దతు ధరకే కొనుగోలు చేస్తామన్నారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ముందస్తుగా అన్ని గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని మంత్రి అధికారులకు సూచించారు. అక్కడే ఉన్న ఏఈవో ప్రసన్నతో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రత్యేక సమావేశం నిర్వహించారా? అని అడగ్గా.. ఒక గ్రామంలో మాత్రమే జరిగిందని, మిగతా చోట్ల నిర్వహించలేదని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో సమావేశాలను నిర్వహించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో గన్నీ బ్యాగుల కొరత ఉన్న విషయాన్ని సీఎం కేసీఆర్.. ప్రధాని మోదీకి ఫోన్‌చేసి చెప్పారని హరీశ్‌రావు తెలిపారు. లాక్‌డౌన్ దృష్ట్యా రైతుల సమస్యలపై సీఎం కేసీఆర్ నేరుగా సమీక్షిస్తున్నారని, 24 గంటలపాటు ఓ వైపు కరోనాతో పోరాడుతూనే మరోవైపు రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్టు కొనియాడారు.

# ఉరుముల వాన

- నాగర్‌కర్నూల్ జిల్లాలో భారీగా..
- పలుచోట్ల ఓ మోస్తరు..
- నారాయణపేట జిల్లాలో పిడుగుపాటుకు మహిళ మృతి
- మరో రెండు రోజులు వర్షసూచన



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో కురుస్తున్న వర్షం

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ/నెట్‌వర్క్:** ఉపరితల ఆవర్తనం కారణంగా సోమవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. మరాఠ్వాడ దాని పరిసర ప్రాంతాల్లో సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దక్షిణ ఇంటీరియర్ కర్ణాటక నుంచి పశ్చిమ విదర్భ వరకు ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక మరాఠ్వాడ మీదుగా 1.5 కి.మీ. ఎత్తు వద్ద ఏర్పడ్డ ఉపరితల ద్రోణి స్థిరంగా కొనసాగుతున్నది. దీని ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు రాష్ట్రంలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్, మాచారం, వటువర్లపల్లి, సార్లపల్లిలో భారీ వర్షం కురిసింది. వెల్దండ మండలంలోని కొట్ర, తిమ్మినోనిపల్లి, రాచూర్ మామిడి కాయలు నేల రాలగా, పంటలు దెబ్బతిన్నాయి. శ్రీశైల ఉత్తర ద్వారమైన శ్రీ ఉమామహేశ్వర క్షేత్రంలో భారీ వర్షం కురిసింది. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం లింగారెడ్డిపల్లిలో పిడుగుపాటుకు కావలి వెంకటమ్మ(40) మరణించింది. మరికల్, ధన్వాడ, కోస్గి మండలాల్లో ఈదురు గాలులతో కూడిన జల్లులు పడ్డాయి. నారాయణపేట, దామరగిద్ద, మద్దూరు మండలాల్లో పెద్ద ఎత్తున గాలులు వీచాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంతో పాటు, జడ్చర్ల, దేవరకద్ర తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. అప్పన్నపల్లిలో ఓ ఇంటిపై పిడుగుపడటంతో గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది.

**రాష్ట్రంలో మరో రెండు రోజులు వర్షాలు**

మరో రెండు రోజుల వరకు రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశమున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ, వంగూర్, ఉప్పునూతల, రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి, చేవెళ్ల, శంషాబాద్, కేశంపేట, మాడ్గుల, ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్, నల్లగొండ జిల్లా గుండ్లపల్లి, మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల్లో 2 నుంచి 5 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

## ఇండోనేషియా వాసులపై కేసు

**కరీంనగర్ క్రైం:** నిబంధనలు ఉల్లంఘించి మత ప్రచారం చేయడంతోపాటు కరీంనగర్‌లో కరోనా వైరస్ వ్యాప్తికి కారణమైన 15 మంది (10 మంది ఇండోనేషియావాసులు, ముగ్గురు కరీంనగర్, ఇద్దరు యూపీవాసులు)పై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. సందర్శన వీసాపై కరీంనగర్‌కు వచ్చి మత ప్రచారం చేయడంతోపాటు ప్రమాదకరమైన కరోనా వైరస్ ఉన్న విషయాన్ని దాచి దాని వ్యాప్తికి కారణమైన ఇండోనేషియా వ్యక్తులు, వారికి సహకరించిన వారిపై కేసులు పెట్టినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 14న ఇండోనేషియావాసులు కరీంనగర్‌కు వచ్చారు. వీరు గత నెల 16న అస్వస్థతకు గురి కాగా, కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు వెళ్లారు. వారికి కరోనా లక్షణాలు ఉన్నట్లు తేలడంతో అప్రమత్తమైన జిల్లా యంత్రాగం ఇండోనేషియా వాసులు 10 మందితోపాటు వారితో కలిసి ఉన్న ఐదుగురు వివరాలు సేకరించింది. వీరిందరినీ హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. కాగా, నగరంలో కరోనా వ్యాప్తికి కారణమైన వీరిపై స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఫిర్యాదు మేరకు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.


**జిల్లా మార్కెటింగ్ ఆఫీస్ కార్యాలయం, మహబూబ్‌నగర్**
**బోయపల్లి గేట్ దగ్గర, న్యూ గంజ్, మహబూబ్‌నగర్,**

**No. DMO/MBNR/PR/518/2017,** **సంక్షిప్త టెండరు ప్రకటన** **తేది: 06-04-2020**

మహబూబ్‌నగర్ జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీలకు దిగువ తెలిపిన ఎక్విప్‌మెంట్స్/ఐటమ్‌లు సరఫరా చేయుటకు సీల్డ్ కొటేషన్లు కోరబడుతున్నవి. 1. టార్పాలిన్లు-499 నెం.లు. 2. ఎలక్ట్రానిక్ వేయింగ్ స్కేల్-70 నెం.లు. 3. ధాన్యం & గింజల కొరకు డిజిటల్ మాయిశ్చర్ మీటర్-55 నెం.లు. ఆసక్తిగల సంస్థలు/ తయారీదారులు టెండరు షెడ్యూళ్లను జిల్లా మార్కెటింగ్ ఆఫీస్ కార్యాలయం, మహబూబ్‌నగర్ నుండి రూ. 2,000.00 (రెండు వేల రూపాయలు మాత్రమే) చెల్లింపుపై పొందవచ్చును. సెక్యూరిటీ డిపాజిట్ నిమిత్తం జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్, మహబూబ్‌నగర్ పేరున చెల్లింపబడేలా డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో బయానాను టెండర్లకు జతచేయాలి మరియు జిల్లా మార్కెటింగ్ ఆఫీస్ కార్యాలయం, మహబూబ్‌నగర్ వద్ద ఉంచిన టెండరు బాక్సులో **11-04-2020న మ॥ 3.00 గం.లోగా** కొటేషన్లను దాఖలు చేయాలి. ఏదైనా ఇతర సమాచారాన్ని పనివేళల్లో జిల్లా మార్కెటింగ్ ఆఫీస్ కార్యాలయం, మహబూబ్‌నగర్ నుండి పొందవచ్చును. **టెండరు వివరాలు:** టెండరు షెడ్యూల్ అమ్మకం తేదీ: 07-04-2020 నుండి 10-04-2020న ఉ॥ 11.00 గం. వరకు. టెండర్ల దాఖలు కొరకు చివరి తేదీ: 11-04-2020న మ॥ 3.00 గం. వరకు. టెండర్లు తెరుచు తేదీ: 13-04-2020న సా॥ 4.00 గం.

సం/- **జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్, మహబూబ్‌నగర్** సం/- **అదనపు కలెక్టర్, మహబూబ్‌నగర్**
DIPR RO.No. 1105-PP/CL/ADVT/1/2020-21, Dt: 06-04-2020

**తెలంగాణ ప్రభుత్వం**
**వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, ములుగు జిల్లా**
**సంక్షిప్త టెండరు ప్రకటన**

**Lr No. AMC/MLG/KMS/2019-20 (Rabi Season)** **తేది: .04.2020**

ములుగు జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కొరకు ధాన్యం కొరకు ఎలక్ట్రానిక్ వేయింగ్ స్కేల్స్, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్స్, మాయిస్చర్ మీటర్ల సరఫరా కొరకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. స్పెసిఫికేషన్లు, నియమ నిబంధనలు మరియు ఇతర వివరాలు టెండరు షెడ్యూల్‌లో తెలుపబడినవి. టెండరు షెడ్యూల్‌ను మార్కెట్ సెక్రటరీ కార్యాలయం AMC ములుగు నుండి కార్యాలయ వేళలలో కలెక్టర్, ములుగు పేరున DD రూపంలో లేదా నగదుగా రూ. 1000/- చెల్లించి పొందవచ్చును. టెండరు షెడ్యూల్ విక్రయ తేదీ: 07.04.2020 నుండి 09.04.2020న మ. 1.00 గం॥ వరకు. టెండరు దాఖలుకు ఆఖరి తేదీ: 09.04.2020న మ. 2.00 గం॥ వరకు. టెండరు తెరచు తేదీ, సమయం 09.04.2020న మ. 3.00 గం॥కు. వివరాలకు సంప్రదించండి: 7330733502/7331157956

**సం/- జిల్లా మార్కెటింగ్ అధికారి (FAC)** **సం/- కలెక్టర్**
DIPR RO. No. 1107-PP/CL/Advt/1/2020-21, Dt: 06/04/2020

**వ్యవసాయ మార్కెటింగ్ శాఖ**
**జిల్లా మార్కెటింగ్ అధికారి కార్యాలయం, జనగాం. మొబైల్ నెం: 7330944725**

**No. DMO/JNG/MSP/RMS/2019-20,** **సంక్షిప్త టెండరు ప్రకటన** **తేది: 06-04-2020**

దిగువ ఐటమ్‌ల సరఫరా కోసం తయారీదార్లు/సంస్థల నుండి సీల్డ్ కొటేషన్లు కోరబడుచున్నవి: ఐటమ్ పేరు & షెడ్యూల్ ధర & బయానా: ధాన్యం మాయిశ్చర్ మీటర్లు (డిజిటల్) - రూ. 1,000/- - రూ. 10,000/-. టార్పాలిన్స్ - రూ. 1,000/- - 10,000/-. ఎలక్ట్రానిక్ వేయింగ్ స్కేల్స్ - రూ. 1,000/- - 20,000/-. ప్యాడీ క్లీనర్స్ - రూ. 1,000/- - 50,000/-. ఆసక్తిగల సంస్థలు/తయారీదార్లు టెండరు షెడ్యూళ్లను నగదు లేదా DD రూపంలో రూ. 1,000/- (ఒక వేయి రూపాయలు మాత్రమే) చెల్లింపుపై జిల్లా మార్కెటింగ్ అధికారి, జనగాం నుండి పొందవచ్చును. టెండర్లు సెక్యూరిటీ డిపాజిట్ నిమిత్తం జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్, జనగాం పేరున చెల్లించేలా పట్టికలో చూపిన విధంగా DD రూపంలో బయానా మొత్తంతో జతచేయాలి మరియు జిల్లా మార్కెటింగ్ అధికారి కార్యాలయం, జనగాం వద్ద ఉంచిన టెండరు బాక్సులో కొటేషన్లను వేయాలి. ఏదైనా ఇతర సమాచారాన్ని జిల్లా మార్కెటింగ్ అధికారి కార్యాలయం, జనగాం నుండి పనివేళల్లో పొందవచ్చును. వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు ఏ కారణాలు చూపకుండా ఏదైనా లేదా అన్ని టెండర్లను తిరస్కరించుటకు/రద్దు చేయుటకు హక్కు కలదు.

| | | |
|---|---|---|
| టెండరు షెడ్యూల్ అమ్మకం తేది | : | 07-04-2020న ఉ॥ 10.30 గం. నుండి |
| టెండర్లు దాఖలుకు ఆఖరి తేది | : | 09-04-2020న మ॥ 3.00 గం. వరకు |
| టెండర్లు తెరుచు తేది | : | 09-04-2020న సా॥ 5.00 గం.కు |

సం/- **జిల్లా మార్కెటింగ్ అధికారి, జనగాం** సం/- **జిల్లా కలెక్టర్, జనగాం**
DIPR RO.No. 1106-PP/CL/ADVT/1/2020-21, Dt: 06-04-2020

**జిల్లా మార్కెటింగ్ అధికారి వారి కార్యాలయం, మంచిర్యాల జిల్లా**
**వ్యవసాయ మార్కెట్ కమిటీ, కాలేజ్ రోడ్, మంచిర్యాల. ఫోన్ నెం. 08736 2520166, 7330733415**

**No. DMO/MNCL/PADDY/04/2020** **షార్ట్ టెండర్ నోటీసు** **తేది:04-04-2020**

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, రబీ మార్కెటింగ్ సీజను 2020నకు మంచిర్యాల జిల్లాలోని వరి ధాన్యం సేకరణ కొనుగోలు కేంద్రాలకు ఈ క్రింద తెలుపబడిన పరికరాలను వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా సరఫరా చేయుట కొరకు ఆసక్తి గల రిజిష్టర్డ్ కాంట్రాక్టర్లు/ఉత్పత్తిదారుల నుండి సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు దరఖాస్తు ధర రూ. 500/- (ఐదు వందల రూపాయలు మాత్రమే) చెల్లించి మరియు ఏదేని ఇతర సమాచారము మరియు పూర్తి వివరాల కొరకు జిల్లా మార్కెటింగ్ అధికారి వారి కార్యాలయం మంచిర్యాల నుండి పొందవచ్చును. **Name of the Eqipments with Specification:** (1) **TARPAULINS**-5 layered HDPE fabric sheets of size 24ft x 18ft (250 GSM black, heavy duty 5 layers rugged with tear resistant strength. Heat scalene edge reinforced with rope and hemmed with minimum 25 mm overlap fitted etelets 120 CM apart all around cut to sizes. (2) **DIGITAL MOISTURE METER**-National Digital Moisture meter Model-DMM2 with Hoper Battery carrying case instruction Manual & Calibrated for Paddy (Calibrated for Paddy & Maize). **No.of required:** (1) 1000, (2) 50. పైన తెలుపబడిన పరికరాల యొక్క ఇ.ఎం.డి. ధరావత్తు రూ. 20,000/- జిల్లా మార్కెటింగ్ అధికారి మంచిర్యాల గారి పేరున డిడి రూపంలో చెల్లించి టెండరు ఫారమునకు జతచేసి టెండర్ బాక్స్‌లో వేయవలెను. లేనిచో తిరస్కరించబడును. టెండరు ఫారాలు అమ్మకమునకు తేది: 08-04-2020 నుండి 09-04-2020 మ. 1.00 గం.వరకు, టెండరు దాఖలు చివరి తేది, సమయం: 09-04-2020 మ. 2.00 గం.వరకు. టెండరు తెరుచు తేది, సమయం, స్థలం: 09-04-2020 సా. 4.00 గంటలకు. జిల్లా సంయుక్త కలెక్టర్ వారి కార్యాలయం, మంచిర్యాల.

DIPR R.O. No. 1096-PP/CL/Advt/1/2020-21, Dt: 06-04-2020 **సం/- జిల్లా సంయుక్త కలెక్టర్, మంచిర్యాల**

**తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్**
**(రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ)**
**పరిశ్రమలు, వాణిజ్య శాఖ, తెలంగాణ ప్రభుత్వం: # 6-2-915, HMWSSB ఆవరణ, వెనుక బ్లాక్, 3వ అంతస్తు, ఖైరతాబాద్, హైదరాబాద్ -500 004, T.S.,**
**e- మెయిల్ ID:tsmdcltd@gmail.com, mdcltd@telangana.gov.in,**
**www.tsmdc.telangana.gov.in టెలిఫోన్: 040-23323150,**
**టెలిఫ్యాక్స్: 040-23373155**
**ISO 9001: 2015 కార్పొరేషన్. CIN: U14220TG2014SGC095923.**

**సంక్షిప్త ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు**

**టెండరు నం. TSMDC/WEIGH BRIDGE/2020/17** **తేది: 06.04.2020**

దిగువ వివరాల ప్రకారం దిగువ పనుల కొరకు తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (TSMDC) వారు సంక్షిప్త ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు కోరుతున్నారు.

పని పేరు: తెలంగాణ రాష్ట్రంలో వివిధ ప్రదేశాల వద్ద 8 స్టాక్ యార్డ్‌ల వద్ద ప్రీ క్యాస్టెడ్ RCC బ్లాక్స్‌తో ఒకొక్కటి 6 లోడ్ సెల్స్ మరియు 12x3 మీటర్ల ప్లాట్‌ఫారంతో (8) పరిమాణం, 80 మెట్రిక్‌టన్నులు ఫుల్లీ ఎలక్ట్రానిక్ పిట్‌లెస్ సర్ఫేస్ మౌంటెడ్ వేబ్రిడ్జి స్థాపన (వేబ్రిడ్జి కొరకు సివిల్ పనితో సహా స్థాపన మరియు పనిచేయించుట) మరియు నిర్వహణ.

కాగోరు బిడ్డరు వెబ్‌సైట్ **https://tender.telangana.gov.in**లో ఆన్‌లైన్ ద్వారా పాల్గొనవలెను. టెండర్ల నియమ నిబంధనలతో పాటు పై టెండరు షెడ్యూళ్ల వివరాలను పై వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.

ఏ కారణాలు తెలుపకుండా ఏదైనా లేదా అన్ని టెండర్లను తిరస్కరించుటకు హక్కు TSMDCకి కలదు.

**సం/- వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్**
**TSMDC లిమిటెడ్**

**Dipr R.O.No. 1090-PP/CL/Advt/1/2020-21, Dt: 06.04.20**

నమస్తే తెలంగాణ
కరీంనగర్
మంగళవారం 7 ఏప్రిల్ 2020
www.ntnews.com

# జిందగీ

## వారికోసమే ఈ మాస్క్



**కరోనా** వ్యాప్తి నివారణకు మాస్కుల కొరత చాలా ఉంది. ప్రపంచంలో కేవలం 50 శాతం మందే మాస్కులు వాడుతున్నారు. కెంటుకీ విశ్వవిద్యాలయ విద్యార్థిని ఆష్లే లారెన్స్ మూగ, చెవిటి వారికి ఓ సరికొత్త మాస్క్‌ని తన కుటుంబం సహాయంతో తయారుచేసింది. నోటి దగ్గర పారదర్శకంగా ఉండేలా ఈ మాస్క్ ఉంటుంది. వినికిడి లోపం ఉన్నవాళ్లు సులభంగా అర్థం చేసుకునేలా, అలాగే కరోనాని అరికట్టేలా ఈ మాస్క్ తయారుచేసినట్లు లారెన్స్ తెలిపింది. ప్రాజెక్టుకి సంబంధించి సోషల్‌మీడియాలో ఒక పేజీని క్రియేట్ చేసింది. అవసరమైనవారికి ఈ మాస్కులను ఉచితంగా పంపిణీ చేసే ఆలోచనలు కూడా చేస్తున్నది. ఒకవేళ ఎవరైనా ఈ మాస్కులను తయారుచేసేందుకు ముందుకు వస్తే వారికి ఈ నమూనా చూపించి, ఎలా తయారుచేయాలో ఆన్‌లైన్ ద్వారా శిక్షణ కూడా ఇస్తానంటున్నది లారెన్స్.



## మధుమేహ చికిత్స ఇలా

- మందులను వాడే విషయంలో మీకు డయాబెటిస్ చికిత్సను ఇచ్చే వైద్యుల సలహాలు పాటించాలి.
- ఇంటి దగ్గరే డయాబెటిస్ పరీక్షలు చేసుకుంటుంటే ఆ పరీక్షలను ఇంకా ఎక్కువ తరచుగా చేసుకోవాలి. ఇంట్లో పరీక్షించుకోలేకపోతే హైపర్‌గ్లైకోమియా లక్షణాలు ఉన్నాయేమో గమనించాలి. అంటే ఎక్కువసార్లు మూత్రవిసర్జనకు వెళ్లాల్సి రావడం (ముఖ్యంగా రాత్రిపూట), ఎక్కువ దాహం ఉండటం, తలనొప్పులు, అలసట, బద్ధకం ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించండి.
- టైప్ 1 డయాబెటిస్ ఉన్నట్టయితే రాత్రిపూటే కాకుండా రోజంతా కనీసం 4 గంటలకోసారి రక్తపరీక్షలు చేసుకోవాలి. గ్లూకోజ్ మోతాదు ఎక్కువగా ఉంటే ఇన్సులిన్ ఎక్కువ మోతాదులో తీసుకోవాల్సి రావొచ్చు. అదేవిధంగా ఈ చక్కెరలు 240 మిల్లీ గ్రాముల కన్నా వరుసగా రెండుసార్లు ఎక్కువగా ఉంటే కీటోన్స్‌ను పరీక్షించుకోవాలి. టైప్ 1 డయాబెటిక్ ఉన్నవాళ్లు పరీక్షించుకునే కీటోన్ స్ట్రిప్స్ దగ్గర ఉంచుకోవాలి. కీటోన్స్‌లో కూడా ఎక్కువ తక్కువలు ఉన్నా, వాంతులు అవుతున్నా డయాబెటిక్ కీటో అసిడోసిస్ (డికెఎ) ఉండొచ్చని అనుమానించి వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.
- హైపోగ్లైసీమియా లక్షణాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. బ్లడ్ గ్లూకోజ్ స్థాయి తక్కువ (70మి.గ్రా.) ఉంటే 15 గ్రాముల గ్లూకోజ్ లేదా తేనె, జామ్, క్యాండి లేదా పండ్ల రసం, సోడా లాంటివి తీసుకోవాలి. 15 నిమిషాలకు ఒకసారి పరీక్ష చేయాలి. గ్లూకోజ్ లెవల్స్ పెరిగేవరకు ఇలానే చేయాలి. అయినా పెరగకపోతే డాక్టర్‌ను అడగాలి.
- మీ చేతులు, ఇంజెక్షన్ పరికరాలను సబ్బునీళ్లతో లేదా ఆల్కహాల్‌తో శుభ్రం చేయాలి.
- ఏ జలుబు లక్షణాలో ఉంటే మందుల షాపుల్లో కొని వాడే మందుల వల్ల బ్లడ్ గ్లూకోజ్ లెవల్స్ పెరగవచ్చు. దగ్గు మందుల వల్ల కూడా చక్కెరలు పెరుగుతాయి. జ్వరం, నొప్పి నివారణ మందులు కూడా ఇబ్బందికరమైనవే. పెద్దమోతాదులో యాస్పిరిన్ తీసుకుంటే గ్లూకోజ్ లెవల్స్ పడిపోవచ్చు. పారాసిటమాల్ అయినా సరే. అందుకే జలుబు, ఫ్లూ, ఇతర వైరస్ ఇన్‌ఫెక్షన్లకు సొంతంగా మందులు వాడొద్దు. డాక్టర్‌ను అడగాలి.

ఇది కరోనా కాలం. చిన్నా పెద్దా, ఆడా మగా, జాతీ, వర్గ భేదాలు లేకుండా కరోనా అందరిపైనా విరుచుకు పడుతున్నది. ఈ విపత్తుకు ఎక్కువగా బలి అవుతున్నది వృద్ధులే. అసలే జీవనశైలి వ్యాధులతో బాధపడే వృద్ధులకు ఈ కరోనా దెబ్బ పెద్ద సమస్య అయింది. ఈ నేపథ్యంలో వృద్ధులు మరింత జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా మధుమేహం ఉన్నవాళ్లలో ఆ వ్యాధి కాంప్లికేషన్లే కాకుండా కరోనా వైరస్ ఇన్‌ఫెక్షన్ సులువుగా వచ్చే ప్రమాదం ఉంది. అందుకే డయాబెటిక్స్ ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో చూద్దాం.

# మధుమేహులూ.. మరింత భద్రం!

**వయసు పెరుగుతున్న కొద్దీ అవయవాల పనితీరు కూడా మందగిస్తుంది. అందుకే వృద్ధుల్లో వ్యాధి నిరోధక వ్యవస్థ కూడా బలహీనంగా ఉంటుంది. యాంటిబాడీలను తయారు చేసే టి కణాల ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. అందువల్ల పెద్దవాళ్లలో ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశం ఎక్కువ. కరోనాయే కాదు.. ఇతర శ్వాసకోశ వ్యాధుల రిస్క్ కూడా ఎక్కువే ఉంటుంది. అందుకే వీళ్లు మరింత జాగ్రత్తగా ఉండాలి.**



**దీర్ఘకాలం డయాబెటిస్ ఉంటే..**
డయాబెటిస్ ఉన్న పెద్దవాళ్లలో కొంతమందికి కొవిడ్ 19 వల్ల మరింత తీవ్రమైన సమస్యలు ఎదురుకావచ్చు. మధుమేహం వల్ల ఇమ్యూనిటీ మరింత తగ్గిపోవడమే ఇందుకు కారణం. మామూలు వ్యక్తుల కంటే డయాబెటిస్ ఉన్నవారు ఈ వైరస్ సోకినప్పుడు ఎక్కువ ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవచ్చు. ఈ వైరస్ సోకడం వల్ల హైపోగ్లైసీమియా పెరగడానికి ఎక్కువ దోహదం అవుతుంది. అదేవిధంగా డయాబెటిక్ కీటోఅసిడోసిస్ (డికెఎ)కు దారితీయవచ్చు. ఈ స్థితిలో వెంటనే చికిత్స అందించకపోతే మరణాలు కూడా సంభవించవచ్చు. ఏ పక్కింటికో, గుడికో వెళ్లి వచ్చినా సరే 20 సెకన్లలోపే చేతులను సబ్బు నీళ్లతో బాగా కడుక్కోవాలి. ఒకవేళ సబ్బు, నీళ్లు అందుబాటులో లేకపోతే 60 శాతం ఆల్కహాల్ కలిసిన శానిటైజర్‌తో చేతులు రుద్దుకోవాలి. ఏ హాస్పిటల్ కోసమో బయటకు వెళ్లాల్సి వస్తే ఎలివేటర్ బటన్‌లు, డోర్ హ్యాండిల్స్, హ్యాండ్ రైల్స్, కరచాలనాలు, ఇతరులను తాకడం వంటివి చేయొద్దు. శ్వాసకోశ సంబంధమైన వ్యాధులు కలిగినవారికి, దగ్గుతున్న వారికి కనీసం 6 అడుగుల దూరం పాటించాలి. ఈ వైరస్ వ్యాధి లక్షణాలు కలిగినవారికి కనీసం 6 అడుగులు (2 మీటర్లు) దూరం పాటించాలి. మీ పరిసర ప్రాంతాలలో కొవిడ్ 19 వ్యాపిస్తే ఇతరులతో మీరు దూరం పాటించండి. వీలైనంత వరకు ఇంట్లోనే ఉండండి. హైడ్రాక్సి క్లోరోక్విన్, ఎరిత్రోమైసిన్ లాంటివి వేసుకుంటే కరోనా రాదని వాడుతున్నారు. కానీ వీటిని సొంతంగా వాడొద్దు. ఎవరు పడితే వారు వేసుకోవద్దు. వీటివల్ల గుండె సమస్యలు రావచ్చు. చాలామంది అలాగే చనిపోయారు కూడా. కాంప్లికేషన్లు వున్నవాళ్లు వేసుకుంటే మరింత ప్రమాదం. ఒకవేళ జ్వరం, దగ్గు, శ్వాసకోశ సంబంధమైన ఇబ్బందులు తలెత్తితే వీలైనంత త్వరగా వైద్య చికిత్సలు చేయించుకోండి. వైద్యులకు మీరు ఎక్కడెక్కడికి వెళ్లింది, ఎవరెవరిని కలుసుకున్నది విపులంగా తెలియజేయండి. డాక్టర్‌ను కలిసేటప్పుడు విధిగా నోటికి మాస్క్ ధరించండి. లేదా నోరు, ముక్కు ఏదైనా గుడ్డతో కప్పుకొని ఇతరులకు ఆ వ్యాధి సోకకుండా జాగ్రత్తపడండి.

**మంచి తిండి తినండి:** సాధారణంగా పెద్దవాళ్లు సరిగ్గా ఆహారం తీసుకోరు. కానీ ఈ విపత్తు సమయంలో శరీరానికి బలాన్నించే మంచి ఆహారం తీసుకోవడం తప్పనిసరి. విటమిన్లు, ప్రొటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రొటీన్లు, యాంటి ఆక్సిడెంట్లు శరీరంలో వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. అందుకే వ్యాధి నివారణకు జాగ్రత్తలు తీసుకుంటూనే ఇమ్యూనిటీని పెంచుకునే ప్రయత్నం చేయాలి. నిరంతరం నీళ్లు లేదా పండ్ల రసాలు తాగుతుండాలి. ఒకేసారి నీళ్లు తాగడంలో ఇబ్బందులు ఉంటే ప్రతి 15 నిమిషాలకు ఒకసారి కొంచెం నీళ్లు తాగాలి. డీహైడ్రేషన్ పరిస్థితి రాకుండా చూసుకోవాలి. విటమిన్ సి, జింక్ , బి-కాంప్లెక్స్ కాంబినేషన్‌లో సప్లిమెంట్లు కూడా అవసరం అవుతాయి. వాంతులు అవుతుంటే కొద్ది కొద్దిగా ఆహారం తీసుకోవాలి. వీలైనంత త్వరగా చికిత్స తీసుకోవాలి.

**వ్యాయామమూ ముఖ్యమే:** షుగర్ వ్యాధి ఉన్న వాళ్లు తప్పనిసరిగా ప్రతిరోజూ వ్యాయామం చేయాలి. కనీసం వాకింగ్ అయినా అరగంట నుంచి గంటసేపు చేయాలని సూచిస్తారు. అయితే ఇది లాక్ డౌన్ సమయం. కాబట్టి వాకింగ్ చేయడానికి బయట పార్కులేవీ లేవు. ఇంటి బయటకే రాలేని పరిస్థితి. అలాగని వ్యాయామం మానేయకూడదు. నిజానికి రోజూ వ్యాయామం చేయడం వల్ల శరీర వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. కాబట్టి ఇంట్లోనే బ్రీతింగ్ ఎక్సర్‌సైజులు గానీ, యోగా, మెడిటేషన్ లాంటివి చేయాలి. పిల్లలతో కలిసి సరదాగా నాలుగు స్టెప్పులు వేస్తే మనసుకు ఉత్సాహంతో పాటు శరీరానికి వ్యాయామమూ అవుతుంది.



**డాక్టర్ సి.హెచ్. వసంత్ కుమార్**
సీనియర్ ఫిజీషియన్,
అపోలో హాస్పిటల్స్
అధ్యక్షులు, రీసెర్చ్ సొసైటీ ఫర్ డయాబెటిస్ ఇన్ ఇండియా

## మా బాబుకు కరోనా ఉందా?

సందేహం సమాధానం



**మా బాబుకు 6 సంవత్సరాలు. గత 14 రోజులుగా జలుబు, దగ్గుతో బాధపడుతున్నాడు. వేరే ఇతర లక్షణాలేవీ లేవు. దగ్గు ఉంది కాబట్టి బాబుకు కరోనా ఉండే అవకాశం లేదు కదా. మాకు చాలా భయంగా ఉంది.**

**- నీరజ,** జగిత్యాల

**కరోనా** వ్యాధి సాధారణంగా పెద్ద వయసువాళ్ల పైనే ఎక్కువగా ప్రభావం చూపుతున్నట్టుగా ఇప్పటివరకు చూశాం. పిల్లలకు ఇప్పటివరకు అయితే అంత రిస్కు ఏమీ చూపలేదు. ఇక మీ బాబు విషయానికి వస్తే ముందు మీరు ఆందోళన పడకండి. మీ బాబుకు కరోనా సోకే అవకాశం ఉండకపోవచ్చు. చాలావరకు పిల్లల్లో సాధారణ జలుబు వచ్చిన తరువాత దాని పై నుంచి బాక్టీరియా ఇన్‌ఫెక్షన్ వస్తుంటుంది. దాని వల్ల దగ్గు ఎక్కువగా రావొచ్చు. అలా మీ బాబుకు సెకండరీ ఇన్‌ఫెక్షన్ ఉండే అవకాశమే ఎక్కువ. కాబట్టి ముందు మీరు వెంటనే మీ బాబును పిల్లల డాక్టర్‌కు చూపించండి. యాంటిబయాటిక్‌తో మీ బాబు సమస్య తగ్గేందుకు ఆస్కారం ఉంది. అయితే కొన్నిసార్లు దగ్గును తేలిగ్గా తీసుకోలేం. అయితే మీ కుటుంబంలో ఎవరైనా ప్రయాణాలు చేసి రావడం గానీ, ప్రయాణం చేసినవాళ్ళు మీ ఇంటికి రావడం గానీ జరిగిందా? బాబు ఆడుకోవడానికంటూ వెళ్లి బయటి వ్యక్తులతో సన్నిహితంగా మెలిగాడా..? ఇలాంటి అంశాలను ఒకసారి పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఏది ఏమైనా మీరొకసారి పీడియాట్రీషియన్‌ను కలిస్తే మీ సమస్య పరిష్కారమవుతుంది.



**డాక్టర్ ఎం.వి. రావు**
సీనియర్ జనరల్ ఫిజీషియన్
యశోద హాస్పిటల్స్
హైదరాబాద్

**మీ సందేహం... మా సమాధానం:** కరోనా వ్యాధి గురించి మీకు ఎటువంటి అనుమానాలు, భయాలు ఉన్నా ఆందోళన పడకండి. మీ ప్రశ్నలు మాకు వాట్సప్ చేయండి. నిపుణులతో మీకు సమాధానాలు ఇప్పిస్తాం. ప్రశ్నలు పంపవలసిన వాట్సప్ నెంబర్: 91827 77177

## జంతువులు సేదదీరుతున్నాయి

**లాక్‌డౌన్ పుణ్యమా అని చాలామంది బయటకు రావడం మానేశారు. దీంతో వాతావరణ కాలుష్యం చాలావరకు తగ్గింది. అంతే కాదు.. జూలోని జంతువులు కూడా ఒత్తిడి లేని జీవితాన్ని హాయిగా గడుపుతూ సేదతీరుతున్నాయట.**



**లాక్‌డౌన్** వల్ల మనకు నిత్యావసర సరుకులకు కొరత ఏర్పడడం మామూలే. కానీ జంతువుల ఆహారానికి కూడా కొంతమేర కొరత ఏర్పడుతున్నట్లు వివిధ జూల అధికారులు చెబుతున్నారు. మనదేశంలో సుమారు 160 గుర్తింపు పొందిన జంతు ప్రదర్శనశాలలున్నాయి. కర్ణాటకలో గరిష్ఠంగా 15 ఉన్నాయి. అన్యదేశ జాతులు, అంతరించిపోతున్న భారతీయ జంతువులతో సహా 56,800 కంటే ఎక్కువ జంతుజాలం దేశవ్యాప్తంగా జంతుప్రదర్శనశాలలలో ఉన్నది. పులులు, సింహాల కోసం రెడ్‌మీట్ పెట్టేవాళ్లం, ఇప్పుడు వాటికి బదులు చికెన్ పెడుతున్నారని కోల్‌కతా, ముంబై జూ నిర్వాహకులు చెబుతున్నారు. భారతదేశంలో అతిపెద్ద జంతుప్రదర్శనశాల అయిన చెన్నైలోని అరిగ్నార్ అన్నా జూ పార్కుకు సొంతంగా పశుగ్రాసం ఉంది. ఇక్కడ రకరకాల గడ్డి జంతువుల కోసం పండిస్తారు. లాక్‌డౌన్ కారణంగా జూలోకి ఎవరినీ అనుమతించడం లేదన్న సంగతి తెలిసిందే. అందుకే జంతువులన్నీ తమ జీవితాన్ని సాఫీగా కొనసాగిస్తున్నాయట. ఎలాంటి ఒత్తిడి లేకుండా బతికేస్తున్నాయట. వివిధ జంతు ప్రదర్శనశాలలలోని జంతు సంరక్షకులు, జంతుప్రదర్శనశాల సిబ్బంది 'జంతువులు ఉల్లాసభరితమైన మానసిక స్థితిలో ఉన్నాయని, మరింత రిలాక్స్‌డ్‌గా, ఒత్తిడి లేకుండా ప్రవర్తిస్తున్నాయ'ని చెబుతున్నారు. 'ఎలుగుబంటి చాలా ఆసక్తిగా ఆహారం కోసం వెతుకుతున్నది. కొన్ని జంతువులు భూమిని తవ్వడం, ఒక చివర నుంచి మరొక చివర వరకు దూకుతున్నాయి. మొత్తంగా జంతువులు ఒత్తిడి లేకుండా, వాటి సహజ ప్రవర్తనను ప్రదర్శిస్తున్నాయి ' అని ఒక జూ డైరెక్టర్ తెలిపారు.

### వంటింటి చిట్కాలు



- ఇంగువలోని యాంటీ సెప్టిక్ గుణాలు కడుపు ఉబ్బరం, అజీర్తిని తగ్గిస్తాయి. రోజూ కొద్దిగా ఇంగువను పప్పులో వేసుకుంటే జీర్ణవ్యవస్థ చక్కగా పనిచేస్తుంది. గ్లాసెడు నీళ్లలో చిటికెడు ఇంగువ పొడి కలిపి తాగినా ఫలితం ఉంటుంది.
- దీనిలోని యాంటీ వైరల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఆస్తమా, బ్రాంకైటిస్, పొడి దగ్గు వంటి శ్వాస సంబంధ ఇబ్బందులను తొలగిస్తాయి. ఇంగువలో అల్లంపొడి, తేనె కలిపి తాగినా ఉపశమనం లభిస్తుంది.
- రక్తం చిక్కదనాన్ని పెంచడం, రక్తపీడనాన్ని తగ్గించడంలో ఇంగువ తోడ్పడుతుంది. దీనిలోని కౌమరిన్ రక్త ప్రవాహాన్ని మెరుగుపరచడంతో పాటు రక్తం గడ్డకట్టడాన్ని నివారిస్తుంది.
- వేడినీళ్లలో ఇంగువ వేసుకొని రోజులో రెండు మూడుసార్లు తాగితే తలనొప్పి తగ్గుతుంది.

## పిల్లల కోసం కథల నందిని



**లాక్‌డౌన్ సమయంలో పిల్లలను కట్టడి చేయడం మామూలు విషయం కాదు. వారి కోసమే ఈ పిల్లల రచయిత్రి నందిని నాయర్ క్లాస్‌లను తీసుకొని, పిల్లలను తన మాటలతో లాక్ చేసేస్తున్నది. హైదరాబాద్‌కి చెందిన ఈమె సీబీఎస్ పాఠ్యప్రణాళిక డెవలపర్, విద్యావేత్త కూడా.**

**పిల్లలను** కాసేపు కుదురుగా కూర్చోబెట్టడం చాలా కష్టం. లాక్‌డౌన్ సమయంలో చదువు లేదు. ఇక వీడియోగేమ్‌ల మీదకు వెళ్లిపోతారు. అలాకాకుండా బొమ్మలతో కథలు చెప్పే ఒక టీచరు ఉంటే? 47 యేండ్లుగా ఇలా పాఠాలు చెబుతున్నది నందిని. ఈమె ఇప్పటికే 28 చిత్రాలతో కూడిన పుస్తకాలను రాసింది. అందులో 'షల్ ఐ మేక్' వంటి పుస్తకాన్ని సీబీఎస్ఈ సిఫార్సు చేయడం విశేషం. పిల్లలు తమ ఆలోచనలను స్పష్టంగా రాసేందుకు ఈమె మార్గదర్శిగా నిలుస్తున్నది. ఐజిటివి వీడియో ఫీచర్‌ను ఉపయోగించి ఇన్‌స్టాగ్రామ్‌లో తన ఆలోచనలను పంచుకుంటున్నది. కథలు కూడా చెబుతున్నది. పదేళ్ల పైబడిన పిల్లల కోసం గతవారం నుంచి ఈ-తరగతులను కూడా మొదలెట్టింది. ప్రస్తుతం హైదరాబాద్, ముంబై నుంచి విద్యార్థులు ఈమె చెప్పే కథలు, పాఠాల కోసం వేచి చూస్తున్నారు. త్వరలోనే కొత్త బ్యాచ్‌ని కూడా ప్రారంభించే ఆలోచనలో ఉంది నందిని.
మధ్యప్రదేశ్‌లో పుట్టి, పెరిగింది నందిని. ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నది. కథ చెప్పడంలో ఏముందని అనిపించొచ్చు. కానీ అది చాలా కష్టమంటున్నది. అది కూడా పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలంటే రచయితలకు క్రమశిక్షణ అవసరమంటున్నది. 'చాలామంది పిల్లలు కథ ప్రారంభం, ముగింపు మాకు తెలుసు, కానీ మధ్యలో ఏమి జరుగుతుందో మాకు తెలియదు అంటూ వివిధ ప్రశ్నలతో నా వద్దకు వస్తారు' అంటుంది నందిని. ఈ ప్రశ్నలకు ఆమె పిల్లలతోనే సమాధానాలు చెప్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నది. పిల్లలకు నేర్పించడం నుంచి తాను కొత్త విషయాలను నేర్చుకోవాలనే ఆలోచనలు వస్తాయంటున్నది. ఆమె డైరీ-రైటింగ్ కళ వైపు పాల్గొనేవారిని ప్రోత్సహిస్తుంది. ఆమె గురించి మరింత తెలుసుకోవడానికి nandininayar.in ని చూడండి.

# అల్లరి




**టీచర్:** రాముా.. అక్బర్ ఎక్కడ నుంచి ఎక్కడ వరకు పరిపాలించాడో చెప్పు?
**రాము:** 14 నుంచి 17వ పేజీ వరకు టీచర్!

***

'ఈ రోజుల్లో పెద్దవాళ్లంటే కొంచెం కూడా భయమూ, భక్తీ లేకుండా పోయాయి' అంటూ గొణుక్కుంది తల్లి.
'పిల్లలు దేవునితో సమానమని నువ్వే కదా! చెప్పావు. అందుకే పిల్లలంటేనే పెద్దవాళ్లకి భయం, భక్తీ ఉండాలి' అని చెప్పాడు గడుసరి కొడుకు.

కథ

## ప్రియమైన మనిషి..

**ఒకరోజు** అక్బరు చక్రవర్తికి రాణిపై చాలా కోపం వచ్చింది. ఆ కోపంలో ఆయన రాణిని పుట్టింటికి వెళ్లిపోమన్నాడు. ఇంకెప్పుడూ తిరిగి రావద్దని ఆజ్ఞాపించాడు. అక్బరు కోపం పోగొట్టడానికి ఆ రాణి ఎంతో ప్రయత్నించింది. కాని, ఆయన మాటలు వినే స్థితిలో లేడు. ఏం చేయాలో తోచక రాణి బీర్బల్‌కు కబురు పంపింది. బీర్బల్ వచ్చాక జరిగినదంతా చెప్పి ఆ సంకటంలోంచి తనను గట్టెక్కించాలని అడిగింది. బీర్బల్ ఆమెను ఓదార్చి, ఒక ఉపాయం చెప్పాడు. అది విన్న రాణి మనసు కొంత కుదుటపడింది. ఆ తర్వాత కోపంతో ఉన్న అక్బరు దగ్గరకి వెళ్ళి 'ప్రభూ.. మీ ఆదేశానుసారం నేను రేపు ఈ కోటను వదిలి వెళుతున్నాను. మీరు అనుమతి ఇస్తే నాకు ప్రియమైంది నాతో తీసుకువెళ్ళాలి అనుకుంటున్నాను'అని వినయంగా చెప్పింది. 'ఈ కోట నుంచి నీకేం కావాలో అది తీసుకువెళ్ళు' అని జవాబిచ్చాడు అక్బరు. ఆ మరునాడు రాణి తన ప్రయాణానికి సిద్ధం అయ్యింది. అప్పుడు బీర్బల్ అక్బర్ దగ్గరకు వెళ్ళి 'ప్రభూ.. రాణీగారు కోటను వదిలి వెళ్ళి పోవాలనుకుంటున్నారు. కాని వారికి ప్రియమైన వస్తువు ఒకటి ఉందని, అది లేనిదే వెళ్ళలేన'ని అంటున్నారు అని చెప్పాడు. 'తనకేం కావాలో అది తీసుకొని తక్షణం ఇక్కడి నుంచి వెళ్ళిపోమని చెప్పు' అన్నాడు అక్బరు. 'అలాగే జహాపనా.. ఆవిషయంలోనే వారు మిమ్మల్ని కలవాలనుకుంటున్నారు' వినయంగా చెప్పాడు బీర్బలు. రమ్మని చెప్పి ఆదేశించాడు అక్బరు. రాణి సరాసరి అక్బరు ముందు నిలబడి 'ప్రభూ.. మీరు నా ప్రియమైన వారు నాతో తీసుకెళ్ళవచ్చని అనుమతి ఇచ్చారు. మీరు నాతో కలిసి మా పుట్టింటికి రండి అని ప్రార్థిస్తున్నాను. మీకంటే ప్రియమైనది ఈ ప్రపంచంలో నాకు ఇంకొకటి లేదు' అంది రాణి వణికే కంఠంతో. రాణి మాటలు వినగానే కోపం ఒక్కసారిగా చల్లారింది. రాణి తనను ఎంతగానో ప్రేమిస్తోందన్న విషయాన్ని గ్రహించాడు. ఈ తెలివైన ఆలోచన ఎవరిదో అక్బరుకు తెలుసు. అందుకే నవ్వుతూ బీర్బల్ వైపు చూశాడు.





పద్యం

**విద్యలేని వాడు విద్యాధికుల చెంత**
**నుండినంత పండితుండు కాడు**
**కొలని హంసలకడం గొక్కెర యున్నట్టు**
**విశ్వదాభిరామ వినురవేమ**

కొలనులో హంసల మధ్య కొంగ ఉంటే దాని జాతి బేధం కనిపించినట్లే.. విద్యావంతుల మధ్య అవివేకి ఉన్నా సులభంగానే గుర్తించవచ్చు.

దారి కనుక్కోండి



బంతుల దగ్గరకు వెళ్లడానికి మూడు వేర్వేరు దారులు ఉన్నాయి. కనుక్కోండి

**చదరంగంలో ఉండే ఈ పావుల పేర్లు గుర్తుపట్టండి**



**జవాబులు**
చదరంగంలో ఉండే ఈ పావుల పేర్లు
1. రాజు 2. మంత్రి 3. ఒంటె 4. గుర్రం 5. ఏనుగు 6. బటుడు

చుక్కలు కలుపండి



## కిడ్డీ బ్యాంక్ తెరిచి.. శానిటైజర్లు పంచి





**పిల్లలూ!** కరోనా వ్యాపించకుండా అందరూ ఇంట్లోనే ఉంటున్నారు కదా. కానీ అత్యవసర పనుల్లో ఉండే కొందరు డాక్టర్లు, పోలీసులు, కార్మికులు, రిపోర్టర్లు తీరిక లేకుండా విధులు నిర్వహిస్తున్నారని తెలుసు కదా. వీళ్లు బయటకు వచ్చినప్పుడు ఎన్నో జాగ్రత్తలు తీసుకొని వస్తారు. అట్లాగే ఈ వైరస్‌కు సంబంధించిన వార్తలను అందించే రిపోర్టర్లు కూడా నిత్యం బయట ఉండాల్సి వస్తుంది. కాబట్టి వీళ్లకు కూడా శానిటైజర్లు, మాస్కులు అందించాలి. అందుకే మీలాంటి చిన్నారికి ఓ ఆలోచన వచ్చింది. జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన కట్కూరి అంజన రిపోర్టర్లకు శానిటైజర్లను అందించాలనుకుంది. వెంటనే వాళ్ల డాడీకి విషయం చెప్పింది. సంతోషించిన డాడీ 'సరే ' అన్నాడు. దీంతో శానిటైజర్లు కొనడానికి అంజన తన కిడ్డీ బ్యాంకును పగుల గొట్టింది. అందులో సుమారు ఆరు వేల రూపాయలు జమ అయ్యాయి. రెండు సంవత్సరాల నుంచి పోగు చేసుకుంటున్న ఈ డబ్బుతో శానిటైజర్ కిట్లను కొన్నది. వీటిని స్థానిక ప్రింట్, ఎలక్ట్రానిక్ రిపోర్టర్లకు పంచింది. ఒక్కొక్కరికి ఒక శానిటైజర్, హ్యాండ్ గ్లౌజ్, మూడు ఫేస్ మాస్కులు, ఒక సబ్బును కిట్ రూపంలో అందించింది. ఒక్కో కిట్టు ధర రూ. రెండు వందలు ఉంటుంది. మొత్తం ముప్పయి మంది రిపోర్టర్లకు అందించింది. అంజన ఐదో తరగతి చదువుతున్నది. ఎప్పుడూ సాయం చేయడానికి ఫ్రెండ్స్‌తో 'స్నేహాలయ లిటిల్ స్టార్స్' అనే చిన్న టీమ్‌తో కలిసి పని చేస్తున్నది అంజన. కాబట్టి..పిల్లలూ.. మీరు కూడా అంజన లాగే ఇతరులకు తోచిన సహాయం చేయడానికి ఎప్పుడూ ఉత్సాహంగా ఉండాలి.

పదాలు రాయండి




# చిత్రం



కృష్ణంరాజు, శ్యామలాదేవి

## త్యాగం వెలకట్టలేనిది

'**క**రోనా మహమ్మారి సృష్టించిన విపత్కర పరిస్థితులను అధిగమిండానికి వైద్య సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, పోలీసులతో పాటు అనేక శాఖల వారు అహర్నిశలు శ్రమిస్తున్నారు. వారి త్యాగం, కష్టం వెలకట్టలేనిది' అని అన్నారు సీనియర్ నటుడు కృష్ణంరాజు. ప్రధానమంత్రి సహాయనిధికి కృష్ణంరాజు తన భార్యా పిల్లలతో కలిసి పది లక్షలు విరాళంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ 'మా ముగ్గురు అమ్మాయిల పాకెట్‌మనీ నుంచి ఆరు లక్షలు, నా భార్య శ్యామలదేవి నాలుగు లక్షల రూపాయల్ని ప్రధాన మంత్రి సహాయనిధికి వితరణగా అందించారు. కరోనా విపత్తును ఎదుర్కొనే పోరాటంలో మా కుటుంబం మొత్తం పాల్గొంటున్నందుకు సంతోషంగా, గర్వంగా ఉంది' అని తెలిపారు.

## నరేష్ 11లక్షల విరాళం



**లా**క్‌డౌన్ కారణంగా ఆర్థిక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్న కార్మికులకు ఆపన్నహస్తం అందిస్తూ సేవాతత్పరతను చాటుకుంటున్నారు సినీ తారలు. విరాళాలతో పాటు నిత్యవసర సరుకుల్ని అందిస్తూ ఆదుకుంటున్నారు. మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడు వీకే నరేష్ 'మా'లోని కొంత మంది సభ్యులకు 10లక్షల విరాళాన్ని అందించబోతున్నారు. వందమంది కుటుంబాలను దత్తత తీసుకొని ఒక్కో కుటుంబానికి పదివేల చొప్పున మొత్తం 10లక్షల ఆర్థికసహాయం చేయాలని నిర్ణయించుకున్నారు. వారిలో 'మా' సర్వే చేయించిన 58 మంది సభ్యులకు ఇప్పటికే వారి బ్యాంక్ అకౌంట్‌లో పదివేల చొప్పున డిపాజిట్ చేసినట్లు నరేష్ చెప్పారు. దీనితో పాటు సినీ కార్మికుల్ని ఆదుకోవడానికి చిరంజీవి చైర్మన్‌గా ఏర్పాటైన కరోనా క్రైసిస్ చారిటీ (సీసీసీ)కి లక్ష రూపాయల విరాళం అందజేస్తున్నట్లు నరేష్ ప్రకటించారు.

## లక్ష కుటుంబాలకు సాయం



అమితాబ్ బచ్చన్

**క**రోనా విలయతాండవంతో పస్తులతో జీవితాల్ని వెళ్లదీస్తున్న సినీ కార్మికులకు బాలీవుడ్ దిగ్గజం అమితాబ్‌బచ్చన్ బాసటగా నిలిచారు. ఆల్ ఇండియా ఫిల్మ్ ఎంప్లాయిస్ కాన్ఫెడరేషన్‌కు చెందిన లక్ష కార్మిక కుటుంబాలకు నెలవారి సరుకుల్ని అందివ్వనున్నారు. మనమంతా ఒక్కటే అనే నినాదంతో దేశవ్యాప్తంగా సినీ, టీవీ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రతి నెల నిత్యవసర సరుకుల్ని అందజేయనున్నారు. అమితాబ్‌బచ్చన్ సారథ్యంలో సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా, కల్యాణ్ జ్యూవెలర్స్ సహకారంతో ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగించబోతున్నారు. ఈ వితరణలో భాగంగా సినీ కార్మికులకు డిజిటల్ బార్‌కోడ్ కూపన్స్ అందిస్తాం. వాటి ద్వారా ఆమోదిత సూపర్‌మార్కెట్స్, గ్రాసరీ స్టోర్స్ నుంచి కార్మికులు సరుకుల్ని పొందవచ్చు' అని సోనీ పిక్చర్స్ ప్రతినిధి తెలిపారు.

## మాస్టర్ చెఫ్ పూజ

**క్వా**రంటైన్ టైమ్‌లో ఇంటికే పరిమితమైన కథానాయికలంతా ఈ విరామంలో తమలోని కొత్త కళలకు మెరుగులు దిద్దుతున్నారు. తాజాగా పూజాహెగ్డే చెఫ్‌గా అవతారమెత్తింది. క్యారెట్‌హల్వాను తయారు చేస్తున్న ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. తనను తాను మాస్టర్‌చెఫ్‌గా అభివర్ణిస్తూ పూజా హెగ్డే పెట్టిన ఈ పోస్ట్ అభిమానుల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది. తన తల్లిదండ్రులకు ఈ హల్వా రుచిచూపించినట్లు ఆమె చెప్పింది. తాను వంటలో చక్కటి ప్రావీణ్యం సంపాదించడం పట్ల వారు హ్యాపీగా ఫీలవుతున్నారని పూజాహెగ్డే తెలిపింది. ముఖ్యంగా అమ్మకు తన స్వీట్ బాగా నచ్చిందని చెప్పింది. లాక్‌డౌన్ ముగిసేలోపు పాకశాస్త్రంలో మరింత పరిపూర్ణత సాధిస్తానని చెబుతోంది. ప్రస్తుతం పూజాహెగ్డే తెలుగులో ప్రభాస్‌తో ఓ సినిమా చేస్తోంది. జార్జియా షెడ్యూల్‌ను ముగించుకొని ఇండియాకు వచ్చిన పూజాహెగ్డే పద్నాలుగు రోజులు స్వీయ నిర్బంధాన్ని పాటించింది.



పూజా హెగ్డే

## వంద మిలియన్ల వ్యూస్

**యాం**కర్ ప్రదీప్ మాచిరాజు కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం '30 రోజుల్లో ప్రేమించడం ఎలా?'. మున్నా దర్శకుడు. ఎస్వీ ప్రొడక్షన్స్ పతాకంపై ఎస్వీ బాబు నిర్మిస్తున్నారు. అమృత అయ్యర్ కథానాయిక. ఈ సినిమాలోని 'నీలి నీలి ఆకాశం..' పాటను చిత్రబృందం ఇటీవల విడుదలచేసింది. ఈ పాటకు సోషల్‌మీడియాలో వంద మిలియన్ల వ్యూస్ లభించాయి. నిర్మాత మాట్లాడుతూ 'అనూప్ రూబెన్స్ వీనుల విందైన బాణీలకు చంద్రబోస్ చక్కటి సాహిత్యాన్ని అందించారు. సిధ్ శ్రీరామ్, సునీత సుమధుర గాత్రం ఆకట్టుకుంటున్నది. చిన్న సినిమాలోని పాటకు పెద్ద స్థాయిలో ఆదరణ లభించడం ఆనందంగా ఉంది. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. కరోనా సంక్షోభ పరిస్థితులు సమసిపోయిన తర్వాత సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం. జీఏ-2, యూవీ క్రియేషన్స్ సంస్థలు చిత్రాన్ని విడుదల చేయనున్నాయి' అని తెలిపారు. శివన్నారాయణ, హేమ, పోసాని కృష్ణ మురళి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: దాశరథి శివేంద్ర, సాహిత్యం:చంద్రబోస్.



ప్రదీప్, అమృతఅయ్యర్

## రాజీవ్ కనకాల సోదరి కన్నుమూత

**ది**వంగత నటుడు, దర్శకుడు దేవదాస్ కనకాల కుమార్తె, టీవీ నటి శ్రీలక్ష్మి (40) సోమవారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. గత కొంతకాలంగా బ్రెస్ట్ క్యాన్సర్‌తో పాటు కామెర్ల వ్యాధితో బాధపడుతున్నారామె. తల్లిదండ్రుల వద్ద నటనలో శిక్షణ పొందారు శ్రీలక్ష్మి. తండ్రి దర్శకత్వంలో వచ్చిన రాజశేఖర చరిత్ర సీరియల్‌తో ఆమె నట జీవితం ప్రారంభమైంది. అగ్నిపూలు, చిన్నారి, రుతు గీతం, సూపర్‌మామ్ సీరియల్స్ ఆమెకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి. ఆమె భర్త పెద్ది రామారావు పాత్రికేయుడిగా పనిచేస్తున్నారు. శ్రీలక్ష్మి, రామారావు దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. శ్రీలక్ష్మి సోదరుడు రాజీవ్ కనకాల నటుడిగా రాణిస్తున్నారు. జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో శ్రీలక్ష్మి అంత్యక్రియల్ని కుటుంబ సభ్యులు నిర్వహించారు.



శ్రీలక్ష్మి

## తమ్మారెడ్డి భరద్వాజకు మాతృవియోగం

**ద**ర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ తల్లి కృష్ణవేణి(94) సోమవారం కన్నుమూశారు. గత రెండు నెలలుగా తన తల్లి అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారని భరద్వాజ తెలిపారు. కరోనా వ్యాప్తి దృష్ట్యా తనను పరామర్శించడానికి ఎవరూ ఇంటికి రావద్దని ఆయన కోరారు. కృష్ణవేణి భర్త కృష్ణమూర్తి నిర్మాతగా లక్షాధికారి, జమీందారు, బంగారు గాజులుతో పాటు పలు విజయవంతమైన చిత్రాల్ని నిర్మించారు. వామపక్ష భావజాలమున్న కుటుంబం వీరిది. తమ్మారెడ్డి భరద్వాజను సీనియర్ హీరో చిరంజీవి పరామర్శించారు. సినిమా ఒక మజిలీ, సమ సమాజం తమ అంతిమ లక్ష్యమనే ఆలోచనతో కృష్ణమూర్తి కుటుంబం తెలుగు సినిమా పరిశ్రమకు ఇతోధిక సేవలందించిందని చిరంజీవి అన్నారు.



కృష్ణవేణి







# సఫాయిలకు సలాం..

# వైద్యులకు వందనం

- కరోనా కట్టడిలో కీలకపాత్ర పోషిస్తున్నారంటూ ముఖ్యమంత్రి అభినందనలు
- సేవలకు ప్రోత్సాహకాలు
- పూర్తిస్థాయి వేతనాలు
- కేసీఆర్ నిర్ణయంపై హర్షాతిరేకాలు





**ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి మానవీయత చాటుకున్నారు. కరోనా కట్టడిలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తిస్తున్న వైద్య, ఆరోగ్య, పారిశుధ్య సిబ్బందిని అభినందించడమే కాదు, దేశంలోనే ఎక్కడా లేని విధంగా ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించారు. ఆ రెండు విభాగాల సిబ్బందికి పూర్తిస్థాయి వేతనాలతోపాటు అదనంగా చెల్లించాలని ఆదేశించగా, సంబంధిత వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రత్యేక పరిస్థితుల్లోనూ సీఎం తీసుకున్న నిర్ణయంపై ప్రజల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.**

*- కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ*

ప్రస్తుతం కరోనా పేరు వింటేనే ప్రతి ఒక్కరూ జంకుతున్నారు. సొంత కుటుంబసభ్యులే ఒకరినొకరు కలుసుకోవడానికి, దగ్గరుండి మాట్లాడుకోవడానికి సందేహిస్తున్నారు. ఇక పక్కింటి వాళ్లనయితే ఇళ్లలోకి రానీయడం లేదు. అలాంటిది వైద్యులు మాత్రం.. కరోనా పాజిటివ్ వచ్చిన వారికి సైతం నిర్విరామంగా సేవలందిస్తున్నారు. క్వారంటైన్‌లో ఉన్న వారందరినీ తమ కంటికి రెప్పలా చూస్తున్నారు. పరిస్థితులు ఎలా ఉన్నా తమ వద్దకు వచ్చిన వ్యక్తుల్లో మనోధైర్యం నింపుతూ, రోగాలను తగ్గిస్తూ తిరిగి ఇండ్లకు పంపిస్తున్నారు. వీరి సేవలను గుర్తించి, 'వైద్యులూ మీకు వందనం' పేరిట 'నమస్తే తెలంగాణ' కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ తాజాగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యుల సేవలను కొనియాడారు. ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న వైద్య సిబ్బందికి పూర్తిస్థాయి వేతనం అందిస్తామని, సేవలకు గుర్తింపుగా గ్రాస్ వేతనంపై పది శాతం ప్రోత్సాహకంగా ఇస్తామని శుభవార్త చెప్పారు. వైద్యసిబ్బందితోపాటే పారిశుధ్య కార్మికులనూ ప్రశంసించారు. మీ సేవల గురించి ఎంత చెప్పినా తక్కువేనని చెప్పారు. ప్రత్యేక ప్రోత్సాహకం కింద మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో కార్మికులకు తలో ₹5వేలు ఇస్తున్నట్లుగా ప్రకటించారు. 'సఫాయి అన్నా నీకు సలాం. మీరు కరోనా నుంచి కాపాడుతున్నారు. ఇదే స్ఫూర్తితో పనిచేయండి. మిమ్మల్ని గుండెల్లో పెట్టుకొని చూసుకుంటాం' అంటూ పిలుపునిచ్చారు. ఇలా కష్టకాలంలో పనిచేసే వారిని గుర్తించడం ఒక ఎత్తయితే.. వారికి ప్రత్యేక ప్రోత్సాహకం అందించడం ముఖ్యమంత్రి మానవీయ కోణానికి నిదర్శనమని పలువురు అభివర్ణిస్తున్నారు. దేశంలో ఈ తరహా నిర్ణయం బహుశా ఎవరూ తీసుకొని ఉండకపోవచ్చని చెబుతున్నారు. సీఎం నిర్ణయంపై వైద్య సిబ్బంది, సఫాయి కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆపత్కాలంలోనూ కేసీఆర్ అండగా నిలుస్తున్నారని, రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తామని సంబురంగా చెబుతున్నారు.

### మా కష్టాన్ని గుర్తించారు..



ఇది నిజంగా మాకు ఎంతో సంతోషంగా ఉంది. మా కష్టాన్ని సీఎం కేసీఆర్ సార్ గుర్తించారు. ఇలాంటి ప్రోత్సాహం ఉంటే మరింత కష్టపడి పనిచేసేందుకు ఉత్సాహం వస్తుంది. కరోనా నివారణ జరిగేంత వరకూ నగరంలో పరిశుభ్రత కోసం పాటుపడుతాం.

**- వెంకన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ (కరీంనగర్ కార్పొరేషన్)**

### ఆనందంగా ఉంది..



మాకు సీఎం సార్ జీతంతోపాటు అదనంగా ₹ఐదు వేలు ఇస్తామనడం ఆనందంగా ఉంది. ప్రతిరోజూ రోడ్లపై పారిశుధ్య పనులు చేస్తున్నాం. కానీ, ఎప్పుడు ఇలాంటి పరిస్థితులను చూడలేదు. ఇప్పుడు సీఎం సార్ అదనంగా డబ్బులు ఇవ్వడం సంతోషంగా ఉంది.

**- కనకయ్య, పారిశుధ్య కార్మికుడు (కరీంనగర్ కార్పొరేషన్)**

### గర్వంగా ఉన్నది..



నేను 22ఏళ్ల నుంచి పారిశుధ్య కార్మికురాలిగా పని చేసున్నా. కరోనా కట్టడికి మేము ప్రాణాలకు తెగించి పారిశుధ్య పనులు చేస్తున్నాం. మా కష్టాన్ని, పనిని సీఎం కేసీఆర్ సారు గుర్తించి రూ.5వేల బహుమతి ప్రకటించారు. మాకు గర్వంగా ఉన్నది.

**- కొత్తూరి మల్లు, పారిశుధ్య కార్మికురాలు (చెన్నూర్)**

### మరిచిపోలేం..



మాకు జీతంతోపాటు ప్రోత్సాహకం ప్రకటించడం సంతోషంగా ఉంది. మేం ఇన్నాళ్లు పడుతున్న కష్టాన్ని సీఎం సార్ గుర్తించారు. ఇప్పటికే మేం పని చేస్తున్న ప్రాంతాల్లోని ప్రజలు, నాయకులు మమ్మల్ని ఎంతో గొప్పగా చూస్తున్నారు. ప్రస్తుతం సీఎం కేసీఆర్ సార్ కూడా మా సేవలను కొనియాడడం మరిచిపోలేం.

**- సంజీవ్, శానిటరీ జవాన్ (కరీంనగర్ కార్పొరేషన్)**

### మీ ప్రోత్సాహమే మా ధైర్యం..



నెల రోజులుగా కరోనా బాధితులకు ధైర్యాన్ని అందిస్తూ వైద్య సేవలందిస్తున్నాం. మా సేవలను గుర్తించిన సీఎం కేసీఆర్ సార్‌కు ధన్యవాదాలు. మీ ప్రోత్సాహమే మాకు కొండంత ధైర్యం. ప్రాణాలకు తెగించి వైద్య సేవలందిస్తున్నాం. ఎన్నో రోజులుగా కుటుంబాలకు దూరంగా ఉంటూ సేవలు చేస్తున్న తమను గుర్తించిన ప్రభుత్వాన్ని మరువలేం.

**- జనగామ సులోచన, ఇన్‌చార్జి నర్సింగ్ సూపరింటెండెంట్ (కరీంనగర్ హెల్త్)**

### వెన్నుదన్నుగా నిలుస్తున్నారు..



కరోనాను నియంత్రించేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టింది. ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అత్యంత బాధ్యతగా ఉద్యోగులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన ప్రోత్సాహం ఉద్యోగులందరిలో ఆనందాన్ని నింపింది.

**- ఎన్ శ్రీనివాస్ కర్ణ, తెలంగాణ వైద్య ప్రజా ఆరోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు (కరీంనగర్ హెల్త్)**

### ఇంకా బాగా పనిచేస్తాం..



చేస్తున్న పనికి అదనంగా డబ్బులు ఇస్తానని చెప్పిన సీఎం కేసీఆర్ సర్‌కు కృతజ్ఞతలు. మాకు జీతంతోపాటు మరింత డబ్బులు ఇస్తామని చెప్పడం ఆనందంగా ఉంది. మేము ఇంకా బాగా పని చేస్తాం.

**- రాములు శంకరమ్మ, పారిశుధ్య కార్మికురాలు (కరీంనగర్ కార్పొరేషన్)**

### ఆత్మస్థైర్యాన్ని నింపింది..



వైద్య సిబ్బంది ప్రాణాలు ఫణంగా పెట్టి పని చేస్తున్నారు. ఈ సమయంలో వైద్య, ఆరోగ్య సిబ్బందికి వేతనాల్లో 10 శాతం ప్రోత్సాహకం (బోనస్) ఇవ్వాలని సీఎం నిర్ణయించడం అభినందనీయం. ఇది వైద్యులు, వైద్య సిబ్బందిలో మరింత బాధ్యతను పెంచింది. సీఎం ప్రకటన మాలో ఎంతో ఆత్మస్థైర్యాన్ని నింపింది.

**-లింగ రామ్మోహన్, ఆరోగ్య విస్తరణాధికారి (కథలాపూర్)**

### బాధ్యతగా పనిచేస్తున్నాం..



కరోనా వైరస్ వ్యాప్తి నిరోధానికి మేం బాధ్యతగా పనిచేస్తున్నాం. జిల్లా దవాఖానలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఐసోలేషన్ వార్డులో కరోనా అనుమానితులకు వైద్య సేవలందిస్తున్నాం. మమ్మల్ని ప్రభుత్వం గుర్తించడం సంతోషంగా ఉంది. వైద్య సిబ్బందికి గ్రాస్ సాలరీ పెంచుతున్నామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నాం.

**- మురళీధర్‌రావు, సూపరింటెండెంట్ (సిరిసిల్ల టౌన్)**

### మరింత కష్టపడతాం..



ముఖ్యమంత్రి వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులకు పూర్తి స్థాయి వేతనం ఇస్తామనడం, అలాగే, పదిశాతం గ్రాస్ సాలరీ బహుమానంగా ప్రకటించడం మానసికంగా మరింత ఉత్తేజపరిచింది. కరోనా మహమ్మారి కట్టడిలో మరింత చురుగ్గా పని చేసేందుకు దోహదపడుతుంది. ఇకనుంచి మరింత కష్టపడుతాం.

**- మంచాల రవీందర్, టీఎన్జీవోస్ మెడికల్ హెల్త్ ఫోరం జిల్లా అధ్యక్షుడు (కరీంనగర్ హెల్త్)**

### కేసీఆర్ సార్‌కు రుణపడి ఉంటాం..



వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులను గుర్తించి, పదిశాతం గ్రాస్ సాలరీ బహుమానంగా ప్రకటించినందుకు సీఎం సార్‌కు రుణపడి ఉంటాం. గత ప్రభుత్వాలు వెట్టిచాకిరీ చేయించుకున్నా ఎప్పుడు గుర్తింపు ఇవ్వలేదు. అలాంటిది ఇప్పుడు తమకు ఆత్మస్థైర్యం కల్పిస్తూ సమాజంలో ప్రత్యేక గుర్తింపు నివ్వడం మర్చిపోలేం.

**- అఫ్తాబ్ అహ్మద్ ఖాన్, ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు (కరీంనగర్ హెల్త్)**

### మర్చిపోలేను..



ప్రత్యేక పరిస్థితుల్లో పనిచేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బందిని మెచ్చుకుంటూ సీఎం కేసీఆర్ మాలో ఎంతో స్ఫూర్తినింపారు. ఇది మా బాధ్యత అయినప్పటికీ మా సేవలను గుర్తించి అభినందించడం ఎంతో సంతోషంగా ఉంది. దానికి తోడు వైద్యులకు, వైద్య సిబ్బందికి చేతులెత్తి నమస్కరిస్తున్న అని కీర్తించడం మర్చిపోలేను.

**- మందల వాసుదేవరెడ్డి, డీసీహెచ్‌ఎస్ (పెద్దపల్లి)**

# ఎన్టీపీసీ.. గొప్ప మనసు

- ₹16లక్షలతో 4,500 మంది వలస కార్మికులకు నిత్యావసరాలు పంపిణీ



కార్మికులకు నిత్యావసర సామగ్రిని అందజేస్తున్న ఎన్టీపీసీ ఈడీ

**జ్యోతినగర్:** ప్రభుత్వ రంగ విద్యుదుత్పత్తి సంస్థ ఎన్టీపీసీ తన గొప్ప మనసును చాటుకున్నది. టీఎస్టీపీపీ (తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్) నిర్మాణ పనులు చేసే వలస కార్మికులకు ఏ లోటూ లేకుండా చూసుకుంటున్నది. మొత్తం 4500 మంది కార్మికులకు ₹16లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన బియ్యం, పప్పు, తదితర నిత్యావసర వస్తువులను సోమవారం టీఎస్టీపీపీ కార్యాలయ ఆవరణలో ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్‌కుమార్ పంపిణీ చేశారు. ఇక్కడ టీఎస్టీపీపీ సీజీఎం ప్రేమ్ ప్రకాశ్, ఏజీఎం హెచ్‌ఆర్ అనిల్‌కుమార్ జాడ్లీ, సీఎస్ఆర్ ఏజీఎం రఫీక్ ఉల్‌ఇస్లాం, అధికారులు ఉన్నారు.













# స్వీయ నిర్బంధం పాటించాలి

- రైతులు టోకెన్ల పద్ధతిలోనే సెంటర్లకు ధాన్యాన్ని తేవాలి
- రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్
- ధర్మపురిలో యాచకులు, వలస కూలీలకు భోజనం వడ్డించిన అమాత్యుడు
- ధర్మారం, వెల్గటూర్‌లో అధికారులతో సమీక్ష
- రోడ్డెక్కితే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం

**ధర్మపురి, నమస్తే తెలంగాణ/ ధర్మారం:** ప్రభుత్వం సూచించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, స్వచ్ఛందంగా నిర్బంధం ఉండాలని, అప్పుడే కరోనా కట్టడి అవుతుందని రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. కరోనా నియంత్రణకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టిందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. సోమవారం ఆయన ధర్మపురి నియోజకవర్గంలో పర్యటించారు. ముందుగా ధర్మపురిలో తిరిగారు. ఎల్‌ఎం కొప్పుల ట్రస్ట్ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, యాచకులు, వలస కూలీలకు భోజనం వడ్డించారు. ఆ తర్వాత పట్టణంలోని మురుగునీరు గోదావరిలో కలువకుండా నిర్మిస్తున్న మహా మురుగుకాలువ పనులను పరిశీలించారు. అనంతరం వెల్గటూర్ మండల పరిషత్ కార్యాలయంతోపాటు ధర్మారం మండల పరిషత్ కార్యాలయంలో కరోనా నియంత్రణ చర్యలు, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అధికారులతో వేర్వేరుగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల మాట్లాడారు. ధర్మపురిలో ఉండే వలస కూలీలే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ర్టాలకు జీవనోపాధి కోసం వెళ్లి చిక్కుకున్న మన ప్రాంత కూలీలు పస్తులుండకుండా గూగుల్‌పే ద్వారా వారికి డబ్బులు పంపుతూ, వారి క్షేమ సమాచారాలు నిత్యం తెలుసుకుంటున్నట్లు చెప్పారు. లాక్‌డౌన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని, అనవసరంగా రోడ్డెక్కేవారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉండేలా చూడాలని, గ్రామాల్లో పారిశుధ్య చర్యలను ముమ్మరం చేయాలని సూచించారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ ఉద్యోగులకు మాస్కులు, శానిటైజర్లను పంపిణీ చేయాలన్నారు. ధాన్యం కొనుగోళ్ల క్రమ పద్ధతిలో నిర్వహించాలని, టోకెన్ల ఆధారంగానే ధాన్యాన్ని తేవాలని రైతులకు సూచించారు. అనంతరం వెల్గటూర్ మండలం ఎండపల్లి గ్రామానికి చెందిన ముస్కు రాజిరెడ్డి, గుర్రం అజయ్‌రెడ్డి గతేడాది అక్టోబర్ 7న ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందగా వారి కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున పరిహారం చెక్కులను అందజేశారు. వేర్వేరుగా నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, ఆర్డీవో నరేందర్, జడ్పీటీసీలు బాదినేని రాజేందర్, బత్తిని అరుణ, పూస్కూరు పద్మజ, బొడ్డు సుధారాణి, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ సలామొద్దీన్, ఎంపీపీ లక్ష్మి, సర్పంచ్, ఎంపీటీసీల ఫోరం ధర్మారం మండలాధ్యక్షులు పూస్కూరు జితేందర్‌రావు, మిట్ట తిరుపతి ఏఎంసీ చైర్మన్లు అయ్యోరి రాజేశ్‌కుమార్, గుర్రం మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పాక్స్ చైర్మన్లు ముత్యాల బలరాంరెడ్డి, నోముల వెంకట రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, తాసిల్దార్లు రాజేందర్, సంపత్, ఎంపీడీవో సంజీవరావ్, విద్యుత్‌శాఖ ఏడీ జోహర్‌లాల్‌నాయక్, మిట్ట తిరుపతి తదితరులు ఉన్నారు.

# ప్రతి గింజా కొంటాం

- నిర్దేశించిన తేదీల్లో ధాన్యం తీసుకురావాలి
- కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లూ చేశాం
- ప్రతి ఒక్కరూ సామాజిక దూరం పాటించాలి
- మంత్రి గంగుల కమలాకర్
- జిల్లాలో పలుచోట్ల కొనుగోలు కేంద్రాల ప్రారంభం



*గంగాధరలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గంగుల*

**కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ/గంగాధర/ కరీంనగర్ రూరల్ :** ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ప్రతి ధాన్యం గింజనూ కొంటామని, రైతులు నిర్దేశించిన తేదీల్లోనే ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. గంగాధరతోపాటు కొండాయపల్లి, కురిక్యాల గ్రామాల్లో ధాన్యం, కొత్తపల్లి మండలం మల్కాపూర్‌లో మక్కల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల మాట్లాడారు. జిల్లాలో 2.19 లక్షల ఎకరాల్లో వరి సాగైందని, 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనేందుకు పౌర సరఫరాల శాఖ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. కరోనా నేపథ్యంలో ఊరికో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కేంద్రాల వద్దకు ధాన్యం, మక్కలు తెచ్చే రైతులు తప్పనిసరిగా సామాజిక దూరాన్ని పాటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి కేంద్రం వద్ద శానిటైజర్లు, సబ్బులు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. వాటితో తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని, కొనుగోళ్ల విషయంలో ఏ ఒక్క రైతూ ఇబ్బంది పడకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్ లాల్, డీసీఎమ్మెస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, కొత్తపల్లి ఎంపీపీ పిల్లి శ్రీలత, మార్క్‌ఫెడ్ చైర్మన్ మారం గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**కొనుగోళ్లు మొదలాయె..**

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ధాన్యం, మక్కల కొనుగోళ్లు మొదలయ్యాయి. మొదటి రోజు ఉత్సాహంగా సాగాయి. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల్లో, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ రాయికల్‌లో మక్క కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సైదాపూర్ మండలం గుజ్జులపల్లి, బొమ్మకల్, దుద్దెనపల్లి గ్రామాల్లో ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి మక్కల కేంద్రాన్ని, హుజూరాబాద్ మండలం పోతురెడ్డిపేటలో జడ్పీటీసీ పడిదం బక్కారెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు కొండాల్ రెడ్డి, చిగురుమామిడితోపాటు ఇందుర్తి, బొమ్మనపల్లి గ్రామాల్లో స్థానిక జడ్పీటీసీ సభ్యులు గీకురు రవీందర్, ఎంపీపీ కొత్త వినీత, జడ్పీటీసీ గీకురు రవీందర్, సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

## సీఎం సహాయనిధికి విరాళాలు ఇచ్చిన వారి వివరాలు

| | |
|---|---|
| కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు | ₹12.51 లక్షలు |
| కోలేటి దామోదర్ (పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్) | ₹10లక్షలు |
| నవతేజ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ గండ్ర యాదగిరిరావు తనయులు, డైరెక్టర్లు డాక్టర్ ప్రమోద్‌కుమార్, పవన్‌కుమార్ | ₹10లక్షలు |
| రంగినేని నవీన్, జగిత్యాల జిల్లా బాయిల్డ్ రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు | ₹2లక్షలు |
| అయోధ్యరామారావు కుటుంబ సభ్యులు | ₹లక్ష |
| జీరెడ్డి మహేందర్ రెడ్డి (ఎండపెల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు) | ₹50వేలు |
| కడారి అనంతరెడ్డి, మానేరు విద్యా సంస్థల చైర్మన్ | ₹25 వేలు |
| తంగళ్లపల్లి ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు | ₹25 వేలు |





కేటీఆర్‌కు చెక్కు అందజేస్తున్న కోలేటి దామోదర్, నవతేజ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ , ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



సీఎం సహాయనిధికి మంత్రి ఈశ్వర్‌కు చెక్కును అందజేస్తున్న రైస్‌మిల్లర్లు



కలెక్టర్ శశాంకకు చెక్కును అందిస్తున్న అయోధ్యరామరావు కుటుంబ సభ్యులు

**వెన్‌కాబ్ చికెన్ ధరలు (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 80.00 | రిటైల్ లైవ్ | 102.00 |
| డ్రెస్‌డ్ | 148.00 | స్కిన్‌లెస్ | 168.00 |

**గుడ్ల ధరలు (వందకు)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 350.00 | వరంగల్ | 353.00 |
| మెదక్ | 350.00 | కరీంనగర్ | 353.00 |
| రంగారెడ్డి | 350.00 | డజన్ ధర | 54.00 |



### హైదరాబాద్ స్టార్టప్‌ల
# నయా ట్రెండ్
## లాక్‌డౌన్ వేళ సరికొత్త ఆలోచనలతో సేవలు
### మనుగడ కోసం పరస్పర సహకారంతో ముందుకు
### నగదు నిల్వలను కాపాడుకుంటూనే విస్తరణ దిశగా పయనం

బన్ను, బిన్ను ఐఐటీ విద్యార్థులు. కొత్త ఆలోచనలతో.. నిత్యనూతన ఆవిష్కరణల కోసం ఓ స్టార్టప్‌ను ప్రారంభించారు. కానీ అంతా బాగుంది అనుకునేలోగానే కరోనా వైరస్ వారి ఆశలను ఆవిరి చేసింది. తమ ఆశయాలు, లక్ష్యాలు ఒక్కసారిగా కుప్పకూలాయా? అన్న ఆందోళన వారిలో కనిపించింది. అయితే ఈ విపత్కర పరిస్థితిని ఓ సవాల్‌గా స్వీకరించారు. మెదడుకు పదునుపెట్టి వినూత్నరీతిలో వెళ్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారు. హైదరాబాద్‌లోని చాలా స్టార్టప్‌లు ఇలాగే తమ ప్రతికూలతల్ని అనుకూలతలుగా మార్చుకుంటున్నాయిప్పుడు. లాక్‌డౌన్ వేళ సరికొత్త సేవలకు శ్రీకారం చుట్టి తమ మనుగడకు ఢోకా లేదని చాటుతున్నాయి.

**హైదరాబాద్, ఏప్రిల్ 6:** కరోనా వైరస్ కట్టడి కోసం అమలవుతున్న లాక్‌డౌన్‌తో వ్యాపారాలన్నీ మూతబడితే.. హైదరాబాద్ స్టార్టప్‌లు మాత్రం ధైర్యం కోల్పోకుండా దీన్నో అవకాశంగా మలుచుకుని రాణిస్తున్నాయి. ఈ సంక్షోభ సమయంలో కొత్తగా ఆలోచించి తమకెదురవుతున్న ఆర్థిక ఇబ్బందుల్ని జయించాలని చూస్తున్నాయి. వచ్చే ఆరు నెలలు గడ్డు కాలమేనన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూనే.. వృద్ధికి ఊతమిచ్చే ఆలోచనలతో ముందుకెళ్తున్నామన్న విశ్వాసాన్ని చాలా స్టార్టప్‌లు కనబరుస్తుండటం గమనార్హం. డిజిటల్, టెక్నాలజీ, ఉత్పాదక, శ్రామిక ఏ రకమైన స్టార్టప్‌లైనా పరస్పరం వనరులను ఇచ్చిపుచ్చుకుంటూ మనుగడను సాగిస్తుండటం విశేషం. తమ ఉద్యోగులను ఇతర స్టార్టప్‌ల అవసరాలకు వినియోగిస్తూ అటు వారినీ, ఇటు తమనూ కొన్ని స్టార్టప్‌లు పదిలంగా ఉంచుకుంటున్నాయి. గతంలో కియోస్క్‌ల ద్వారా కస్టమర్లకు సేవలు అందించిన సంస్థలు ఇప్పుడు డోర్ డెలివరీని చేపట్టాయి. నిత్యావసరాలతోపాటు ఔషధాలనూ ఇంటికే చేరుస్తున్నాయి. ఇందుకోసం ఇతర రకాల స్టార్టప్‌ల సాయంతో ముందుకెళ్తున్నాయి. ఉదాహరణకు హోటల్ ఫుడ్ డెలివరీ స్టార్టప్‌లు.. కిరాణా సరుకులను, కూరగాయలను, మందులనూ కస్టమర్లకు సరఫరా చేస్తున్నాయి.

**మమ్మల్ని ఆదుకోండి**

దేశీయ స్టార్టప్‌లను కరోనా వైరస్ షేక్ చేస్తున్నది. ఈ క్రమంలోనే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు నిర్వాహకులు లేఖలు రాస్తుండగా, సాయం అందకపోతే మూతబడటం ఖాయమన్న ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. జీఎస్టీ రిఫండ్లు, ఐటీ కోతలు, వడ్డీ లేని రుణాలను కోరుతున్నారు.

> 'ప్రతీ స్టార్టప్ తమ నగదు నిల్వలను కాపాడుకోవాలి. ఇదే సమయంలో మనుగడనూ చాటుకోవాలి. అందుకోసం స్వచ్ఛందంగా జీతాలను తగ్గించుకోవాలని ఉద్యోగులను కోరాలి. వ్యాపార అవకాశాలనూ ఇతర సంస్థలతో పంచుకోవాలి'
>
> **-అభిషేక్ దేశ్‌పాండే, రెసికల్ వ్యవస్థాపకుడు**

# రోజుకు 2,200 కోట్ల నష్టం
## రెండు నెలల్లో రూ. 1.44 లక్షల కోట్లు కోల్పోయిన ముకేశ్ అంబానీ




**ముంబై, ఏప్రిల్ 6:** స్టాక్ మార్కెట్ల పతనం దేశీయ కుబేరుల సంపాదనకు ఎసరుపెట్టింది. కరోనా వైరస్ మరింత విజృంభిస్తుండటంతో పాతాళంలోకి పడిపోయిన ఈక్విటీ మార్కెట్లతో సంపన్న వర్గాల సంపద కూడా హారతి కర్పూరంలా కరిగిపోతున్నది. గడిచిన రెండు నెలల్లోనే దేశీయ కుబేరుడైన ముకేశ్ అంబానీ ఏకంగా 19 బిలియన్ డాలర్ల సంపాదనను కోల్పోయారు. మన కరెన్సీలో ఇది రూ.1.44 లక్షల కోట్లకు సమానం. అంటే రోజుకు రూ.2,200 కోట్లకు పైగా నష్టపోయినట్లు హ్యురున్ గ్లోబల్ రిచ్ తాజాగా వెల్లడించింది. ఆయన మొత్తం సంపాదనలో ఈ వాటా 28 శాతానికి సమానం. దీంతో ప్రపంచ కుబేరుల జాబితాలో ఆయన స్థానం 7 నుంచి 17కి పడిపోయింది. మిగతా దేశీయ సంపాన్న వర్గాల్లో గౌతమ్ అదానీ(6 బిలియన్ డాలర్లు), హెచ్‌సీఎల్ టెక్ అధినేత శివ్ నాడర్(5 బిలియన్ డాలర్లు), ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కొటక్(4 బిలియన్ డాలర్లు) కోల్పోయారు. అంబానీ మినహా మిగతా ముగ్గురు టాప్-100 జాబితా నుంచి వైదొలిగినట్లు తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కరోనా వైరస్ దెబ్బకు గత రెండు నెలల్లో దేశీయ మార్కెట్లు 25 శాతం మేర నష్టపోయాయి.

## క్లెయిమ్స్ పరిష్కారాన్ని వేగిరం చేయండి

- **సంస్థలకు జీవిత బీమా మండలి ఆదేశం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6:** కరోనా వైరస్‌తో చనిపోయిన వారి క్లెయిమ్స్‌ను అత్యంత వేగంగా పరిష్కరించాలని బీమా సంస్థలకు జీవిత బీమా మండలి సోమవారం స్పష్టంచేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల పరిష్కార ప్రక్రియను వేగంగా చేపట్టాలని సూచించింది. కొవిడ్-19 డెత్ క్లెయిమ్స్‌కు ఫోర్స్‌మెజర్ నిబంధన వర్తించదని స్పష్టంచేసింది. స్పష్టత కోసం ఎంతో మంది వినియోగదారులు బీమా సంస్థల చుట్టు తిరుగుతున్నారని పేర్కొంది. ఈ నిబంధనపై వివాదాలు, వదంతులకు తావు లేదని పేర్కొంది. తమ వినియోగదారులకు ఈ విషయం వ్యక్తిగతంగా వెల్లడించాలని బీమా సంస్థలకు మండలి ఆదేశించింది. ఈ క్లిష్ట సమయంలో బీమా సంస్థలన్ని వినియోగదారులకు అండగా నిలవాలి..తప్పుడు సమాచారం తావులేకుండా చూడాలి అని బీమా మండలి సీజీ భట్టాచార్య తెలిపారు.

## 'కెనరా'వడ్డీరేట్ల తగ్గింపు

**ముంబై, ఏప్రిల్ 6:** ప్రభుత్వరంగ సంస్థ కెనరా బ్యాంక్..రెపో లింక్డ్ లెండింగ్ రేటు (ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్)ను 75 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నెల 7 నుంచి అమలులోకి రానున్న ఈ వడ్డీరేటు 7.30 శాతానికి దిగిరానున్నది. అలాగే మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్‌ఆర్)ని కూడా 35 బేసిస్ పాయింట్లు కోత విధించింది బ్యాంక్.

మానవాళి మనుగడనే కరోనా వైరస్ ప్రశ్నార్థకం చేస్తున్నది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థనే ఈ మహమ్మారి ఛిన్నాభిన్నం చేస్తున్నది. ఈ పెను ఉత్పాతం నుంచి తమ ప్రజలను, ఆర్థిక వ్యవస్థను రక్షించుకునేందుకు అనేక దేశాలు పటిష్ఠమైన చర్యల్నే తీసుకుంటున్నాయి. కరోనాను సమర్థంగా తట్టుకుని ఆర్థికంగా నిలబడేందుకు ప్రతీ దేశం ప్రయత్నిస్తున్నది. ఆయా దేశాల ఆర్థిక స్థితిగతి కంటే రెట్టింపు స్థాయిలో ఉద్దీపన ప్యాకేజీలను ప్రకటిస్తున్నాయి.




# ఉద్దీపనల్లో మనమెక్కడ

**బ్రిటన్**
- ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి 350 బిలియన్ యూరోలు, ఇతర అత్యవసరాల కోసం 20 బిలియన్ యూరోలను కేటాయించారు
- వ్యాపార సంస్థలకు ఏడాదిపాటు వడ్డీలేని రుణాల్ని అందజేస్తుంది
- అద్దె గృహాల్లో నివసించేవారికి సాయం చేసేందుకు ఒక బిలియన్ పౌండ్లను కేటాయించింది

**కెనడా**
- కరోనాతో నష్టపోయిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు 52 బిలియన్ డాలర్ల ప్రత్యేక ఉద్దీపన ప్యాకేజీ
- 214 బిలియన్ డాలర్ల రుణాల మంజూరుకు బ్యాంకులు అంగీకారం
- 7.1 బిలియన్ డాలర్ల మేరకు వ్యాపార రుణాలు మంజూరు

**అమెరికా**
- 2 ట్రిలియన్ డాలర్ల ఉద్దీపన ప్యాకేజీ ప్రకటన
- కేవలం వృద్ధులకు 1000 డాలర్ల చొప్పున చెల్లించేందుకు 500 బిలియన్ డాలర్ల కేటాయింపు
- చిన్న వ్యాపార సంస్థలకు 500 బిలియన్ డాలర్లు
- వ్యక్తిగతంగా, కుటుంబాలకు నేరుగా చెల్లించేందుకు 250 బిలియన్ డాలర్లు
- నిరుద్యోగులకు బీమా ప్రయోజనాల్ని అందించేందుకు 250 బిలియన్ డాలర్లు

**ఫ్రాన్స్**
- 49 బిలియన్ డాలర్ల ఆర్థిక ప్యాకేజీ
- సామాజిక భద్రత పన్ను గణనీయంగా తగ్గింపు
- నిరుద్యోగ భృతి
- దుకాణదారులు, స్వయం ఉపాధి పొందేవారికి ప్రత్యేక ఫండ్
- వ్యాపారాలకు ఆర్థిక సాయం అందించేందుకు సుమారు 327 బిలియన్ డాలర్లదాకా బ్యాంకు గ్యారెంటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మనకంటే ఎంతో చిన్న దేశం ఇండోనేషియా.. కోవిడ్‌ను తట్టుకునేందుకు రెండుసార్లు ఉద్దీపనలను ప్రకటించింది. పలు దేశాలు చిన్న, మధ్యస్థ వ్యాపార పరిశ్రమలను ఆర్థికంగా ఆదుకునేందుకు నడుం బిగించాయి. కొన్ని ఆర్థిక వ్యవస్థలోకి నేరుగా సొమ్మును ప్రవేశపెట్టగా.. మరికొన్ని ప్రజా ఆహార పంపిణీ వ్యవస్థ మీద దృష్టి పెట్టాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి తమ సభ్య దేశాలకు లక్ష కోట్ల డాలర్ల సాయం చేయడానికి ముందుకొచ్చింది. ఒక దేశం కోవిడ్-19కు ఎదురొడ్డి శ్రమిస్తున్న వైద్య సిబ్బందికి గౌరవ వేతనం ప్రకటించింది. ఈ కోవలో మన ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా నిలుస్తారు. డాక్టర్లు, మెడికల్ సిబ్బంది, పోలీసులు, పారిశుధ్య కార్మికులకు దేశంలోనే ప్రప్రథమంగా నగదు ప్రోత్సాహాన్ని అందజేస్తామని అధికారికంగా ప్రకటించారు. రిటైల్ సంస్థలు, హోటళ్లు, విమానయాన సంస్థలు వంటి వాటిని పలు దేశాలు ప్రత్యేకంగా ఆదుకుంటున్నాయి.

**జర్మనీ**
- కరోనా వైరస్ వల్ల ఆర్థికంగా చితికిపోయిన సంస్థలను ఆదుకునేందుకు 610 బిలియన్ డాలర్లు
- బావారియా రీజియన్ పది బిలియన్ల యూరోలతో ప్రత్యేకంగా ఫండ్‌ను ప్రకటించింది
- చిన్న సంస్థలకు 100 శాతం పూచీకత్తు రుణాలు
- మధ్యశ్రేణి కంపెనీలకూ ఆర్థిక చేయూత

**యూఏఈ**
- చిన్నతరహా సంస్థలను (ఎస్ఎంఈ) ఆర్థికంగా ఆదుకునేందుకు 27.2 బిలియన్ డాలర్లు కేటాయింపు
- ప్రజలు, వ్యాపార సంస్థలకు మంచినీరు, విద్యుత్తును అందించేందుకూ సహాయం
- ఈ ఏడాది ఆఖరుదాకా టోల్ ట్యాక్సులు రద్దు
- మార్కెట్ ఫండ్ల కోసం ఒక బిలియన్ దినార్ల నగదు లభ్యత
- పర్యాటక, వినోద రంగాలు చెల్లించే పన్నుపై ఇరవై శాతం వెనక్కి

**సింగపూర్**
- వ్యాపార సంస్థలకు వెన్నుదన్నుగా నిలిచేందుకు, ఉద్యోగంతో పాటు నగదు ప్రవాహాన్ని కల్పించేందుకు దాదాపు 4 బిలియన్ డాలర్ల ప్యాకేజీ కేటాయించింది
- ఆర్థిక వ్యవస్థ మెరుగయ్యేంత వరకూ 8.3 బిలియన్ డాలర్లను కేటాయించింది
- వ్యాపారులకు, కుటుంబాలను ఆదుకునేందుకు 5.6 బిలియన్ డాలర్లను ప్రత్యేకంగా కేటాయించింది

**మన ఉద్దీపన ప్యాకేజీ మాటేమిటి?**

**కోవిడ్-19 ఉత్పాతాన్ని సమర్థంగా అధిగమించేందుకు భారత ప్రభుత్వం రిజర్వు బ్యాంకుతో కలిసి ప్రత్యేక ఉద్దీపన ప్యాకేజీని ప్రకటించింది.**
- రెపో, రివర్స్ రెపో రేట్లను తగ్గించింది. దీనివల్ల ఆర్థిక వ్యవస్థలో సొమ్ము లభ్యత పెరుగుతుంది
- నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)ని ఒక శాతం తగ్గించింది. దీంతో 1.37 లక్షల కోట్లు బ్యాంకింగ్ రంగంలోకి అందుబాటులోకి వస్తున్నాయి
- టర్మ్ రుణాలపై మూడు నెలల మారటోరియం
- ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ పథకం కింద గ్రామీణ, పట్టణ నిరుపేదలు, రైతులు, వలస కార్మికుల శ్రేయస్సు కోసం రూ.1.70 లక్షల కోట్లను కేటాయించింది. రోజువారీ కూలీలు, వితంతువులు, స్వయం సహాయక బృందాలు, పింఛన్‌దారులు, వికలాంగులకు ఆహార భద్రతను కల్పించడంతోపాటు పట్టణ, గ్రామీణ వ్యవస్థను ఆర్థికంగా ఆదుకునేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నది.





## షూటింగ్ ప్రపంచకప్ రద్దు




**న్యూఢిల్లీ:** కొవిడ్-19 విజృంభిస్తున్న నేపథ్యంలో వచ్చే నెలలో ఢిల్లీ వేదికగా జరుగాల్సి ఉన్న షూటింగ్ ప్రపంచకప్‌ను రద్దైంది. ముందస్తు షెడ్యూల్ ప్రకారం మార్చి 15 నుంచి 26 వరకు జరుగాల్సి ఉన్న ఈ టోర్నీని.. తొలుత మే 5 నుంచి 12 మధ్య నిర్వహించాలని నిర్ణయించినా.. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రపంచకప్‌ను రద్దు చేస్తున్నట్లు అంతర్జాతీయ షూటింగ్ సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) ప్రకటించింది. 'కొవిడ్-19 కారణంగా.. రైఫిల్, పిస్టల్, షాట్‌గన్ విభాగాల్లో ప్రపంచకప్‌ను రద్దు చేయాలని నిర్ణయించుకున్నాం' అని ఐఎస్ఎస్ఎఫ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.

### జూలై చివరి వరకు
## షట్లర్లకు రెస్ట్

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ మహమ్మారి ప్రబలుతున్న నేపథ్యంలో.. బీడబ్ల్యూఎఫ్ అన్నీ టోర్నమెంట్‌లను జూలై చివరి వరకు రద్దు చేసింది. సీనియర్, జూనియర్, పారా టోర్నీలేవి నిర్వహించకూడదని నిర్ణయించింది. 'కొవిడ్-19 పంజా విసురుతున్న సమయంలో అన్నీ టోర్నీలను జూలై చివరి వరకు రద్దు చేశాం. ఆటకంటే ప్లేయర్ల ఆరోగ్యమే ముఖ్యం' అని బీడబ్ల్యూఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది.

# మలింగపై ధోనీదే పైచేయి

- **న్యూజిలాండ్ మాజీ ఆల్‌రౌండర్ స్టైరిస్ వ్యాఖ్య**





**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో యార్కర్ కింగ్ లసిత్ మలింగపై ప్రపంచ అత్యుత్తమ ఫినిషర్ మహేంద్రసింగ్ ధోనీదే పైచేయి అని న్యూజిలాండ్ మాజీ ఆల్ రౌండర్ స్కాట్ స్టైరిస్ అభిప్రాయపడ్డాడు. భారత క్రికెట్‌కు ఐపీఎల్ మేలు చేసిందని అతడు పేర్కొన్నాడు. 'ఐపీఎల్లో నిలకడైన జట్టు ఏదైనా ఉందంటే అది కచ్చితంగా చెన్నై సూపర్ కింగ్సే. ముంబై జట్టు స్టార్లను తయారు చేస్తుంటే.. చెన్నై అన్‌క్యాప్డ్ ప్లేయర్ల నుంచే అత్యుత్తమ ప్రదర్శన రాబట్టి వారిని జాతీయ జట్టుకు ఎంపికయ్యేలా చేస్తున్నది. బెస్ట్ ఫినిషర్ విషయానికొస్తే.. డెత్‌ఓవర్స్‌లో అత్యుత్తమంగా బౌలింగ్ చేసే మలింగపై ధోనీదే పైచేయి' అని స్టైరిస్ అన్నాడు.

మరోవైపు టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత సంజయ్ మంజ్రేకర్ మాట్లాడుతూ.. ఐపీఎల్లో గత కొన్నేళ్లుగా చెన్నైను ముంబై భయపెడుతున్నదని పేర్కొన్నాడు. 'ఐపీఎల్ ఫైనల్స్‌లో గతకొన్నేళ్లుగా చక్కటి ప్రదర్శన కనబరుస్తునన ముంబై.. చెన్నై కంటే ఉత్తమంగా ఉంది. 12 ఏండ్ల చరిత్రలో 10 సీజన్‌లు ఆడిన చెన్నై ఎనిమిదిసార్లు ఫైనల్ చేరి మూడుసార్లు టైటిల్ నెగ్గింది. మరోవైపు ముంబై ఐదుసార్లు తుదిపోరుకు అర్హత సాధించి అందులో నాలుగుసార్లు టైటిల్ ఎగరేసుకుపోయింది. అంటే ముంబై ముందంజలో ఉన్నట్లే' అని మంజ్రేకర్ అన్నాడు.

## గోపీచంద్ రూ. 26 లక్షల విరాళం



**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు జరుగుతున్న పోరాటానికి.. జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ తన వంతు సాయం అందించాడు. మహమ్మారిపై పోరాడేందుకు రూ. 26 లక్షలను విరాళంగా ఇచ్చిన్నట్లు సోమవారం ప్రకటించాడు. రూ. 11 లక్షలను పీఎం కేర్స్ నిధికి, రూ. 10 లక్షలను తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి, రూ. 5 లక్షలు ఆంధ్రప్రదేశ్ సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందించినట్లు వెల్లడించాడు. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో గొప్పగా పోరాడుతున్నాయని.. వారికి నా వంతు సాయం అందిస్తున్నానని గోపీచంద్ పేర్కొన్నాడు. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వ మార్గనిర్దేశకాలను పాటిస్తూ కడప దాటకుండా ఇంట్లోనే ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చాడు.

**పంకజ్ అద్వానీ రూ. 5 లక్షలు**

కొవిడ్-19పై సాగుతున్న పోరాటానికి క్రీడాకారులు తమవంతు సాయం అందిస్తూనే ఉన్నారు. తాజాగా భారత స్టార్ క్యూయిస్ట్ పంకజ్ అద్వానీ రూ. 5 లక్షల విరాళం ప్రకటించాడు. 'కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు నా వంతు సహాయం చేస్తున్నా. ప్రధాని సహాయ నిధికి రూ. 5 లక్షలు అందజేస్తున్నా. విపత్కర సమయంలో ప్రజలకు అవగాహనతో పాటు ప్రేమ, వాత్సల్యాన్ని పంచండి. జై హింద్' అని పంకజ్ ట్విట్టర్‌లో పేర్కొన్నాడు.

## ఎవరేమనుకున్నా.. ఒలింపిక్సే నా లక్ష్యం



సుశీల్ కుమార్

**న్యూఢిల్లీ:** పనైపోయిందని అనుకున్న ప్రతిసారీ తానేంటో నిరూపించుకున్నానని భారత స్టార్ రెజ్లర్ సుశీల్ కుమార్ అంటున్నాడు. తనలో సత్తా తగ్గిందని ప్రజలు భావిస్తున్నా.. ఇలాంటి వ్యాఖ్యలను పెద్దగా పట్టించుకోనని ఈ మల్లయోధుడు పేర్కొన్నాడు. ఎవరు ఏమనుకున్నా.. వచ్చే ఏడాది జరిగే టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొంటానని ఆశాభావం వ్యక్తం చేశాడు. అందుకోసం ప్రాక్టీస్ ముమ్మరం చేస్తానని పేర్కొన్నాడు. 'ఇక పై నా దృష్టంతా ప్రాక్టీస్‌పైనే. ఎక్కడికి వెళ్లాలనుకోవడం లేదు. టోక్యో ఒలింపిక్స్‌కు పూర్తిస్థాయిలో సిద్ధమయ్యేందుకు అవసరమైనంత సమయం ఉంది. ప్రస్తుతానికి రెండు రోజులకోసారి సాధన చేస్తున్నా' అని సుశీల్ అన్నాడు. కాగా డోప్ టెస్టులో విఫలమై నాలుగేండ్ల నిషేధం ఎదుర్కొంటున్న మరో యువ రెజ్లర్ నర్సింగ్ యాదవ్ ఈ ఏడాది జూలైలో బ్యాన్ పూర్తి చేసుకోనున్నాడు. అతడికి కూడా అవకాశం ఇవ్వాలని భారత రెజ్లింగ్ సమాఖ్య నిర్ణయించడంతో ఈ ఇద్దరి మధ్య మరోసారి రసవత్తర పోరు సాగే అవకాశాలున్నాయి. 2012 లండన్ ఒలింపిక్స్‌లో సుశీల్ కాంస్యం నెగ్గగా.. 2016 రియో ఒలింపిక్స్‌కు అర్హత సాధించలేకపోయాడు. క్వాలిఫయింగ్ పోటీల్లో నర్సింగ్ చేతిలో ఓటమి పాలై విశ్వక్రీడల్లో పాల్గొనే అవకాశం కోల్పోయాడు.

## కివీస్ మాజీ క్రికెటర్ కన్నుమూత



**వెల్లింగ్టన్:** న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ జాక్ ఎడ్వర్ట్స్ (64) సోమవారం కన్నుమూశాడు. వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్‌గా మంచి గుర్తింపు సాధించిన ఎడ్వర్ట్స్.. అప్పట్లో పించ్ హిట్టర్‌గా మెరుపులు మెరిపించాడు. 1974 నుంచి 1985 మధ్య న్యూజిలాండ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఎడ్వర్ట్స్ 6 టెస్టులు, 8 వన్డేలు ఆడాడు.

## తప్పుకునే తరుణమొచ్చింది

- **హఫీజ్, మాలిక్‌పై రమీజ్**




**కరాచీ:** పాకిస్థాన్ సీనియర్ ఆటగాళ్లు మహ్మద్ హఫీజ్, షోయబ్ మాలిక్.. అంతర్జాతీయ క్రికెట్ నుంచి గౌరవంగా తప్పుకుంటే బాగుంటుందని ఆ దేశ మాజీ కెప్టెన్ రమీజ్ రాజా పేర్కొన్నాడు. 'వాళ్లు (మాలిక్, హఫీజ్) అంతర్జాతీయ క్రికెట్ నుంచి గౌరవంగా తప్పుకుంటే బాగుంటుంది. దేశానికి వారు అందించిన సేవలు వెలకట్టలేనివి. కానీ రిటైర్ కావాల్సిన సమయం ఆసన్నమైందని నేను భావిస్తున్నా' అని రమీజ్ సోమవారం అన్నాడు. 39 ఏండ్ల హఫీజ్, 38 ఏండ్ల మాలిక్ ఇప్పుడే వైదొలిగితే ప్రత్యామ్నాయాలకు వీలుంటుందని రమీజ్ వ్యాఖ్యానించాడు. కాగా వీరిద్దరూ ప్రస్తుతం పొట్టి ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్నారు. ఈ ఏడాది ఆసీస్ వేదికగా జరుగాల్సి ఉన్న టీ20 ప్రపంచకప్ అనంతరం అన్నీ ఫార్మాట్‌ల నుంచి తప్పుకోనున్నట్లు హఫీజ్ గతంలోనే పేర్కొన్న విషయం తెలిసిందే.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

నమస్తే తెలంగాణ
నిపుణ
[ హైదరాబాద్ ]
మంగళవారం 7 ఏప్రిల్ 2020

**రాష్ట్ర రాజధాని సిగలో మాణిక్యంగా భాసిల్లుతున్న విద్యాసంస్థ. విభిన్నమైన కోర్సులతో, ప్రఖ్యాత ఫ్యాకల్టీలు, ప్రపంచస్థాయి ల్యాబ్‌లతో పరిశోధనలకు పేరుగాంచిన సంస్థ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్. సుమారు 100కు పైగా విభిన్నమైన కోర్సుల్లో ప్రవేశాలకు ప్రకటన ఇచ్చింది. ఇంటర్, డిగ్రీ, పీజీ చేసినవారు ఆయా కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చు. ఇంటర్ చదివినవారికి ఇంటిగ్రేటెడ్ కోర్సులతో పాటు, పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్‌ను అందిస్తుంది ఈ సెంట్రల్ యూనివర్సిటీ. ఈ సంస్థ గురించి, ఆయా కోర్సులు-అర్హతలు, దరఖాస్తు తదితర వివరాలు సంక్షిప్తంగా నిపుణ పాఠకుల కోసం..**

# విభిన్న కోర్సుల వేదిక

## యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్

- యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ దేశంలోని సెంట్రల్ యూనివర్సిటీల్లో ఒకటి. దీన్ని 1974లో సరోజినీ నాయుడుకు చెందిన అబిడ్స్‌లోని గోల్డెన్ థ్రెషోల్డ్‌లో ప్రారంభించారు. తర్వాత కాలంలో గచ్చిబౌలిలోని సువిశాలమైన 2,300 ఎకరాల క్యాంపస్‌కు దీన్ని తరలించారు. ఒక్కో విభాగాన్ని ఏర్పాటు చేస్తూ నేడు దేశంలోని ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఒకటిగా నిలిచింది. గతేడాది ఇక్కడ జరిగిన ప్లేస్‌మెంట్లలో హెచ్‌సీయూ విద్యార్థిని సుమారు కోటిన్నర వార్షిక ప్యాకేజీతో ఉద్యోగం పొంది వార్తల్లో నిలిచింది.
- యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో 12 స్కూల్స్, 41 డిపార్ట్‌మెంట్లు ఉన్నాయి.

### యూనివర్సిటీ ప్రత్యేకతలు

- కేంద్రం 2019లో ఈ సంస్థను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినియెన్స్ (ఐవోఈ)గా ప్రకటించింది.
- సెంట్రల్ యూనివర్సిటీల్లో టాప్ (2015 ర్యాంకింగ్స్‌లో)
- కేంద్రం ప్రకటించిన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో 4వ స్థానం
- క్యూఎస్ గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో దేశంలోని జాబితాలో స్థానం సంపాదించిన యూనివర్సిటీలో యూవోహెచ్ ఒకటి.
- న్యాక్ ఏ++++ గ్రేడ్
- విద్యార్థి, టీచర్ నిష్పత్తి - 10: 1
- ప్రపంచస్థాయి ల్యాబొరేటరీ సౌకర్యాలు
- **ప్రవేశాలు:** సుమారు వందకు పైగా కోర్సులను యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ అందిస్తుంది. దీని కోసం ఎంట్రెన్స్ టెస్ట్‌ను నిర్వహిస్తుంది. మరికొన్ని కోర్సులకు జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంక్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తుంది.

### కోర్సులు- అర్హతలు

**ఇంటిగ్రేటెడ్ మాస్టర్ డిగ్రీ (ఐదేండ్లు)**

- ఎమ్మెస్సీ (మ్యాథమెటికల్ సైన్సెస్, ఫిజిక్స్, కెమికల్ సైన్సెస్, సిస్టమ్స్ బయాలజీ, అప్లయిడ్ బయాలజీ)- కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్‌లో సైన్స్ సబ్జెక్టులతో ఉత్తీర్ణత. మ్యాథ్స్ కోర్సులకు మ్యాథ్స్ సబ్జెక్టు తప్పనిసరిగా చదివి ఉండాలి.

**ఎమ్మెస్సీ (హెల్త్ సైకాలజీ)- ఐదేండ్లు**

- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్‌లో ఆర్ట్స్ లేదా సైన్సెస్ ఉత్తీర్ణత.
- ఎంఏ (హ్యూమానిటీస్- తెలుగు, లాంగ్వేజ్ సైన్సెస్, హిందీ)- ఐదేండ్లు
- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో తెలుగు/హిందీ లేదా ఇంగ్లిష్‌లను ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి లేదా తత్సమానకోర్సు ఉత్తీర్ణత.
- ఎంఏ (సోషల్ సైన్సెస్- ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, ఆంత్రోపాలజీ)
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్ లేదా 10+2 ఉత్తీర్ణత.

**ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ఆప్టోమెట్రీ (ఆరేండ్లు)**

- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్‌లో బైపీసీ/ఎంపీసీ ఉత్తీర్ణత. ఇంగ్లిష్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.




### ముఖ్యతేదీలు

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మే 3
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600/, ఈడబ్ల్యూఎస్- 550/-, ఓబీసీలకు రూ.400, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీలకు రూ.275/-
- **వెబ్‌సైట్:** http://www.uohyd.ac.in

### పీజీ కోర్సులు

- ఎమ్మెస్సీ (మ్యాథ్స్, అప్లయిడ్ మ్యాథ్స్, స్టాటిస్టిక్స్- ఆపరేషన్స్ రిసెర్చ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోకెమిస్ట్రీ, ప్లాంట్ బయాలజీ, మాలిక్యులర్ బయాలజీ, యానిమల్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ), ఎంపీహెచ్ (పబ్లిక్ హెల్త్), ఎమ్మెస్సీ (ఓషన్ అండ్ అట్మాస్ఫియరిక్ సైన్సెస్, హెల్త్ సైకాలజీ, నేచురల్ అండ్ కాగ్నిటివ్ సైన్సెస్)
- ఎంఏ (ఇంగ్లిష్, ఫిలాసఫీ, హిందీ, తెలుగు, ఉర్దూ, అప్లయిడ్ లింగ్విస్టిక్స్, కంపారిటివ్ లిటరేచర్, సంస్కృతం, ఇంగ్లిష్ లాంగ్వేజ్ స్టడీస్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, ఆంత్రోపాలజీ, ఎడ్యుకేషన్, జెండర్ స్టడీస్, ఎకనామిక్స్, ఫైనాన్షియల్ ఎకనామిక్స్)
- వీటితోపాటు సరోజినీ నాయుడు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్‌లో ఎంపీఏ (డ్యాన్స్-కూచిపూడి, భరతనాట్యం), ఎంపీఏ (థియేటర్ ఆర్ట్స్), ఎంఎఫ్ఏ (పెయింటింగ్, ప్రింట్ మేకింగ్, స్కల్ప్చర్), ఎంఏ (కమ్యూనికేషన్ మీడియా స్టడీస్/మీడియా ప్రాక్టీస్) ఉన్నాయి.
- మేనేజ్‌మెంట్ కోర్సులు- ఎంబీఏ, ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ, ఎంసీఏ, ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ (జోసా ద్వారా), ఎంటెక్ కోర్సులు, ఎంఫిల్ కోర్సులు. ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ/పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్.
- **అర్హతలు:** పైన పేర్కొన్న కోర్సులకు సంబంధిత సబ్జెక్టుల్లో ఇంటర్/డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత.
- **ఎంపిక:** యూనివర్సిటీ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా, జోసా కౌన్సెలింగ్ ద్వారా, సీసీఎంటీ, గేట్, క్యాట్ తదితర జాతీయస్థాయి ఎంట్రెన్స్‌లలో వచ్చిన ర్యాంక్ ఆధారంగా దరఖాస్తు చేసుకున్నవారిని ఎంపికచేస్తారు.

...✍ కేశవపంతుల వేంకటేశ్వరశర్మ

# మాయదారి రోగాలు

**కంటికి కనిపించని కరోనా ప్రపంచాన్ని వణికిస్తోంది. ప్రపంచ జనాభాలో దాదాపు మూడో వంతు ప్రజలు ప్రస్తుతం లాక్‌డౌన్‌లో ఉన్నారు. ఇప్పటికే 180 దేశాల్లో ఈ మహమ్మారి విస్తరించింది. ప్రజల ఆర్థిక జీవనంపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఇప్పటికే ఎన్నో సాంస్కృతిక, క్రీడాంశాలు వాయిదా పడటమో, రద్దు కావడమో జరిగింది. అకడమిక్, పోటీ పరీక్షలెన్నో వాయిదా పడ్డాయి. 160కి పైగా దేశాల్లో అన్ని విద్యా సంస్థలను మూసివేయడంతో 1.5 బిలియన్ కంటే ఎక్కువ మంది విద్యార్థులపై దీని ప్రభావం పడింది.**

### మహమ్మారిగా ప్రకటించడమంటే..

- మనిషి నుంచి మనిషికి వేగంగా వ్యాపిస్తూ, ఎన్నో దేశాలకు వైరస్ వేగంగా విస్తరిస్తూ ఉంటే దానిని మహమ్మారిగా ప్రకటిస్తారు. తొలిసారిగా 2009లో స్వైన్‌ఫ్లూ విజృంభించినప్పుడు దానిని మహమ్మరిగా ప్రకటించారు. ప్రస్తుతం విజృంభిస్తున్న కరోనాను కూడా మహమ్మారిగా ప్రకటించారు. దీంతో హెల్త్ ఎమర్జెన్సీని ప్రపంచ ఆరోగ్య సంస్థ జనవరి 30, 2020న ప్రకటించింది. మహమ్మరిగా దీనిని మార్చి 11న పేర్కొంది. ఇలా వైరస్‌లు విజృంభిస్తున్నప్పుడ ఉ ఉపయోగించే పదాల్లో తేడా ఉంటుంది. ఔట్‌బ్రేక్ (వ్యాప్తి), ఎపిడమిక్ (అంటువ్యాధి), పాండమిక్ (మహమ్మారి)
- **ఔట్‌బ్రేక్:** ఒక నిర్ణీత ప్రాంతంలో ఒక రోగం విస్తరిస్తున్నప్పుడు దానిని ఔట్‌బ్రేక్‌గా వ్యవహరిస్తారు.
- **ఎపిడమిక్:** ఇది కూడా ఔటబ్రేక్ లాంటిదే. అయితే విస్తీర్ణం రీత్యా అతి ఎక్కువ ప్రాంతంలో ఉంటుంది. ఔట్‌బ్రేక్ చిన్న భౌగోళిక ప్రాంతంలో, ఎపిడమిక్ విశాల భూభాగంలో వేగంగా వ్యాపిస్తున్నప్పుడు ఉపయోగించే పదాలు.
- **పాండమిక్:** వేర్వేరు దేశాలు, ఖండాలకు విస్తరించి ఎక్కువ సంఖ్యలో ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపితే దానిని పాండమిక్‌గా ప్రకటిస్తారు.
- అలాగే వేర్వేరు సందర్భాల్లో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచ వ్యాప్తంగా హెల్త్ ఎమర్జెన్సీలను ప్రకటిస్తూ ఉంటుంది. కింద పేర్కొన్న నిబంధనల ఆధారంగా ఆ ప్రకటన ఉంటుంది.

1. ఒక రోగం విస్తరిస్తూ ప్రపంచంలోని ఇతర దేశాలకు పాకి, ఆరోగ్యపరంగా ప్రమాదకరంగా మారే అవకాశం పొంచి ఉన్నప్పుడు
2. అంతర్జాతీయ స్థాయిలో ఒక సమన్వయ రీతిలో స్పందన అవసరం అయినప్పుడు. అంటే ఊహించని రీతిలో తీవ్ర పరిస్థితి ఉండటం, మొదట ప్రభావం చెందిన దేశ సరిహద్దులు దాటి ఇతర దేశాల్లో వేగంగా విస్తరించే ప్రమాదం ఉండటం, సత్వరం అంతర్జాతీయ దేశాల చర్యలు అవసరం కావాల్సినప్పుడు ఆరోగ్య ఎమర్జెన్సీని ప్రకటిస్తారు. ఇప్పటివరకు ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించిన సందర్భాలు..

2009– స్వైన్‌ఫ్లూ
2014– పోలియో, ఎబోలా
2016– జికా
2019– ఎబోలా
2020– కరోనా



| సంవత్సరం | వైరస్ | ఇతర అంశాలు |
|---|---|---|
| 2009 | ఇన్‌ఫ్లూయెంజా | 1918లోనే దీనిని గుర్తించారు. అయితే వైరస్ తన రూపాన్ని మార్చుకుంటూ వేర్వేరు సందర్భాల్లో వేర్వేరు దేశాల్లో విజృంభించింది. 1976, 88 సంవత్సరాల్లో అమెరికాలో, 2007లో ఫిలిప్పీన్స్‌లో అలాగే 2009లో మరోసారి అమెరికాలో ఇది విజృంభించడంతో మహమ్మరిగా ప్రకటించారు |
| 2014 | పోలియో | చారిత్రక యుగం నుంచి పోలియో ఉంది. పోలియోతో బాధపడుతున్న వారి చిత్రాలు ఈజిప్ట్‌లో కనిపిస్తాయి. అయితే దీనిని క్లినికల్‌గా తొలిసారిగా 1789లో మైఖేల్ అండర్ ఉండ్ నిర్వచించారు. భారత్ పోలియో రహిత దేశంగా మార్చి 2014లో ప్రకటించారు |
| 2014 | ఎబోలా | తొలిసారిగా 1976లో దీనిని రెండు ప్రదేశాల్లో గుర్తించారు. అవి 1. ఎన్‌జరా (దక్షిణ సూడాన్), యంబూకూ (డెమక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో), ఈ నగరం ఎబోలా నది ఒడ్డున ఉండటంతో ఈ వైరస్‌కు అదే పేరుపెట్టారు. |
| 2016 | జికా | ఉగాండాలో జికా అడవుల్లో తొలిసారిగా 1947లో వైరస్‌ను గుర్తించారు. అందుకే దీనికి ఆ పేరు వచ్చింది. 2007 నుంచి 16 మధ్య ఇది పసిఫిక్ మహాసముద్రంలో తూర్పు దిశగా తీవ్రంగా వ్యాపించి 2015-16 నాటికి తీవ్ర రూపం దాల్చింది. ముఖ్యంగా బ్రెజిల్‌లో ఇది విజృంభించింది. |
| 2019 | ఎబోలా | డెమక్రటిక రిపబ్లిక్ ఆఫ్ కాంగోలోని కివూ అనే ప్రాంతంలో తూర్పు భాగంలో ఆగస్ట్ 1, 2018న ప్రారంభమయ్యింది. ఆ తర్వాత వేగంగా విస్తరించింది. |

- కరోనా వైరస్‌ను తొలిసారిగా చైనాలోని వుహాన్‌లో గుర్తించారు.
- భారత్‌లో తొలి కరోనా కేసు కేరళలో జనవరి 30న నమోదయ్యింది. వుహాన్‌లో చదువుకుంటూ కరోనా నేపథ్యంలో భారత్‌కు వచ్చిన విద్యార్థిలో దీనిని గుర్తించారు.
- కరోనాను అరికట్టేందుకు భారత్‌లో తొలి ఆస్పత్రిని రిలయన్స్ సంస్థ ముంబయిలో ఏర్పాటు చేసింది.
- కరోనాను అరికట్టేందుకు ప్రభుత్వ వ్యయంతో ఆస్పత్రులను తొలిసారిగా నిర్మిస్తున్న రాష్ట్రం ఒడిశా. 1000 పడకలతో రెండు ఆస్పత్రులను నిర్మిస్తున్నారు. కార్పొరేట్ సాంఘిక బాధ్యతలో భాగంగా ఒడిశా మైనింగ్ కార్పొరేషన్, మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ సంస్థలు నిధులను సమకూరుస్తున్నాయి.
- వైరస్ విజృంభణ నేపథ్యంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి వెళ్లే అవకాశం ఉందని వివిధ ఆర్థిక సంస్థలు అంచనా వేస్తున్నాయి.
- ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసు (సప్లయ్-చైన్) మార్కెట్‌కు తీవ్ర విఘాతం కలిగింది.
- ఒలింపిక్స్‌తో సహా ఐపీఎల్ తదితర ప్రధాన క్రీడా పోటీలు వాయిదా పడటమో రద్దవడమో జరిగింది.
- పర్యాటకం, హోటల్ తదితర రంగాలు కూడా వైరస్ ధాటికి కుదేలయ్యాయి. నిరుద్యోగం, పేదరికం పెరిగే అవకాశం ఉందని అంచనా.
- కరోనా వైరస్ నేపథ్యంలో భారత్‌లో 'ఎపిడమిక్ డిసీజ్ యాక్ట్'-1897ను అమలు చేస్తున్నారు. బ్రిటిష్ ఇండియా పాలనా కాలంలో వచ్చిన చట్టం ఇది. నాటి బాంబే రాష్ట్రంలో ప్లేగు వ్యాధి వ్యాప్తితో ఈ చట్టం చేశారు. వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించిన చట్టం ఇది.
- 2009లో డెంగీ మలేరియాలను నిరోధించేందుకు చండీగఢ్‌లో, కలరా వ్యాప్తిని అడ్డుకొనేందుకు 2015లో గుజరాత్‌లో ఈ చట్టాన్ని ఉపయోగించారు.
- వైరస్ విజృంభణ నేపథ్యంలో రూ 1.70 లక్షల కోట్ల ప్యాకేజీని కేంద్రం ప్రకటించింది. ఆహార భద్రతతో పాటు పేద వర్గాలకు నగదు బదిలీకి సంబంధించిన అంశాలు ఇందులో ఉన్నాయి.

వి.రాజేంద్రశర్మ
ఫ్యాకల్టీ
9849212411



# విద్యార్థులే సారథులు



### ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ చరిత్రకు అస్థిత్వం ఎలా ఉంది?

- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ చారిత్రక అస్థిత్వం అణగదొక్కబడిందని చెప్పవచ్చాయి. చరిత్ర, నిర్లక్ష్యం, పోషణ, పాఠశాలలు, గ్రంథాలయాలు, పండుగలు, తెలంగాణ వైతాళికులు, మత ధార్మిక సాంస్కృతిక సంస్థ పట్ల చూపించే వివక్ష వంటి అంశాలను చర్చించాలి.

1) **చరిత్ర:** తవ్వకాల్లో బయల్పడిన శాతవాహనుల చరిత్ర, రుజువులను మెదక్, కోటిలింగాల, కొండాపూర్ ప్రాంతాల నుంచి అమరావతి ప్రాంతానికి తరలించి శాతవాహనుల చరిత్రను ఆంధ్ర చరిత్రగా రాశారు. ప్రగతిశీల ఉద్యమంగా ప్రచారం చేశారు.

2) **నిర్లక్ష్యం:** వారసత్వ సంపద చిహ్నాలుగా నిల్చిన రామప్ప, వేయిస్తంభాల గుడి, కీసరగుట్ట దేవాలయం పునరుద్ధరణ, ఎలగందుల, భువనగిరి, మహబూబ్‌నగర్, రామగిరి నిజామాబాద్ కోటల పునరుద్ధరణ చేయకపోవడం వల్ల వాటి ప్రధాన ద్వారాలు దొంగిలించుకుపోయినా ప్రభుత్వం పట్టించుకోక నిర్లక్ష్యం వహించింది.

3) **నిరాకరణ:** వ్యాకరణ చక్రవర్తిగా పిలిచిన మల్లినాథ సూరికి ఏనాడు ఉమ్మడి ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వలేదు. వరంగల్‌లో జన్మించిన పోతనను కడవలో పుట్టినాడని వశీకరణ చేసి కడవలో ఉత్సవాలు జరపాలని నిర్ణయించడంతో తెలంగాణ వారు ఉద్యమం చేయడంవల్ల నిలిపివేసినవారు.

4) **పాఠశాలలు:** బొల్లారం, చాదర్‌ఘాట్ ప్రాంతాల్లోని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించక తెలంగాణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల పట్ల నిర్లక్ష్యం వహించింది.

5) **గ్రంథాలయాలు:** శాలిబండ, సికింద్రాబాద్, బొల్లారం గ్రంథాలయాలు పునరుద్ధరణ చేయకుండా శిథిలావస్థకు తీసుకొచ్చారు. అలాగే తెలంగాణలోని మిగతా ప్రాంతాల్లో గ్రంథాలయాలకు నిధులు కేటాయించకుండా వివక్ష చూపించారు. గ్రంథాలయాల్లో ఆంధ్ర ప్రాంత ప్రచురణలనే ఉంచడంవల్ల తెలంగాణ సాహిత్యం పట్ల వివక్ష చూపించారు.

6) **పాఠ్య పుస్తకాలు:** ఆంధ్ర ప్రాంత భాషనే ప్రామాణిక భాషగా పుస్తకాల్లో రాశారు. అల్లూరి సీతారామరాజు చరిత్రను రాశారు. కానీ అంతే గొప్పగా పోరాడిన తెలంగాణ ప్రాంత రాంజీగోండ్, కుమ్రం భీంల చరిత్రను విస్మరించారు.

7) **తెలంగాణ పండుగల పట్ల వివక్ష:** తెలంగాణ పండుగ అయిన బతుకమ్మ పండుగను అవహేళన చేయడం, హైదరాబాద్‌లోని కొన్ని అపార్ట్‌మెంట్లలో బతుకమ్మ ఆడుతుంటే డిస్టర్బ్ అవుతుందని హెచ్చరించడం మన సంస్కృతిని హేళన చేయడం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సర్వసాధారణంగా జరిగేది.

8) **సినిమా రంగంలో వివక్ష:** సినీ రంగంలో తెలంగాణ కళాకారులకు అవకాశాలు ఇవ్వకుండా అణగదొక్కడం, సినిమాల్లో హాస్యనటులు, విలన్లకు తెలంగాణ యాసలో మాట్లాడేవిధంగా పాత్రలు నిర్మించి తెలంగాణ భాషను, యాసను కించపర్చడం జరిగింది.

9) **తెలంగాణ వైతాళికుల పట్ల వివక్ష:** ట్యాంక్‌బండ్‌పై 32 విగ్రహాలు పెడితే అందులో కేవలం తెలంగాణవారివి 8 మాత్రమే ఉన్నాయి. విప్లవ కవి శ్రీశ్రీని గుర్తించారు. కానీ మన దాశరథిని విస్మరించారు. విప్లవవీరుడిగా అల్లూరిని పొగిడారు. కానీ తెలంగాణ ప్రాంతానికి చెందిన విప్లవ వీరులైన తుర్రెబాజ్ ఖాన్, రాంజీ గోండు, కుమ్రంభీంలను చరిత్రలో ఏనాడూ చూపలేదు.

- దళిత కవిగా జాషువాను పేర్కొన్నారు. కానీ తెలంగాణ దళిత కవులైన బీఎస్ వెంకట్రావ్, భాగ్యరెడ్డి వర్మను వారి చరిత్ర బయటకు రాకుండా అణగదొక్కారు. మేధావిగా కట్టమంచి రామలింగారెడ్డికి ప్రాధాన్యత ఇచ్చి మన అలీ యావర్ జంగ్ (ఓయూ వీసీ) విస్మరించారు. ఈ విధంగా అన్ని విషయాల్లో తెలంగాణకు అన్యాయం చేశారు.

### ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ విగ్రహాలు

1) శాతవాహనులవి
2) రుద్రమదేవి
3) అబుల్ హసన్ తానీషా
4) భక్త రామదాసు
5) 6వ నిజాం
6) భక్త పోతన
7) సురవరం ప్రతాపరెడ్డి

- తర్వాత కాలంలో ఉద్యమం చేస్తే కుమ్రంభీం, బూర్గుల రామకృష్ణారావు విగ్రహాలు పెట్టారు.

10) **మత ధార్మిక సంస్థల్లో వివక్ష:** వైష్ణవ దేవాలయంగా తిరుపతిని అభివృద్ధి చేశారు. కానీ యాదాద్రిని పట్టించుకోలేదు. బౌద్ధమత ప్రాంతంగా విలసిల్లిన నాగార్జునకొండను విస్మరించి అమరావతిని గొప్పగా చరిత్రలో చెప్పారు. ఇంకా తెలంగాణలోకి అనేక దేవాలయాల పట్ల, జైన, బౌద్ధ స్థావరాల పట్ల వివక్ష చూపించారు.

- ఇలా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన చారిత్రక, సాంస్కృతిక వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమం ఎగసి, ప్రత్యేక తెలంగాణ ద్వారానే వారసత్వ సంపద, మత సాంస్కృతిక విషయాల్లో గౌరవం దక్కుతుందని రాష్ట్ర సాధనలో ప్రజలు పాల్గొని విజయం సాధించి రాష్ట్రాన్ని సాధించుకున్నారు.

### 1969 తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల పాత్రను ఉదాహరణలతో వివరించండి?

- 1969 తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు చాలా కీలక పాత్ర పోషించారు. అసలు ఖమ్మంలో రవీంద్రనాథ్ అనే బీఏ విద్యార్థి 1969, జనవరి 8న నిరాహార దీక్ష చేయడంతోనే ఉద్యమం ప్రారంభమైందని చెప్పవచ్చు. విద్యార్థులు ఉద్యమానికి అనుకూలంగా అనేక కార్యక్రమాలు చేపట్టి ఉద్యమ ప్రభావాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిసేలా చేశారు. 1969 విద్యార్థి ఉద్యమంలో రెండు వర్గాల విద్యార్థులు ఉండేవారు. రక్షణల అమలు కోసం విద్యార్థి రక్షణ సమితి, రాష్ట్ర విభజనకు విద్యార్థి కార్యాచరణ సమితి అని ఉండేవి. విద్యార్థులు చేసిన కార్యక్రమాలను కింది ఉదాహరణలతో చర్చిద్దాం..

1) **నగరంలో తొలి ర్యాలీ:** రక్షణలు కోరుతున్న వెంకట్రామిరెడ్డి వర్గం, విభజనను కోరుతున్న మల్లికార్జున్ వర్గం చేపట్టిన ర్యాలీ సందర్భంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన మొదటిసారిగా 1969 తెలంగాణ ఉద్యమంలో లాఠీచార్జి చేశారు. ఇందులో విద్యార్థి నాయకుడు రమాకాంత్‌తోపాటు మరికొందరు విద్యార్థులకు గాయాలయ్యాయి.

2) **హైదరాబాద్ నగరంలో తొలి కాల్పులు:** శంషాబాద్ రైల్వేస్టేషన్‌పై విద్యార్థులు అధిక సంఖ్యలో దాడి చేశారు. విద్యార్థులను చెదరగొట్టడానికి పోలీసులు మొదటిసారి కాల్పులు జరిపారు. దీనికి నిరసనగా విద్యార్థులు నిజాం కాలేజీలో నిరసర సభను నిర్వహించారు.

3) **సదాశివపేటలో పోలీసుల కాల్పులు:** 1969, జనవరి 24న సదాశివపేటలో విద్యార్థులు నిర్వహించిన ఊరేగింపుపై పోలీసులు కాల్పులు జరపగా శంకర్ అనే విద్యార్థికి బుల్లెట్ తగిలి మరుసటి రోజు అమరుడయ్యారు. ఇలా 1969 ఉద్యమంలో తొలి అమరుడిగా మిగిలిపోయారు.

4) **జిల్లా పర్యటనలు:** మార్చి 8, 9ల్లో హైదరాబాద్‌లోని రెడ్డి హాస్టల్‌లో నిర్వహించనున్న తెలంగాణ సదస్సును విజయవంతం చేయాలని 'విద్యార్థి కార్యాచరణ సమితి' తరపున విద్యార్థులు జిల్లాల పర్యటనలు చేశారు.

5) ప్రత్యేక తెలంగాణ ఏర్పడేవరకు విద్యార్థులు నిరవధిక సమ్మె చేయాలని మార్చి 11 నుంచి విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు.

6) ఉస్మానియా యూనివర్సిటీ 50 ఏండ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా గవర్నర్ ఖండూభాయ్ దేశాయ్ పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేయడానికి వస్తే విద్యార్థులు గవర్నర్‌ను ఘెరావ్ చేసి ప్రత్యేక తెలంగాణ కాంక్షను చాటారు.

7) మార్చి 17న విద్యార్థులు 'ప్రజాస్వామ్య రక్షణ దినం'ను తెలంగాణ అంతటా ప్రభుత్వ కార్యాలయాల ముందు నిర్వహించారు. దీంతో ప్రభుత్వ వివక్షలు బయటపడ్డాయి.

8) మార్చి 28న సుప్రీంకోర్టు ముల్కీ నియమాలు చెల్లవని తీర్పు ఇవ్వడంతో ఉస్మానియా ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు జామై ఉస్మానియా రైల్వేస్టేషన్‌కు నిప్పుపెట్టారు. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులు చనిపోయారు. న్యాయం చేయాల్సిన న్యాయస్థానమే అన్యాయానికి బాసటగా తీర్పు చెప్పడంతో విద్యార్థులు ఉద్యమాన్ని పెద్ద ఎత్తున లేవదీశారు.

9) మేడే రోజున విద్యార్థులు 'డిమాండ్స్ డే' ప్రకటించి పోలీస్ వ్యాన్‌పై బాంబులు విసిరారు. దీంతో ఒక కానిస్టేబుల్ చనిపోయాడు. ఇలా ఉద్యమం హింసాయుతంగా మారుతుందని గ్రహించి క్రమంగా తగ్గించాలనుకున్నారు.

10) విద్యార్థి నాయకుడు మల్లికార్జున్ సికింద్రాబాద్‌లోని గాంధీ విగ్రహం దగ్గర 24 రోజులు నిరాహార దీక్ష చేశారు.

11) అప్పటి హోంమంత్రి జలగం వెంగళరావు కొత్తగూడెంలో సభ నిర్వహించగా విద్యార్థులు ఆందోళన చేయడంతో కాల్పులు జరపగా రాంచందర్, దస్తగిర్ అనే విద్యార్థులు మరణించారు.

- ఈ విధంగా విద్యార్థుల ఉద్యమమే 1969 ఉద్యమాన్ని పెంచి ఉద్యమ తీవ్రతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిసేలా చేసింది. హింసాత్మకంగా మారబోతున్న విద్యార్థి ఉద్యమాన్ని విద్యార్థి నాయకులు తగ్గుముఖం పట్టించారు.

సాసాల మల్లికార్జున్
అసిస్టెంట్ ప్రొఫెసర్
ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, కోరుట్ల
9492 575 006

